Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ ఏకాదశి మ. 1.15 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 12.15 వరకు, అనంతరం శ్రవణం; అమృతకాలం: ఉ. 7.00 వరకు, తె. 3.20 నుండి 5.00 వరకు; వర్జ్యం: సా. 4.40 నుండి 6.26 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

సంపుటి:56 • సంచిక: 331 • మంగళవారం 13 మార్చి 2018 • హైదరాబాద్ • పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



హెడ్‌ఫోన్ విసిరిన కోమటిరెడ్డి

అసెంబ్లీలో ఆగ్రహావేశాలు...
బహిష్కరణే?

స్వామిగౌడ్ కంటికి గాయం



కంటికి గాయంతో సరోజినీదేవి ఆస్పత్రిలో శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్

కార్నియా దెబ్బతింది

సరోజినీదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రవీందర్ గౌడ్

3 లో

దాడి ఎలా జరిగిందంటే..

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజు ఆసాధారణ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సభ్యులు విసిరిన హెడ్ ఫోన్ తగిలి ఏకంగా శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు గాయాలయ్యాయి. కాంగ్రెస్ సభ్యుల నిరసనలు..., నినాదాల హోరు..... గవర్నర్ ప్రసంగ పాఠాన్ని చింపి గవర్నర్‌పై విసరడం..,బీజేపీ సభ్యుల వాకౌట్, గవర్నర్ ప్రసంగానికి మద్దతుగా టీఆర్ఎస్,ఎంఐఎం సభ్యుల చప్పట్ల మధ్య రాష్ట్ర శాసనసభ, మండలి బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలి సంయుక్త సభలను ఉద్దేశించి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రసంగించారు., ఆయన ప్రసంగం 10.30 గంటలకు ముగిసింది. గవర్నర్ ప్రసంగం ప్రారంభించడమే ఆలస్యం... ముందు వరుస కుర్చీల వద్ద నిలబడిన కాంగ్రెస్ సభ్యులు ఒక్కసారిగా వెల్‌లోకి దూసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఈ విషయం ముందే పసిగట్టిన మార్షల్స్ వారిని ➪ 7వ పేజీలో...

సంపత్.. రామ్మోహన్‌రెడ్డి పైనా వేటు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం శాసన సభలో చోటు చేసుకున్న పరిణామాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నట్టు తెలుస్తోంది. గవర్నర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెడ్‌ఫోన్‌ను విసిరిన ఘటనను ఆయన సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న సర్కార్ కోమటిరెడ్డితో పాటు ఆయనకు సహకరించిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, సంపత్‌లపై కూడా వేటు వేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం, సభాపతి, అసెంబ్లీ కార్యదర్శి, న్యాయ నిపుణులతో చర్చించినట్టు ప్రచారం జరుగుతోంది. మైక్ విసిరిన ➪ 7వ పేజీలో...



అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల నిరసన.. (ఇన్‌సెట్‌లో) హెడ్‌ఫోన్ విసురుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఇలా దాడి చేయడం సిగ్గుచేటు. ఇలాంటి ప్రతిపక్షాలను ఎక్కడా చూడలేదు. నీతిబాహ్యమైన ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. బాధ్యులైన వారిని వదలం. ఖచ్చితంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.

- మంత్రి హరీష్ రావు

దాడులు ప్రజాస్వామ్య విరుద్ధం

రాజ్యాంగ వేదికైన అసెంబ్లీని ఇష్టారాజ్యంగా వాడుకోవడం ప్రతిపక్షాలకు ఎంతమాత్రం తగదు. అసెంబ్లీలో ప్రత్యక్ష దాడులు ప్రజాస్వామ్య విరుద్ధం. ప్రతిపక్ష శాసనసభాపక్ష నాయకులు, సభ్యులు హుందాగా వ్యవహరించాలి. ఎన్నికల్లో గెలిచి ప్రజల పక్షాన పనిచేయాల్సిన బాధ్యతలను మరువ తగదు.

- శాసనమండలి చైర్మన్ డా. స్వామిగౌడ్

స్పీకర్‌పై అవిశ్వాసం?

- కాంగ్రెస్, బీజేపీ చర్చ
- టీడీపీ మద్దతు
- కోరాలని ప్రతిపాదన
- ఈ సమావేశాల్లోనే నోటీస్?

9



నా హత్యకు కుట్ర

- సీసీ ఫుటేజీ బయటపెట్టాలి
- గాయంచూపిస్తే క్షమాపణ చెబుతా
- అసెంబ్లీలో అడుగుపెట్టను
- తాగొచ్చిందెవరో స్పీకర్ తేల్చాలి

3 లో



కళ్లజోడుతో కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీఎం కేసీఆర్ సోమవారం కొత్త గెటప్‌లో కనిపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తున్న సమయంలో ప్రసంగ పాఠాన్ని ఆయన కళ్లద్దాలు (కళ్ళజోడు) ధరించి పరిశీలించారు. సాధారణంగా కేసీఆర్ సమీక్షా సమావేశాల్లో, బహిరంగ సభల్లో ఇప్పటిదాకా కళ్ళద్దాలను ఉపయోగించలేదు. సోమవారం అసెంబ్లీలో తొలిసారిగా ఆయన కళ్ళజోడుతో దర్శనమిచ్చారు. గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించిన సమయంలో చొక్కా జేబులో ఉన్న కళ్ళజోడు బయటకు తీసి వాటిని ధరించి ప్రసంగ పాఠాన్ని అధ్యయనం చేశారు. కళ్ళజోడుతో కేసీఆర్ కనిపించడంతో సభకు హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విపక్ష నేతలు ఆయనవైపు ఆసక్తిగా చూడడం కనిపించింది.



సోమవారం తెలంగాణ రాష్ట్ర ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్

విమాన విషాదం



- కాట్మండ్‌లో కుప్పకూలిన యూఎస్ బంగ్లా విమానం
- ల్యాండింగ్ అవుతుండగా ఒక్కసారిగా ఎగిసిపడిన అగ్నికీలలు
- 50 మంది సజీవ దహనం
- ప్రమాద సమయంలో విమానంలో 71మంది
- సురక్షితంగా బయటపడిన వారు 17మంది
- సాంకేతిక కారణాలతోనే ప్రమాదం?

11 లో

కోల్ స్కాం కథ కంచికి...?

- సాక్ష్యాలు సమర్పించలేకపోతున్న దర్యాప్తు సంస్థలు
- నిన్న 2జీ... నేడు బొగ్గు కుంభకోణం
- వేల కోట్ల స్కాముల్లో దోషులకు శిక్షేదీ?

11

కుమార్తె కోసం జైట్లీ మౌనం

పీఎన్‌బీ స్కాంపై రాహుల్ ధ్వజం

9



సంతోష్ నామినేషన్

- రాజ్యసభకు మొత్తం ఐదు
- మూడు తెరాస, ఒకటి కాంగ్రెస్, మరొకటి ఇండిపెండెంట్
- నేడు పరిశీలన
- బరిలో నలుగురు ఉండే అవకాశం

9 లో

బంగారు తెలంగాణ దిశగా వడివడిగా అడుగులు


- అన్నింటా దేశానికి మనమే ఆదర్శం
- సులభతర వాణిజ్యంలో నెంబర్ వన్
- జాతీయ వృద్ధిరేటును అధిగమించాం
- మిషన్ భగీరథలో 95శాతం పనులు పూర్తి
- భారీగా రాష్ట్ర రహదారుల విస్తరణ
- ప్రాజెక్టుల పనులు చూసి ముగ్ధుడినయ్యా
- ఉభయ సభల్లో గవర్నర్ ప్రసంగం

2 లో



దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది సోకులా?

- ప్రజల మనోభావాలతో చెలగాటం తగదు
- నమ్మకం సడలినందుకే పోరాటానికి దిగా
- హామీలు నెరవేర్చమంటే వ్యక్తిగత విమర్శలా?
- జైట్లీ ప్రకటనతోనే కేబినెట్ నుంచి వైదొలిగాం
- ఐదు కోట్ల ఆంధ్రులే మాకు హైకమాండ్
- శాసన మండలిలో ఏపీ సీఎం చంద్రబాబు



10 లో



8

ఆంధ్రప్రదేశ్‌లోని కాజా టోల్‌గేట్ సమీపంలో సొంతింటి నిర్మాణానికి పవన్ దంపతుల భూమిపూజ

స్వామినాథన్ సిఫారసులకు

మేమే శ్రీకారం

- వ్యవసాయ రంగంలో నాలుగు విప్లవాలు
- ఇది యావత్ దేశానికే ఆదర్శం
- ప్రతి పంటకూ కనీస మద్దతు ధర ఇస్తాం
- గుత్తా బాధ్యతల స్వీకార సభలో కేటీఆర్

9 లో



రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా సుఖేందర్‌రెడ్డికి మంత్రి కేటీఆర్ అభినందనలు



బంగారు తెలంగాణ దిశగా....

వడివడిగా అడుగులు

- అన్నింటా దేశానికి మనమే ఆదర్శం
- జాతీయ వృద్ధి రేటును అధిగమించాం
- ప్రాజెక్టుల పనులు చూసి ముగ్ధుడినయ్యా.. గవర్నర్ నరసింహన్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సమ్మిళిత వృద్ధి.., సుస్థిర దృష్టి.., శీఘ్రమైన అభివృద్ధి ప్రాథమిక సిద్ధాంతంగా ముందుకు పోతున్న తమ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రశంసించారు. బంగారు తెలంగాణ దిశలో రాష్ట్రం పురోగమిస్తోందనీ, ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల వల్ల జాతీయ వృద్ధి రేటును రాష్ట్రం అధిగమించిందని చెప్పారు. సోమవారం శాసనసభలో శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగించారు. అరగంట పాటు సాగిన ఆయన ప్రసంగంలో ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించారు. ఆయన ప్రసంగంతో 2018 -19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడచిన మూడున్నరేళ్లుగా ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ గణనీయమైన వృద్ధిని సాధించినట్లు చెప్పారు. దశాబ్దాలుగా రాష్ట్రం అనుభవిస్తున్న క్లిష్టతరమైన అభివృద్ధిలోటును పూడ్చడమే గాక ఇతర రాష్ట్రా లతో పోటీ పడుతోందన్నారు.ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రశంసలు పొందడమే గాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం శ్లాఘించబడుతోందని గవర్నర్ చెప్పారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో బంగారు తెలంగాణ లక్ష్యాన్ని సాధించడానికి విధానాలు రూపొందించేందుకు నిర్మాణాత్మక ,ఉపయుక్తంగా ఉండే చర్చలు కొనసాగుతాయన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి...

రాష్ట్రం ఏర్పడడానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి 4 శాతం ఉండగా, ఆనాడు భారతదేశ వృద్ధి రేటు 5.9 శాతం ఉండేదని, 2014- 15 నుండి 2016- 17వరకు మూడు సంవత్సరాల కాలంలో జాతీయ వృద్ధిరేటు 7.5 శాతం కాగా తెలంగాణ రాష్ట్రం జీఎస్‌డీపీ 8.6 శాతం నమోదైందని, ఇది జాతీయ సగటు కంటె అత్యధికమని నరసింహన్ వెల్లడించారు. అంతేగాక దేశ తలసరి ఆదాయం 2016-17లో రూ. 1.03 లక్షలు కాగా, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1.54 లక్షలుగా అంచనావేయడం జరిగిందని తెలిపారు.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఒక రికార్డు.....

రాష్ట్రంలో వ్యవసాయ రంగం పునరుద్ధరణకు తన ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఈ రంగం తీవ్ర దుస్థితిలో ఉండేదని, సాగునీటి సౌకర్యాలు లేకపోవడం, అస్థిర రుతుపవనాలు, దిగజారిన భూగర్భజలాలతో పంటల ఉత్పాదన దిగజారి ఉండేదని, ఫలితంగా రైతులు ఆర్థికంగా చితికిపోయి ఉండేవారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలు ఈ రెండింటికి సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తూ ఒక సమగ్ర విధానం రూపొందించిందని తెలిపారు. తక్షణ సహాయంగా 35 లక్షల మంది రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేశామని, ఒక్కోరైతుకు రూ. లక్ష మాఫీ చేశామని పేర్కొన్నారు. సూక్ష్మ సేద్యం, గ్రీన్ హౌజ్‌లు, పాలీ హౌజ్‌లు ఏర్పాటుతో ఉత్పాదకతన భారీగా పెరిగిందన్నారు. ప్రభుత్వంచర్యల ఫలితంగా 2016 -17 లో రికార్డు స్థాయిలో 101. 29 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగిందని గవర్నర్ చెప్పారు. అంతేగాక 2018 జనవరి 1నుంచి 23 లక్షల పంప్ సెట్లకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం ఒక రికార్డుగా గవర్నర్ అభివర్ణించారు. అంతేగాక గొర్రెల కాపరుల ఆదాయం పెంచేందుకు గొల్ల ,కురుమలకు 50 లక్షల 10 వేల గొర్రెలను పంపిణీ చేశామని తెలిపారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు 100 సంచార పశువైద్య చికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేశామని, మత్స్యకారులకు చేపల పంపిణీ చేశామని కూడా గవర్నర్ తెలియజేశారు. వ్యవసాయోత్పత్తులను నిల్వచేసేందుకు గోదాముల నిల్వ సామర్థ్యాన్ని 4.17 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 18.30 లక్షల మెట్రిక్ టన్నుల కు పెంచామని , వాటి కోసం 356 శాస్త్రీయ గోదాములను నిర్మాణాన్ని ప్రారంభించి ఇప్పటికే 308 గోదాముల నిర్మాణాలను పూర్తి చేశామని పేర్కొన్నారు.

ధరణి వెబ్‌సైట్‌లో భూరికార్డులు

రాష్ట్రంలోని 10823 గ్రామాలకు పరిధిలోని భూ రికార్డులను పదిలం చేసేందుకు త్వరలో ధరణి వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గ్రామాలలో 1507 బృందాలు సర్వే చేపట్టి భూరికార్డులను ప్రక్షాళన చేశారని, 96శాతానికి చెందిన భూ రికార్డులను ఖాతావారిగా తనిఖీలు నిర్వహించి వివాదాలు లేనివిగా ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు నరసింహన్ తెలిపారు. 100 రోజుల్లోనే రికార్డుల సర్వే జరిగిందన్నారు.



గవర్నర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు

సాగునీటి రంగం

గోదావరి, కృష్ణా నదుల నీటిని సద్వినియోగం చేసేందుకు తన ప్రభుత్వం 23 భారీ సాగునీటి ప్రాజెక్టులు, 13 మధ్యతరహా ప్రాజెక్టులను చేపట్టిందని తెలిపారు. ఇప్పటి వరకు 16.64 లక్షల ఎకరాలకు సాగునీటి సామర్థ్యం కల్పించి, 8.97 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరణ చేయడం జరిగిందని, కోటి ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జరుగుతున్న పరిస్థితులను తాను వ్యక్తిగతంగా సందర్శించి , ప్రభుత్వ అంకిత భావానికి ముగ్ధుడనయ్యానని గవర్నర్ ప్రశంసించారు. సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక ప్రయోజనాలకు సరిపడ నీటి లభ్యత వల్ల రాష్ట్ర ముఖ చిత్రం మారుతుందని నరసింహన్ ప్రకటించారు. మిషన్ కాకతీయ కార్యక్రమం కింద చెరువుల పునరుద్ధరణ పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ కార్యక్రమం వల్ల చుట్టుపక్కల ప్రాంతాలలోని భూగర్భ జలమట్టాలు పెరగడం ఎంతో సంతోషించదగ్గ విషయమని కితాబిచ్చారు.

ప్రపంచ స్థాయిలో మెట్రోరైలు

హైదరాబాద్‌లో చేపట్టిన మెట్రోరైలు ప్రపంచ స్థాయిలో ఉందన్నారు. పీపీపీ విధానంలో చేపడుతున్న అతిపెద్ద మెట్రో రైలు ప్రాజెక్టు ఇదే.2017 నవంబర్‌లో ప్రధానమంత్రి ఈ ప్రాజెక్టును ప్రారంభించారని చెప్పేందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. ఒకేసారి 30 కిలోమీటర్ల పొడవైన మెట్రో ప్రాజెక్టును ప్రారంభించడం ఒక రికార్డుగా గవర్నర్ అభివర్ణించారు.



సులభతర వాణిజ్యంలో దేశంలోనే నంబర్ 1

పరిశ్రమల విషయానికి వస్తే ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్ -ఐ పాస్ విధానంతో సులభతర వాణిజ్య నిర్వహణలో దేశంలోనే నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నామని తెలిపారు. ఈ విధానంతో 1.18 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రా నికి సమకూరాయని , 6206 యూనిట్లను ప్రారంభించేందుకు కంపెనీలు ముందుకు రాగా 3703 యూనిట్లు ఇప్పటికే కార్యకలాపాలను మొదలుపెట్టాయని తెలిపారు.ఫలితంగా 4.47 లక్షల మందికి నేరుగా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు.

చేనేత రంగం

ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల రాష్ట్ర చేనేత రంగం దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట కాటన్ , పట్టు చీరలు, వరంగల్ దుర్రీలు, కరీంనగర్ బెడ్ షీట్లు నేతన్నల నైపుణ్యానికి నిదర్శనం. మరమగ్గాల నేతకారులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వారు తీసుకున్న రుణాలను మాఫీ చేసిందని, నేతన్నకు చేయూత... పథకం కింద పొదుపు నిధిలో ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచామని తెలిపారు. వరంగల్‌లో సమగ్ర మెగా జౌళీ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మిషన్ భగీరథలో 95 శాతం పనులు పూర్తి

ఇంటింటికి సురక్షిత తాగునీరు అందించాలనే సంకల్పంతో చేపట్టిన మిషన భగీరథ పథకం 95 శాతం పనులు పూర్తయ్యాయని గవర్నర్ చెప్పారు. 5500 గ్రామీణ జనావాసాలకు, 13 పట్టణాలకు నీటి సరఫరా ప్రారంభమైందని తెలిపారు. 2500 జనావాసాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలను అందుకున్నదని తెలిపారు.

4665 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు

రాష్ట్రంలో కొత్తగా 4665 కిలోమీటర్ల పొడవైన రోడ్లను రాష్ట్ర రహదారులుగా విస్తరించనున్నట్లు వెల్లడించారు. వాటిని డబుల్ రోడ్లుగా చేపడుతున్నామని పేర్కొన్నారు. మౌళిక వ్యవస్థల్లో రోడ్లు ,రవాణాను ప్రభుత్వం గుర్తించింది.

ప్రపంచ స్థాయిలో మెట్రోరైలు

హైదరాబాద్‌లో చేపట్టిన మెట్రోరైలు ప్రపంచ స్థాయిలో ఉందన్నారు. పీపీపీ విధానంలో చేపడుతున్న అతిపెద్ద మెట్రో రైలు ప్రాజెక్టు ఇదే.2017 నవంబర్‌లో ప్రధానమంత్రి ఈ ప్రాజెక్టును ప్రారంభించారని చెప్పేందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాను. ఒకేసారి 30 కిలోమీటర్ల పొడవైన మెట్రో ప్రాజెక్టును ప్రారంభించడం ఒక రికార్డుగా గవర్నర్ అభివర్ణించారు.

30 కోట్ల మొక్కలకు ట్యాగింగ్

వాతావరణ సమతుల్యత కోసం హరిత హారం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, 2017 -18 లో 34 కోట్ల మొక్కలు నాటగా, 30 కోట్ల మొక్కలకు జియో - ట్యాగింగ్ వర్తింప జేశామని తెలిపారు. రాష్ట్రంలో అడవులను 33 శాతానికి పెంచడమే తన ప్రభుత్వ లక్ష్యం.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాల వాటా

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన పరిస్థితులను నెలకొల్పడం వల్ల 2017 జనవరి నుండి డిసెంబర్ వరకు ప్రసవాల రేటు 33 శాతం నుండి 49 శాతానికి పెరిగిందని తెలిపారు. కేసీఆర్ కిట్ ద్వారా మగ శిశువుకు రూ. 12 వేలు, ఆడ శిశువుకు రూ. 13 వేలు విలువ చేసే సాయం అందజేస్తున్నామని, అంతేగాఖ గర్భిణీలకు రూ .2 వేల విలువ గల కిట్‌ను కూడా అందజేస్తున్నామని తెలిపారు. గర్భిణీల కోసం 102 సర్వీసుల పథకాన్ని ప్రారంభించామని, 250వాహనాలు సమకూర్చామని చెప్పారు.

విద్యారంగం పటిష్టతకు చర్యలు

విద్యారంగాన్ని పటిష్టం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాల కోసం 517 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఉర్దూ ద్వితీయ భాష అయినప్పటికీ , ప్రథమ భాషగా చదువుకునేందుకు విద్యార్థులకు అవకాశం ఇస్తున్నట్లు గవర్నర్ తెలిపారు.

ప్రజలకు రక్షణ, భరోసా ఇస్తున్నాం...

ప్రజల రక్షణ ,భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పోలీస్ వ్యవస్థ ఆధునీకరించేందుకు అనేక చర్యలు చేపట్టామని గవర్నర్ చెప్పారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించేందుకు కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. మహిళలపై వేధింపులు నిరోధించేందుకు ,షీ టీమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అగ్నిమాపక కేంద్రాలు లేని నియోజకవర్గాలలో 18 కేంద్రాలను మంజూరు చేశామన్నారు.

ప్రపంచ మహాసభలకు 8 వేల మంది హాజరు

తెలుగు భాషను, సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించిందని, 8వేల మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారని చెప్పారు. ఈ సభలతో తెలుగు భాష ,సాహిత్యం విశ్వవ్యాప్తమైందన్నారు.

పర్యాటక రంగం గణనీయంగా అభివృద్ధి

పర్యాటక రంగం అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని, ప్రభుత్వ చర్యలతో పర్యాటకుల రాకడ గణనీయంగా పెరిగిందన్నారు. జాతీయ , అంతర్జాతీయ కార్యక్రమాలకు నగరం వేదికగా మారిందని, ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సు, వరల్డ్ ఐటి కాంగ్రెస్, ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం కార్యక్రమాలు నిర్వహించడం వల్ల తెలంగాణ రాష్ట్ర పేరు ప్రఖ్యాతులు అంతర్జాతీయంగా వచ్చిందన్నారు.

సంక్షేమంలో మేటీ

ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమంలో తమ ప్రభుత్వం మేటియని గవర్నర్ ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టాన్ని తీసుకువచ్చామని, ఒక ఆర్థిక సంవత్సరంలో ఖర్చుకాకుండా మిగిలిపోయిన నిధులను రాబోయే ఆర్థిక సంవత్సరంలో క్యారీ ఫార్వార్డ్ చేసే విశిష్ట నిబంధన ఈ చట్టంలో ఉందన్నారు. గిరిజన సంస్కృతిని సుసంపన్నం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వనదేవతలైన మేడారం సమ్మక్క , సారలమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నామని, జనాభాలో అత్యధికంగా ఉన్న వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సముద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మైనారిటీల కోసం స్టడీ సర్కిళ్లు, షాదీ ముబారక్, ఇమాంలు, మౌజాంలకు గౌరవ వేతనం, ఇస్లామిక్ సాంస్కృతిక కన్వెన్షన్ సెంటర్, క్రిస్టియన్ భవన్, సిక్కుభవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుందని గవర్నర్ తెలిపారు. నిరుపేదలందరూ గౌరవంగా జీవించేలా సామాజిక భద్రతను సమకూరుస్తున్నామని, 41. 78 లక్షలమందికి ఆసరా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో టీ - హబ్ -2

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్శించేందుకు 10 విధానాలనుతమ ప్రభుత్వం ఆవిష్కరించిందని , టీ -హబ్ ఏర్పాటు అసాధారణ విజయమని గవర్నర్ చెప్పారు. ప్రపంచ ఉత్తమ అంకుర సంస్థల కేంద్రంగా హైదరాబాద్ గుర్తింపు పెరిగిందని, 4 వేల మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం టీ - హబ్ 2దశను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో 15 వందల ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల ద్వారా 4.3 లక్షల మందికి వృత్తి నిపుణులకు నేరుగా ఉపాధి లభిస్తోందని, పరోక్షంగా 7 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని , 2016 -17 లో ఐటీ ఎగుమతుల విలువ రూ. 85,470 కోట్లుగా గవర్నర్ వెల్లడించారు. హైదరాబాద్ నగరం వెలుపల వరంగల్, కరీంనగర్, ఖమ్మం , నిజామాబాద్‌లలో ఐటీ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

తెలంగాణ సౌరవిధానం దేశంలోనే అత్యుత్తమం

తన ప్రభుత్వం రూపొందించిన సౌర విధానం దేశంలోనే అత్యుత్తమైనదని కొనియాడబడుతోందని గవర్నర్ చెప్పారు. విద్యుత్ పరిస్థితిని గణనీయంగా మెరుగుపర్చడంలో ప్రభుత్వం చిరస్మరణీయమైన పురోగతి సాధించింది.రాష్ట్రం ఏర్పాటైన సందర్భంగా విద్యుత్ రంగం సంక్షోభంలో ఉండేదని, పరిశ్రమలకు 2రోజుల పవర్ హాలీడే లాంటి దుర్భర పరి స్థితులను ప్రస్తుతం అధిగమించామన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుక ు గానూ 2014 లో 7,778 ఎండబ్ల్యుల సామర్థ్యాన్ని 15, 344 ఎండబ్ల్యులకు పెంచామని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రా న్ని మిగులు రాష్ట్రంగా మార్చేందుక ు గానూ 12,931 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టుల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రారంభం.. ముగింపు తెలుగులోనే

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ తెలుగులోనే ప్రారంభించి తెలుగులోనే ముగించారు.

నిరసనల్లోనూ చెదరని సంకల్పం...

తాను ప్రసంగిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ సభ్యుల నుంచి తీవ్రమైన నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ చెదరని సంకల్పంతో గవర్నర్ తన ప్రసంగాన్ని ప్రారంభించి ముగించడం విశేషం.

గవర్నర్‌కు ఇరువైపులా స్పీకర్,మండలి చైర్మన్

ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్‌కు కుడి వైపున శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ కూర్చోగా, ఎడమవైపున శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి కూర్చున్నారు.

సభలో సభ్యులు మాటామంతి

చాలా రోజుల తర్వాత బడ్జెట్ సమావేశాల మొదటి రోజు కలుసుకున్న సందర్భంగా రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీల సభ్యులు ఒకరినొకరు పలుకరించుకున్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు తన స్థానం నుంచే అందరు సభ్యులకు నమస్కారం చేశారు. తొలుత ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ సభ్యుల స్థానాల వద్దకు వచ్చి పలుకరించారు. కాంగ్రెస్ సభ్యుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి బీజేపీ, టీడీపీ, ఎంఐఎం సభ్యులను పలుకరించారు. టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్యతో కొద్ది సేపు మాట్లాడారు. ప్రతిపక్షనాయకుడు కె జానారెడ్డి సభలోకి వచ్చాక బీజేఎల్పీ నాయకుడు జి కిషన్ రెడ్డి పక్కన కూర్చుని మాటలు కలిపారు.

3 వరుసల్లో మార్షల్స్

కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చి ఆందోళన చేపడతారన్న సమాచారం మేరకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో మార్షల్స్ సభ ప్రారంభానికి ముందే ఉద్యోగులు కూర్చునే క్యాబిన్‌లో కూర్చున్నారు.

27 వరకు అసెంబ్లీ

- 12 రోజులే సమావేశాలు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం
- విపక్షాల సూచనతో సెలవు తేదీల్లో మార్పు
- అసెంబ్లీ సమావేశాల షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రారంభమైన తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను మొత్త 12 రోజులపాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రసంగించారు. అనంతరం సభాపతి మధుసూదనాచారి అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ప్రతులను విపక్ష నేతలకు స్పీకర్ అందజేశారు. కాంగ్రెస్, తెలుగుదేశం, ఎంఐఎం, భాజపా నేతల సూచనల మేరకు సెలవు తేదీల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ నెల 15న సభలో బడ్జెట్ ప్రవేశపెట్టి 16న సెలవు ప్రకటించాలని, 17న బడ్జెట్‌పై చర్చ మొదలు పెట్టాలని ముందుగా షెడ్యూల్ ఖరారు చేశారు. 18 ఉగాది పండగ సెలవును ప్రకటించారు. విపక్షాల సూచనతో 17న చర్చ ప్రారంభించకుండా సెలవు ఖరారు చేశారు. దీంతో బడ్జెట్ మరుసటి రోజు నుంచి వరుసగా మూడు రోజులపాటు శాసన సభలకు సెలవులు రానున్నాయి. అలాగే 25న ఆదివారం సెలవు రోజును వర్కింగ్ డేగా పరిగణించాలని బీఏసీ నిర్ణయించింది. 26న శ్రీరామనవమి సెలవును ప్రకటించారు. 27వ తేదీ వరకు మధ్యలో నాలుగు రోజులు సెలవులు రానున్నాయి.



అసెంబ్లీ సమావేశాలు



దాడి హేయమైన చర్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభలో కాంగ్రెస్ పార్టీ భౌతిక దాడులకు దిగడం దారుణమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గవర్నర్‌పై దాడికి ప్రయత్నించడం హేయమైన చర్యగా అభివర్ణిస్తూ ఆయన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహారాన్ని ఖండించారు. గవర్నర్ ప్రసంగాన్ని వినకుండానే కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు ఆక్షేపనీయమని అన్నారు. కాంగ్రెస్ సభ్యుల దౌర్జన్యం ఆవేదన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలి కాంగ్రెస్ సభ్యులు సభలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నించారని, ఇది ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యలను సభ దృష్టికి తేవాలనుకుంటే సమయం తీసుకుని చర్చించాలేగానీ ఇలా దాడులకు దిగడం దుర్మార్గమని ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు.

ఓర్వలేకే దాడి



గతంలో ఏ పార్టీ కూడా బీసీలను పట్టించుకోలేదని, తెరాస అధికారంలోకి వచ్చాకే ఒకేసారి ఇద్దరు బీసీలను రాజ్యసభకు ఎంపిక చేసిందని పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ పేర్కొన్నారు. ఇద్దరు బీసీలకు రాజ్యసభ అవకాశం కల్పించేందుకు బీసీలు ఆయనకు రుణపడి ఉంటారని సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు. శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు గూండాల్లా ప్రవర్తించారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదని ఆయన అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలను చూసి కాంగ్రెస్ నేతలకు అసహనం పెరుగుతోందని ఆయన మండిపడ్డారు. బలహీన వర్గాల ప్రతినిధి స్వామిగౌడ్‌పై కోమటిరెడ్డి దాడి చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తలసాని డిమాండ్ చేశారు. ముందస్తుగా వేసుకున్న వ్యూహం ప్రకారమే కాంగ్రెస్ సభ్యులు సభలో దాడికి పాల్పడ్డారని ఆయన అన్నారు.

గుండాయిజం చెల్లదు

- ఇది బీహార్ కాదు.. దాడులు సహించం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, వారి గూండాయిజానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెరాస శాసన సభ్యుడు శ్రీనివాస గౌడ్ హెచ్చరించారు. గవర్నర్‌పై హెడ్‌ఫోన్లు విసరడం కాంగ్రెస్ పార్టీ గూండాగిరికి అద్దం పడుతుందని ఆయన దుయ్యబట్టారు. సభలో ప్రవర్తించిన తీరును చూసి హీరోలు కాలేరని జీరోలుగానే మిగిలిపోతారని ఆయన అన్నారు. రాష్ట్ర శాసనసభను కాంగ్రెస్ పార్టీ బీహార్ తరహాలో అనుసరించేందుకు ప్రయత్నిస్తోందని, ఇక్కడ ఎలాంటి అవకాశం ఇవ్వమని ఆయన అన్నారు. గవర్నర్ ప్రసంగంపై మాట్లాడేందుకు ప్రసంగం ఇస్తామని, ఎన్ని గంటలైనా ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచవచ్చని ఆయన చెప్పారు. దాడులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు.

వాళ్లు మద్యం సేవించారు.. జానాపై తూలి పడ్డారు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొందరు కాంగ్రెస్ సభ్యులు మద్యం సేవించి శాసనసభకు వచ్చారని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తన శాసన వ్యవస్థనే తలదించుకునేలా ఉందని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్ష నేత జానారెడ్డి సైతం తన సహచర సభ్యుల అల్లరి చూడలేక మధ్యలోనే సభనుంచి వెళ్ళిపోయారని ఆయన చెప్పారు. కొందరు సభ్యులు జానారెడ్డిపై తూలిపడ్డారని, అసభ్య పదజాలంతో చెలరేగిన కాంగ్రెస్ సభ్యులను ఏడాదిపాటు సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముందస్తు వేసుకున్న పథకం ప్రకారమే శాసనసభలో గూండాల్లా ప్రవర్తించారని రాజేశ్వరరెడ్డి ఆరోపించారు.సభా సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తన ఇలా ఉంటే మిగిలిన రోజుల్లో ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చునని పల్లా అన్నారు. శాసనసభలో జరిగిన సంఘటన చరిత్రలోనే ఒక బ్లాక్‌డే అని బోడకుంటి అభివర్ణించారు. కాంగ్రెస్ సభ్యులు స్వామిగౌడ్‌పై దాడిచేసి తమ అసహనాన్ని చాటుకున్నారని ఆయన మండిపడ్డారు. భౌతిక దాడులకు పాల్పడిన వారిని సభనుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తాడోపేడో తేల్చుకుంటాం

ఎమ్మెల్యేలపై చర్యలకు ఉపక్రమిస్తే ఎదురుదాడి చేయాలని నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సర్కార్‌తో తాడో పేడో తేల్చుకోవడానికి ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ సిద్ధమవుతోంది. శాసన సభలో విపక్షాల గొంతునొక్కే ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. సీఎం చంద్రశేఖర్‌రావు కుట్రలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ శాసన సభాపక్షం భావిస్తోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం సమయంలో జరిగిన ఘటలను అసరాగా చేసుకుని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్న నిర్ణయాన్ని ఎదుర్కోవాలని అభిప్రాయానికి వచ్చారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు జరిగిన అవమాన్నాన్ని అసరగా చేసుకోవాలని టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. చిన్న ఘటనను అసరగా చేసుకుని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేస్తే ప్రభుత్వంపై ఎదురుదాడి మరింత తీవ్రతరం చేస్తామని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసన చెబుతున్నప్పుడు.. స్పీకర్ వాదించినా నిరసన విరమించకుంటే మార్షల్ ద్వారా సభ్యులను బయటకు తీసుకెళ్లుతారని వారు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం సభా సంప్రదాయాలను పూర్తిగా విస్మరిస్తోందన్నారు. ఇదిలా ఉంటే ఒక సభ్యులు తప్పు చేస్తే సభలో జరిగినా తతంగాన్ని సీసీ పుటేజిల ద్వారా పూర్తిగా పరిశీలన చేశాకనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ సభ్యులు చెబుతున్నారు. అయితే తెలంగాణ ఉద్యమం సమయంలో టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సభలోని రావడమే కాకుండా గర్నర్‌పైన దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్నవారే అప్పుడు ప్రస్తుత గవర్నర్ నరసింహన్‌పై దాడు చేశారని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు.

నా హత్యకు కుట్ర : కోమటిరెడ్డి



ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నన్ను హత్య చేయడానికి కుట్ర పన్నుతున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ తీరుపై విమర్శలు చేస్తున్నందునే తనను టార్గెట్ చేశారని ఆయన మండిపడ్డారు. సోమవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. శాసన సభలో ఎమ్మెల్యేల హక్కులను ఈ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. సీఎం కేసీఆర్ నల్లగొండ నుంచి పోటి చేస్తే.. కాంగ్రెస్ నుంచి నేను పోటి చేసి విజయం సాధిస్తానని ఆయన తెలిపారు. నల్లగొండ జిల్లాలో రెడ్లు, సెటిలర్స్ ఎక్కువగా ఉన్నారని ఆయన వివరించారు. కేసీఆర్ గజ్వేల్ నుంచి పోటి చేసినా.. పార్టీ ఆదేశిస్తే గజ్వేల్ నుంచి బరిలో ఉంటానని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజక వర్గంలో కేసీఆర్ కంటే తనకే ఎక్కువగా బంధువులు ఉన్నారని కోమటిరెడ్డి చెప్పారు.

స్వామిగౌడ్‌కు గాయమైందని నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా

మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయమైందని నిరూపిస్తే.. తన పదవికి రాజీనామా చేస్తానని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. స్వామిగౌడ్‌కు ఎలాంటి గాయం కాలేదని, ఆయన ముఖానికి కనీసం పేపర్ కూడా తాకలేదన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో జరిగిన గొడవపై కోమటిరెడ్డి స్పందించారు. తెలంగాణ అసెంబ్లీలో తాను ఉద్దేశపూర్వకంగా తప్పు చేయలేదన్నారు.చెప్పారు.

దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోండి

- బీఏసీలో కాంగ్రెసేతర ప్రతిపక్షాలు
- ఆవేదనతోనే దాడి.. తీవ్రంగా చూడొద్దు: కాంగ్రెస్
- బడ్జెట్ ఆమోదం తర్వాత సభ:మంత్రి హరీష్
- సాంప్రదాయానికి విరుద్ధం: జానా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మినహా అన్ని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కోరాయి. గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు జరిపిన దాడికి సంబంధించిన వీడియో పుటేజీ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని శాసనసభా వ్యవహారాల సలహా మండలి (బీఏసీ)లో సూచించారు. స్పీకర్ అధ్యక్షతన సోమవారం బీఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి టి.హరీష్‌రావు, మంత్రులు ఈటల రాజేందర్, కడియం శ్రీహరి, ప్రతిపక్ష నాయకులు కె.జానారెడ్డి, కాంగ్రెస్ శాసనసభాపక్ష ఉప నాయకుడు భట్టి విక్రమార్క, ఎంఐఎం సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సండ్ర వెంకటవీరయ్య (తెదేపా), కిషన్‌రెడ్డి (భాజపా), సున్నం రాజయ్య (సిపిఎం) పాల్గొన్నారు.

శాసనసభ పనిదినాలు, చర్చించాల్సిన అంశాలు, సభా తీరుపై అన్ని పక్షాల అభిప్రాయాలను తెలుసుకునేందుకు స్పీకర్ మధుసూదనాచారి బీఏసీ నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే గవర్నర్‌పై ప్రసంగం సందర్భంగా జరిగిన దాడిని ఆయన ప్రస్తావించి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. చట్ట సభలో ఇలాంటి సంఘటనలు జరగడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని, ఇది బాధాకరమని ఆయన అన్నారు. గవర్నర్‌పై హెడ్‌ఫోన్లు విసరడం సభను అగౌరపరచడమేనని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలోనే సహించరానిదని ఆయన విచారం వ్యక్తంచేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా హుందాగా వ్యవహరించాలని ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి, సిఎల్‌పి ఉప నాయకుడు భట్టి విక్రమార్కకు తాను స్వయంగా ఫోన్‌చేసి కోరానని బీఏసీ సమావేశంలో ఆయన వివరించారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని స్పీకర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. అనంతరం జానారెడ్డి మాట్లాడుతూ, సభలో జరిగిన సంఘటన బాధాకరమని, గవర్నర్ ప్రసంగంలో తాము ఆశించిన అంశాలు ప్రస్తావించనందునే తమ సభ్యుడు ఆవేశపడ్డాడని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

బాధాకరంః భట్టి విక్రమార్క

భట్టి కల్పించుకుంటూ ఇది కేవలం ఆవేదనతోనే జరిగిందని, దీన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదని అన్నారు. సభలో అప్పుడప్పుడు ఆవేశాలకు లోనవుతుంటారని వీటికి అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉండదని అన్నారు.

అత్యవసర చర్చ అవసరంః అక్బరుద్దీన్

కాంగ్రెస్ నేతల సర్దుబాటు వ్యాఖ్యలపై అక్బరుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. సభలో జరిగిన తీరుపై అత్యవసర సమావేశం నిర్వహించి చర్చించాల్సిన అవసరం ఉందని అక్బరుద్దీన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రాజ్యాంగ అధిపతికి గౌరవం ఇవ్వాలని, కానీ కాంగ్రెస్ సభ్యుడు దాన్ని అతిక్రమించారని ఆవేదన వ్యక్తంచేశారు. శాసనసభ ప్రార్థనా మందిరంలాంటిదని, ఇది పవిత్రమైన స్థలమని ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ సంఘటన బాధాకరమని, విచారకరమని, దుర్మార్గమని ఓవైసీ మండిపడ్డారు. గవర్నర్‌పై చేసిన దాడితో మండలి చైర్మన్‌కు గాయమైందని, దీన్ని తీవ్రంగా పరిగణించి విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సభా కాలమంతా దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాలని, ఇలాంటి అరాచకాలను అనుమతించవద్దని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఒక సభ్యుడు గవర్నర్‌నే లక్ష్యంగా చేసుకున్నారని చెప్పడాన్ని నేరంగా పరిణించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై కాదని ప్రజాస్వామ్యాన్ని గాయపరిచారని అన్నారు. ఓవైసీ ఆవేశంగా మాట్లాడడంతో కాంగ్రెస్ నేతలు మౌనం వహించారు. ఓవైసీ చేసిన ప్రతిపాదనకు మిగిలిన ప్రతిపక్షాలు మద్దతు పలకడంతో బీఏసీలో కాంగ్రెస్ ఒంటరైపోయింది.

సభ 21రోజులు జరపాలిః సండ్ర

బడ్జెట్ సమావేశాలు కనీసం 21 రోజులు నడపాలని తెదేపా సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. గతంలో 30 పని దినాలు నిర్వహించిన సభలో కేవలం 12 పని దినాలకే కుదించడం సమంజసం కాదన్నారు. అలాగే జీరో అవర్‌లో సభ్యులు ప్రస్తావించే ప్రశ్నలకు వెంటనే మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

నిరసన తెలిపే అవకాశం అందరికీ ఇవ్వాలిః కిషన్ రెడ్డి

సభలో నిరసన తెలిపే అవకాశం సభ్యులందరికీ కల్పించాలని భాజపా సభాపక్ష నేత జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. ఈనెల 16న సభకు విరామం, 18న సభకు సెలవు ఉన్నందున 17వ తేదీన కూడా సెలవు ప్రకటించి దాని బదులు 25వ తేదీన సభ నిర్వహించాల్సిందిగా కాంగ్రెస్ సభ్యులు చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. సభలో జరిగిన గందరగోళంపైనే బీఏసీలో ఎక్కువ సమయం చర్చించడంతో శాసనసభలో చర్చించాల్సిన అంశాలపై అంతగా సభ్యులు ప్రస్తావించలేకపోయినట్టు సమాచారం. సభను మరిన్ని రోజులు నడిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో ద్రవ్య వినిమయ బిల్లుకు సభ ఆమోదం తెలిపిన తర్వాత సభను మళ్ళి నిర్వహించుకోవచ్చునని హరీష్‌రావు చెప్పారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన తర్వాత కేటాయింపులపై ఏమని చర్చిస్తామని జానారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది సాంప్రదాయాలకు విరుద్ధమని, ప్రజా సమస్యలను చర్చించేందుకు ఏమాత్రం ఉపయోగపడదని అన్నారు.

27వ తేదినే ద్రవ్యవినిమయ బిల్లు

ద్రవ్య వినిమయ బిల్లును 30వ తేదీన సభ ముందుంచాల్సిందిగా జానారెడ్డి సూచించారు. దీనికి హరీష్‌రావు సమాధానం ఇస్తూ, గవర్నర్ 27వ తేదీ రాత్రికే విదేశీ పర్యటనకు వెళుతున్నందున అదేరోజు ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. ఈలోగా సభా కార్యక్రమాలను సజావుగా జరుపుకుంటే ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇస్తామని, వారు లేవనెత్తే అన్ని ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇస్తుందని హరీష్ స్పష్టంచేశారు.

స్వామిగౌడ్‌పై దాడి ప్రజాస్వామ్యంపై మాయని మచ్చ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి దురదృష్టకరమని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చ తీసుకువస్తా యన్నారు. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగి స్తుండగా జరిగిన ఘటనలో స్వామిగౌడ్ గాయపడిన విషయం తెలిసిందే. దీంతో స్వామిగౌడ్‌ను అసెంబ్లీలో ఉన్న జనరల్ ఫిజిషియన్‌కు చూపించారు. అనంతరం ఆయన సలహా మేరకు సరోజినీ కంటి ఆస్పత్రికి తీసుకొచ్చారు. వెంటనే మెహిదీపట్నం లోని సరోజినీ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్‌ను మంత్రి ఆదేశించారు. కంటికి స్కానింగ్ చేశామని అవసరమైన చికిత్స అందిస్తున్నామని సూపరిం టెండెంట్ మంత్రికి వివరించారు. దీనికోసం స్వామి గౌడ్‌ను ఇన్‌పేషెంట్‌గా చేర్చుకున్నామని సూపరిం టెండెంట్ తెలిపారు.

విశ్రాంతి అవసరం: ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



చికిత్స పొందుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి సోమవారం పరామర్శించారు. ఆయన పరిస్థితి గురించి ఎలా ఉందని సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. కంటికి దెబ్బతాకడంతో వాపు వచ్చిందని, కన్ను ఎర్రగా అయ్యిందని చికిత్స చేస్తున్నా మని మంత్రితో పేర్కొన్నారు. స్వామిగౌడ్‌కు కొంత విశ్రాంతి అవసరమని సూపరింటెండెంట్ తెలిపారు. దీంతో విశ్రాంతి తీసుకోవాలని కడియం స్వామిగౌడ్‌కు సూచించారు.

కాంగ్రెస్ సభ్యులు హెడ్‌ఫోన్‌ను విసిరారు



చికిత్స అనంతరం స్వామిగౌడ్ మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం ముగిశాక కాంగ్రెస్ సభ్యులు హెడ్‌ఫోన్ విసిరితే తన కంటికి తగిలిందన్నారు.

గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భాలు లేవన్నారు. ప్రజాస్వా మ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉంటుంది కాని ఇలా కాదన్నారు. ప్రతి పక్షాలు సమస్యలపై సభలో ప్రస్తావించాలి కానీ దాడులకు దిగటం సంప్రదాయం కాదని ఆయన సూచించారు. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి స్వామిగౌడ్‌ను ఆస్పత్రిలో పరామర్శిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిపక్షాల చర్య లను అందరూ ఖండించాలన్నారు.

దాడి చేసిన వారిపై కచ్చితంగా చర్యలు



మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు సరోజినీలో చికిత్స పొందుతున్న స్వామిగౌడ్‌ను పరామర్శించారు. ఇలాంటి ప్రతిపక్షాలను ఎక్కడా చూడలేదన్నారు. మండలి చైర్మన్‌పై దాడులకు దిగడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ఇలాంటి దాడులను సహించమని వారు హెచ్చరించారు. దాడి చేసిన వారిపై కచ్చితంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

కార్నియా దెబ్బతింది: సూపరింటెండెంట్ రవీందర్ గౌడ్



స్వామిగౌడ్ కంటిలోని కార్నియా దెబ్బతిందని సరోజినీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. కంటికి సంబంధించి స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించామని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి స్వామిగౌడ్‌ను అబ్జర్వేషన్‌లో పెట్టామని ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు డాక్టర్ల బృందం స్వామిగౌడ్‌ను పరీక్షించి అనంతరం డిశ్చార్జి చేస్తామన్నారు.

ఇది బాధాకర సంఘటన: ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ



ఇది బాధాకర సంఘటన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, మండలి విపక్ష నేత షబ్బీర్‌అలీలు పేర్కొన్నారు. సరోజినీ ఆస్పత్రిలో చికిత్స సొందుతున్న స్వామిగౌడ్‌ను పరామర్శించడానికి వారు ఆస్పత్రికి రాగా వారిని టీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు గందరగోళపరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలిసిన స్వామిగౌడ్ వారిని ఆస్పత్రి లోపలికి పంపించాలంటూ టీఆర్ఎస్ నాయకులతో పేర్కొనడంతో వారిని ఆస్పత్రి లోపలికి అనుమతించారు. అనంతరం వారు స్వామిగౌడ్‌ను పరామర్శించారు. ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని, ఇది బాధాకర విషయమన్నారు.

మద్యం తాగొచ్చారనడం సభను అవమానించడమే

తాగొచ్చిందేవరో స్పీకర్ విచారణ జరిపించాలి

సభలో సభ్యులకు నిరసన తెలిపే హక్కు లేదా..?

గతంలో బెంచీలపైకి వెళ్లి గవర్నర్ పై దాడి చేసిన విషయం మర్చిపోవద్దు

సీఎల్పీ నేత జానారెడ్డి హెచ్చరిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు మద్యం తాగొచ్చారని అధికార టీఆర్ఎస్ పార్టీ సభ్యులు మాట్లాడటం.. శాసన సభకే అవమానకరమని సీఎల్పీ నేత జానారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి తాగివచ్చిందేవరో స్పీకర్ గుర్తించాల్సిన ఉందని ఆయన డిమాండ్ చేశారు. శాసన సభకు ఏ పార్టీ సభ్యుడైనా మద్యం తాగివస్తే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాసనసభ అనంతరం జానారెడ్డి సీఎల్పీ కార్యాలయంలో టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, ఉప నేత జీవన్‌రెడ్డితో కలిసి సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు గవర్నర్ ప్రసంగంలో లేకపోవడంతోనే తమ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారని ఆయన తెలిపారు. శాసన సభలో నిరసన వ్యక్తం చేయడం సభ్యుడి హక్కు అని. కానీ సభలో ఎన్నడు లేదని విధంగా మార్షల్, పోలీసులను పెట్టడం ఎన్నడూ చూడలేదని ఆయన దుయ్యబట్టారు. పోలీసులు, మార్షల్‌తో తమ సభ్యులపై దాడులు చేయించడంతో కోమటరెడ్డి వెంకట్‌రెడ్డి కాలుకు, మరో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వేలుకు తీవ్ర గాయాలైనాయని జానారెడ్డి తెలిపారు. తాను కూర్చున్న కుర్చీని కూడా గట్టిగా నొక్కడంతో అక్కడి నుంచి లేచి వెనుక కుర్చీలోకి వెళ్లానే తప్పా.. బయటికి వెళ్లిపోలేదన్నారు. పార్లమెంట్‌లో కూడా ఎంపీలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయాన్ని చూస్తున్నామని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కూడా బేంచిలపైకి వెళ్లి గవర్నర్‌పై దాడులు చేసిన విషయం మర్చిపోయారా..? అంటూ జానారెడ్డి నిలదీశారు. గత ప్రభుత్వంలో పార్లమెంట్‌లో తమ పార్టీకి చెందిన పొన్నం ప్రభాకర్‌పై పెప్పర్ స్ప్రే చల్లినా.. ఉద్యమ నేపథ్యాన్ని గుర్తించే నాడు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

గవర్నర్ ప్రసంగంలో హామీలేవి..?

గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి పసలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించారని ఆయన మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాలు, రెండు ప డుక గదుల ఇళ్ల నిర్మాణం, ఎస్టీ, ముస్లింలకు సంబంధించిన 12 శాతం రిజర్వేషన్ల పెంపు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, రైతు ఆత్మహత్యలను ఎందుకు ప్రస్తావించలేదని ఆయన ప్రశ్నించారు.

మాపై ప్రభుత్వం కుట్ర చేస్తోంది : భట్టి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ఆ కుట్ర తెలంగాణ భవన్ నుంచే మొదలు పెట్టారని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సభలో పోలీసులు, మార్షల్స్‌ను పెట్టి దాడులు చేసి సభ్యుల గొంతునొక్కుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు ప్రతి సభ్యుడికి ఉంటుందని, అయితే ప్రభుత్వం మాత్రం మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను ముందుపెట్టి కుట్రలకు తెర తీస్తున్నదని ఆయన దుయ్యబట్టారు. చైర్మన్‌కు కంటికి గాయం అయితే.. గవర్నర్ వెళ్లిపోయేటప్పుడు స్పీకర్, చైర్మన్‌లు ఇద్దరు సంతోషంగా కారు వద్దకు వెళ్లి వీడ్కోలు చెప్పారని భట్టి వివరించారు. సీఎం చంద్రశేఖర్‌రావుకు విశ్వసనీయత లేదని సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడ్డి అన్నారు. శాసన సభను టీఆర్ఎస్ సభగా మార్చారన్నారు. గవర్నర్ నరసింహన్ సభకు ఐదు నిమిషాలకు ఆలస్యంగా రావడమేంటని ఆయన ప్రశ్నించారు.

ప్రభుత్వోద్యోగం రాదనే బెంగతో మహిళ ఆత్మహత్య

హైదరాబాద్/నార్సింగి, ఆంధ్రప్రభ : తనకు 28 ఏళ్లు నిండాయని, ఇక ప్రభుత్వ ఉద్యోగం రాదని జీవితం మీద విరక్తితో ఓ మహిళ 18వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధి పీరం చెరువు గ్రామంలో పెబెల్ సిటీ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలు షేక్ ఆరిషా(28)గా పోలీసులు గుర్తించారు. బీటెక్ చదివిన అరిఫా పలు మార్లు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించింది. ప్రయత్నిస్తూనే ఉంది. ఇదే క్రమంలో శంషాబాద్‌కు ఇంటర్వ్యూకి వెళ్లింది. అక్కడ సెలెక్ట్‌కాలేదు. మరోవైపు తన వయసు 28 నిండటంతో ఇక ప్రభుత్వ ఉద్యోగం తనకు రాదని భావించిన అరిఫా తీవ్ర మనస్తాపానికి లోనైంది. ఇక తనకు చావే శరణ్యమని భావించింది. అనుకున్నదే తడవుగా తానుంటున్న అపార్ట్‌మెంట్ 18వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అరిఫా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అను మానాస్పద మృ తి కింద కేసు నమోదు చేసుకుని నాంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 13 మార్చి 2018

చైనాలో ఏకవ్యక్తి స్వామ్యం!

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పుడు సర్వోన్నతుడు. చైనాకు ఆయన జీవిత కాల అధ్యక్షుడు.మావోతర్వాత చైనాలో అంతటి శక్తిమంతుడు.మావో ఆలోచనా విధానాన్ని చైనీయులు ఆమోదించి అమలు జేసినట్టే, ఇకపైన జిన్‌పింగ్ ఆలోచనా విధానాన్ని అమోదించనున్నారు. మావో తర్వాత చైనాని సంస్కరణల పథంలో నడిపించిన డెంగ్ పాలనా రంగంలో వేసిన ముద్రను చెరిపివేయడానికి జిన్‌పింగ్ కొంతకాలంగా సాగిస్తున్న యత్నాలు ఫలించాయి. 2017 అక్టోబర్‌లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లోనే జిన్‌పింగ్ చైనాకు జీవిత కాల అధ్యక్షుడు అయ్యేందుకు తగిన ప్రాతిపదికను ఏర్పాటు చేసుకున్నారు.

అలనాడు మావోకి లభించినంత ప్రాధాన్యత ఇప్పుడు జిన్ పింగ్‌కి లభిస్తోంది. జిన్ పింగ్ ఆలోచనా విధానాన్ని రాజ్యాంగంలో చేర్చాలన్న ప్రతిపాదనను కొద్ది రోజుల క్రితం ఆమోదించిన చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఇప్పుడు జిన్ పింగ్‌ని జీవిత కాల అధ్యక్షునిగా ఆమోదించింది. ఈ ప్రతిపాదనకు పార్లమెంటు ఆమోద ముద్ర కూడా లభించింది. ఇక పైన ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా దానికి ఎదురు చెప్పేవారు ఉండరు. జిన్ పింగ్ ఆలోచనా విధానం చైనాని ప్రపంచంలో అజేయమైనశక్తిగా నిలబెట్టేందుకు అనుకూలమైనదిగా కమ్యూనిస్టు పార్టీ భావిస్తోంది. ఆయన హయాంలో కొత్త శకం ఆరంభం కాగలదని పార్టీ విశ్వసిస్తోంది. మావో వల్ల చైనాకు మేలు చేకూరిందని ఇప్పటికీ అంగీకరిస్తున్నవారున్నట్టే, డెంగ్ ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల చైనా అగ్రరాజ్యంతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని నమ్మేవారు ఉన్నారు. సంస్కరణలు అమలులోకి వచ్చిన తర్వాత అవినీతి పెరిగిపోయిందన్న ఆరోపణలు వచ్చాయి. చైనా మొదటి రాజ్యాంగం 1954లో అమలులోకి వచ్చింది. ప్రస్తుత రాజ్యాంగం 1982 నుంచి అమలులో ఉంది. ఇప్పటికి నాలుగుసార్లు సవరణలు చేశారు. చైనాలో ఇంతవరకూ సమష్టి నాయకత్వం కొనసాగింది. ఇక మీదట జిన్ పింగ్ చెప్పిందే వేదం. రెండుసార్లు మించి అధ్యక్ష పదవిలో ఏ వ్యక్తీ కొనసాగరాదన్న నిబంధనను రాజ్యాంగం నుంచి తొలగించడం వల్ల ఇప్పుడు ఆయన తిరుగులేని నాయకుడయ్యారు. చైనాను ఆర్థికంగా ప్రపంచంలో నెంబర్‌వన్‌గా చేయాలన్న ఆయన తపన అర్థంచేసుకోదగిందే. ఆయన వేస్తున్న అడుగులు మాత్రం విమర్శలకు గురవుతున్నాయి. వన్ బెల్ట్ వన్ రోడ్డు (ఒబిఒఆర్) పథకం వల్ల యూరప్‌తో వాణిజ్య సంబంధాలు పెంచుకోవచ్చనీ, తద్వారా ఆర్థికంగా చైనా అజేయమైన శక్తిగా రూపుదిద్దుకోగలదని ఆయన ఆకాంక్షిస్తున్నారు. మహామార్గం పేరిట అమలు చేయదలచిన ఈ ప్రాజెక్టుకు ఎన్ని లక్షల కోట్లు వ్యయం అవుతుందో ఇంకా అంతుచిక్కని విషయమే. నిధులను సేకరించడం ఒక ఎత్తయితే, పొరుగు దేశాల భూభాగాల మీదుగా నిర్మించే ఈ మహామార్గం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇప్పటికే వాటి సంకేతాలు బయటపడ్డాయి. సిక్కిం సరిహద్దుల్లో డోక్లామ్ వద్ద ఉద్రిక్తత కొనసాగడానికి కారణం ఇదే. భూటాన్ భూభాగంలోకి చొచ్చుకుని పోయే రీతిలో ఈ మార్గాన్ని నిర్మించేందుకు తలపెట్టిన పనుల పట్ల భూటాన్ నిరసన తెలిపింది. ఇటు మన సిక్కింలోకి కూడా చొచ్చుకుని వచ్చే ప్రమాదం ఉండటంతో సరిహద్దుల్లో మన దేశం సైన్యాన్ని మోహరించింది. డోక్లామ్ ఉద్రిక్తతకు ప్రధాన కారణం ఇదే. నేపాల్, శ్రీలంక తదితర దేశాల భూభాగాలను తాకుతూ వెళ్ళేందుకు ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. మన దేశానికి సంబంధించి చైనా అనుసరిస్తున్న విధానంలో స్పష్టత లేదన్న విషయం ఇప్పటికి చాలా సార్లు రుజువైంది. ముఖ్యంగా, పాకిస్తాన్‌ని,ఆ దేశంలో ఆశ్రయం పొందుతున్న ఉగ్రవాదులను చైనా బహిరంగంగా సమర్థిస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశాల్లో అనుకూలంగా ఓటు వేసింది. జిన్ పింగ్ వైఖరి వల్లే చైనా ఇలాంటి పోకడలకు పోతోంది. జిన్ పింగ్ మన ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసినప్పుడు ఎంతో సుహృద్భావ పూర్వకంగా మాట్లాడతారు. ఆయన స్వదేశం వెళ్ళగానే భారత్‌కి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుంటారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఐదు ప్రాంతాలను చైనా భూభాగాలని ప్రకటించడం, చైనా మ్యాప్ లో అరుణాచల్‌ని మాయం చేయడం వంటివన్నీ జిన్ పింగ్‌కి తెలియకుండా జరిగాయని ఎవరూ అనుకోరు. భారత్ అమెరికాకు దగ్గరవుతోందన్నది జిన్ పింగ్ అనుమానం. అమెరికాపై కోపాన్ని మన దేశం మీద ప్రదర్శిస్తున్నారన్న విశ్లేషణలు ఇప్పటికే వెలువడ్డాయి. జిన్ పింగ్ సర్వోన్నతుడైతే మన దేశం విషయంలో మరింత దూకుడుగా వ్యవహరించే ప్రమాదం ఉంది. పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను మరింత ఎక్కువగా సమర్థించే అవకాశమూ ఉంది. పార్టీలో, ప్రభుత్వంలోఇప్పటికే తనకు ఎదురు లేకుండా చేసుకున్న జిన్ పింగ్ పోకడలు నియంతృత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. హక్కుల ఉద్యమకారులను తొక్కి పట్టి ఉంచడం వల్ల భవిష్యత్‌లో చైనాలో అశాంతి చెలరేగే ప్రమాదం ఉంది. ఏకవ్యక్తి నియంతృత్వంలో చైనా కి జరిగే మేలు కన్నా, కీడు ఎక్కువ. చైనాని అంతర్జాతీయంగా అగ్రగామిగా చేస్తానన్న జిన్ పింగ్ హామీలు ఆవిరి కావడానికి కొంత కాలం పట్టవచ్చు.

మంచి మాట

బలహీనుడు నిర్ణయం తీసుకోకముందే,
దాని గురించి సందేహిస్తాడు.
బలవంతుడు తీసుకున్నాక సందేహిస్తాడు.

-కార్ట్ క్రాస్

సిరియా! ఎందుకిలా!!

సందర్భం

గత కొద్ది రోజులుగా సిరియాలో పరిస్థితిపై సోషల్ మీడియాలో పోస్ట్‌లు భారీ సంఖ్యలో వెల్లువెత్తుతున్నాయి. సిరియాలో కొనసాగుతున్న తాజా పరిణామాలను ప్రపంచం పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఫొటోలు, వీడియోలతో కూడిన పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటున్నారు. 'రెబల్స్' (ప్రభుత్వం చెబుతున్న ఉగ్రవాదులు) నుండి తూర్పు ఘౌటా నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వ సేనలు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా దీనిపై తీవ్రంగా స్పందిస్తోంది. సిరియా రాజధాని డెమాస్కస్ నగరానికి 15 కి.మీ దూరంలో వున్న తూర్పు ఘౌటా ప్రాంతం గత కొద్దికాలంగా రెబల్స్ ఆధీనంలో ఉంది. వీరంతా టెర్రరిస్టు గ్రూప్ అల్‌ఖైదా, తదితర గ్రూప్‌లకు అనుబంధంగా గత కొద్దికాలంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తూర్పు ఘౌటాను రెబల్స్ నుండి స్వాధీనం చేసుకునే ప్రభుత్వ సేనల ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు డెమాస్కస్ నగరంపై రెబల్స్ కాల్పులు, దాడులు ప్రారంభించారు. గత నవంబర్ 16 నుండి కొనసాగుతున్న ఈదాడులు, ప్రతి దాడులలో ఇప్పటి వరకూ 18 మంది చిన్నారులు, 14 మంది మహిళలు సహా మొత్తం 116 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని రెబల్స్ అనుకూల వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పుడు ఈ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేయటంతో ప్రస్తుతం మనం చూస్తున్న మీడియా ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం ఫేస్‌బుక్, వాట్సప్ తదితర సోషల్ మీడియా వేదికల్లో షేర్ అవుతున్న ప్రచారానికి మూలం న్యూయార్క్‌టైమ్స్, ది గార్డియన్ వంటి పశ్చిమ దేశాల మీడియా సంస్థలతో పాటు అల్‌జజీరా, అల్‌జజీరా ప్లస్ అల్ అరేబియా వంటి మీడియా సంస్థలు అందిస్తున్న సమాచారమే. సిరియాలో బషర్ అల్ అసద్ సర్కారును గద్దెదించేందుకు గత ఐదేళ్లుగా జరుగుతున్న తిరుగుబాటులో అమెరికా సైన్యం నేరుగా జోక్యం చేసుకుంటోంది. సిరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ పోరులో కొంతమంది మతఛాందసవాదులు, ఉగ్రవాదులు రెబల్స్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఈ ఉగ్రవాదులకు అమెరికా, దాని నాటో మిత్ర దేశాల మద్దతు కూడా లభిస్తోంది. దీనితో పాటు సౌదీ అరేబియా వంటి నిరంకుశ రాజరిక వ్యవస్థలు సైతం వారిని గట్టిగా సమర్థిస్తున్నాయి.

అమెరికా ఎందుకు సమర్థిస్తోంది?

గత కొన్నేళ్లుగా సిరియా, లిబియాలలో ఏమవుతోందన్న అంశాన్ని గమనించిన వారెవరికైనా 'చమురు సంపదపై దృష్టే దీనికి కారణమని స్పష్టమౌతుంది. చమురు సంపద పుష్కలంగా వున్న సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలు అమెరికా మిత్ర దేశాలుగా కొనసాగుతుండగా సిరియా మాత్రం సర్వ స్వతంత్ర దేశంగా కొనసాగుతోంది. ఈ దేశం అనుసరిస్తున్న విధానాలేవీ అమెరికా కంపెనీలకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేవు. ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగా అరబ్ జాతీయవాదానికి ఈ ప్రాంతంలో ఇప్పుడు మిగిలిన ఏకైక ప్రతినిధి సిరియా మాత్రమే. ఈ ప్రాంతంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, యూదు వ్యతిరేక వైఖరిని అనుసరిస్తున్న అరబ్ జాతీయవాద, సోషలిస్టు శక్తులతో పోరాడేందుకు అమెరికా దీర్ఘకాలంగా ప్రతీఘాత ఇస్లామిక్ శక్తులను, వాటి ప్రభుత్వాలను సమర్థిస్తోంది. మరోవైపు సిరియా రష్యా, చైనాలతో సన్నిహితంగా మెలుగుతూ వాటితో మైత్రిని కొనసాగిస్తోంది. ఇటీవలి కాలంలో అమెరికా తనకు ముప్పుగా భావిస్తున్న మరో దేశం ఇరాన్‌తో కూడా సాన్నిహిత్యం పెంచుకుంది. చారిత్రకంగా చూసుకుంటే ఇజ్రాయిల్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్న దేశం సిరియా. ఈ రెండు దేశాల మధ్య వున్న సరిహద్దులోని గోలన్ హైట్స్ ప్రాంతం సిరియా భూభాగంలో వుంది. పాలస్తీనా ప్రజలతో సన్నిహిత మైత్రిని కొనసాగిస్తున్న సిరియా పాలస్తీనా ఏర్పాటు విషయంలోనూ అదే నిబద్ధతను కొనసాగిస్తోంది. గత 18 ఏళ్లుగా ఇజ్రాయిల్‌తో పోరాడుతున్న హిజ్బుల్లాతో సిరియాకు సత్సంబంధాలే వున్నాయి. సిరియా ప్రభుత్వం పడిపోతే అరబ్ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ఎదురు నిలిచే అరబ్ దేశమే వుండదు. అన్నిచోట్లా ఓటమిని ఎదుర్కొంటున్న అరబ్ జాతీయవాద శక్తులకు ఇప్పుడు పట్టున్న ఏకైక ప్రాంతం సిరియా మాత్రమే. అందువల్లే సిరియా ప్రభుత్వ పతనాన్ని అమెరికా కోరుకుంటోంది. అందుకే అక్కడి ప్రభుత్వాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఈ ప్రాంతంలో ఆర్థికంగా, ఆయుధాలు, సైనిక మద్దతు సమకూర్చి ఇస్లామిస్ట్ ప్రభుత్వాలు



పెంచి పోషిస్తున్న ఉగ్రవాదులను సమర్థించేందుకు కూడా అమెరికా వెనుకాడటం లేదు. ప్రపంచ వ్యాప్తంగా వున్న ఇస్లామిస్ట్ శక్తులలో అధికశాతాన్ని అమెరికా, దాని మిత్ర దేశాలు గట్టిగా సమర్థిస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లుగా రూపాంతరం చెందిన ముజాహిదీన్‌లను అమెరికా సమర్థిస్తుండటాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అమెరికా, దాని మిత్ర దేశాలు ఇరాక్‌లో కొనసాగించిన విధ్వంసం ఫలితమే ఇస్లామిక్ స్టేట్ ఆవిర్భావం.

ఎవరీ 'రెబల్స్'

తిరుగుబాటుకు నేతృత్వం వహిస్తున్న జభాత్ అల్ నస్రా (అల్ నస్రా ఫ్రంట్), ఇతర గ్రూపుల విలీనం అనంతరం జభాత్ ఫతే అల్ షామ్ అని, తరువాత తహ్రీర్ అల్ షామ్ అని పేర్లు మార్చుకుంది. వాస్తవానికి ఇది అల్‌ఖైదాకు చెందిన సిరియా విభాగం అని చెప్పవచ్చు. ఈ రెబల్ గ్రూపుల్లో వున్న వారంతా అమానుష హత్యలకు సైతం వెనుదీయని కరుడు గట్టిన ఉగ్రవాదులే. వీరిలో మరికొంతమందున్నారు.

ఇందులో సౌదీ అరేబియాకు చెందిన జయేష్ అల్ ఇస్లామ్ (దీనికి సౌదీ, కువైట్‌కు చెందిన వహబిస్టులు ఆర్థిక అండదండలు సమకూరుస్తున్నారు), టర్కీకి చెందిన అహ్రార్ అల్ షామ్ అనే ప్రచ్ఛన్న సైనిక ముఠాలు ప్రధానమైనవి. వీరితో పాటు హర్కత్ నూర్ అల్ దీన్ అల్ జెంకీ మరో ఉగ్రవాద సంస్థ కూడా క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. గూఢచర్యం చేస్తున్నాడన్న అనుమానంతో పాలస్తీనాకు చెందిన12 ఏళ్ల బాలుడి తల నరికిన ఈ ఉగ్రవాదులు ఆ వీడియోను ఆన్‌లైన్‌లో కూడా ప్రసారం చేశారు. ఇరాక్ మినహా పర్షియన్ గల్ఫ్‌లోని ఇతర అరబ్ దేశాలన్నీ రాజకుటుంబాల పాలనలోనే కొనసాగుతున్నాయి. వీటికి సౌదీ అరేబియా నాయకత్వం వహిస్తోంది. ప్రపంచంలో వివిధ దేశాలలో కొనసాగుతున్న మత ఛాందసవాద, ఉగ్రవాద కార్యకలాపాలకు ఇక్కడి నుండే ఆర్థికసాయమందుతోందన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లౌకిక విధానాన్ని అనుసరిస్తున్న సిరియా వీరికి సమస్యగా మారింది. పూర్తి స్థాయి రిపబ్లిక్ అయిన సిరియా చెబుతున్న అరబ్ జాతీయ వాదాన్ని ఈ ప్రాంతంలోని రాజకుటుంబాలు తమకు ముప్పుగా పరిగణిస్తున్నాయి. వీరితో పాటు ఈ ప్రాంతంలో మరో శక్తిగా ఎదుగుతున్న టర్కీలోని ఇస్లామిస్ట్ ప్రభుత్వం కూడా సిరియా ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే ప్రయత్నిస్తోంది.

సేవ్ ఘౌటా?

ప్రస్తుతం తూర్పు ఘౌటా ప్రాంతాన్ని జయేష్ అల్ ఇస్లామ్, అల్‌నస్రా ఫ్రంట్, దాని మిత్ర పక్షం ఫేలాక్ అల్ రెహ్మాన్ గ్రూపు అనే మూడు సంస్థలు నియంత్రిస్తున్నాయి. 2015లో తెరపైకి వచ్చిన జయేష్ అల్ ఇస్లామ్ గ్రూప్ బాంబుదాడుల నుండి తమను తాము రక్షించుకునేందుకు మహిళలతో సహా సామాన్య పౌరులను రక్షణ కవచాలుగా వాడుకుంది. ఇటువంటి టెర్రరిస్టుల చెర నుండి ఘౌటాను విముక్తి చేయటాన్ని వ్యతిరేకిస్తూ గతంలో 'సేవల్ అలెప్పో' తరహాలోనే సేవ్ ఘౌటా ప్రచారం ప్రారంభమైంది. అల్‌ఖైదా, ఐఎస్ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల చెరలో వున్న తమ భూభాగాన్ని రష్యా సాయంతో విడిపించుకునేందుకు సిరియా సైనికదళాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రారంభమైన సేవ్‌ఘౌటా ప్రచారం అక్కడి ప్రజలను రక్షించేందుకు కాక, సిరియాను ఆక్రమించుకునేందుకు ఉగ్రవాదులతో చేతులు కలిపిన అమెరికన్ సామ్రాజ్యవాద శక్తులు ప్రయత్నాలకు అంతర్జాతీయ కూడగట్టటమే లక్ష్యంగా కన్పిస్తోంది. సిరియా నుండి తమ సైన్యాలను ఉపసంహరించుకునేందుకు అమెరికా, దాని మిత్రపక్షాలపై అంతర్జాతీయంగా వత్తిడి పెరగాల్సిన అవసరం వుంది. తూర్పు ఘౌటా లేదా సిరియాలోని మరే ఇతర ప్రాంతాన్నయినా ఆక్రమించుకున్న ఉగ్రవాదులు ప్రభుత్వానికి లొంగకపోతే వారి మెడలు వంచేందుకు అంతర్జాతీయ మద్దతును సమీకరించే హక్కు సిరియా ప్రభుత్వానికి వుంది. అయితే ఈ ప్రయత్నంలో పౌరులకు వీలయినంత కనిష్టస్థాయిలో నష్టం జరిగేవిధంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. అంతిమంగా ఐఎస్ఐఎస్, అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలతో శాంతి చర్చలకు తావులేదన్న విషయాన్ని పై అంశాలన్నీ స్పష్టం చేస్తున్నాయి. ఈ శక్తులను ఓడించాల్సిందేనన్న విషయంలో సంశయానికి ఏ మాత్రం తావులేదన్నదుస్పష్టం.



వాసుదేవ రావు,
గల్ఫ్ జర్నలిస్ట్, బహ్రెయిన్


రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వేడివేడిగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు కాంగ్రెస్ సభ్యుల ఆందోళనలు కొంత ఉద్రిక్తతను సృష్టించాయి. ఈ బడ్జెటులో కూడా సాగునీటి రంగానికే అధిక భాగం కేటాయింపులు ఉంటాయని కెసిఆర్ ప్రాధాన్యాలను బట్టి అంచనా వేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీలేదని కేసీఆర్ నిందిస్తుండగా..మరోవైపు 11 ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేంద్రం సాయం చేసిందని బిజెపి నాయకుడు కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మరోవైపు కెసిఆర్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టే అజెండాతో కాంగ్రెస్ తెలంగాణ యూనిట్ బస్సుయాత్ర సాగిస్తోంది. బస్సు యాత్రకు ప్రజల్లో అనూహ్యస్పందన వస్తున్నట్టు టిపిసిసి అధ్యక్షుడు కెప్టెన్ ఉత్తం కుమార్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ యాత్రను జనం పట్టించుకోవడం లేదన్నది కెసిఆర్, హరీశ్ రావు విశ్లేషణ. మంత్రి కేటిఆర్‌కు, ప్రతిపక్ష నేత జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా ఇతర కాంగ్రెస్ నాయకులకు మధ్య నిందారోపణలు, దూషణల పర్వం కొనసాగుతోంది." కాంగ్రెస్ పార్టీ ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినా ఈసారి 10 సీట్లు దాటదు. నేను చాలెంజ్ చేస్తున్నా. అది కూడా మేము పట్టించుకోకపోతేనే. బిజెపి మొత్తం గల్లంతయ్యే పరిస్థితుంది. ఉన్న సీట్లు వస్తేనే గొప్ప. బిజెపికి తెలంగాణలో ఉన్న సీట్లెన్ని.? అసలు ఆ పార్టీ తెలంగాణలో ఉందా.? పెద్ద జోకు కాకపోతే. మేమే ప్రత్యామ్నాయమని బిజెపి లక్ష్మణ్ అప్పుడప్పుడు అంటుంటారు. బిజెపిని రాజకీయపార్టీగానే పరిగణించం."అని ముఖ్యమంత్రి కెసిఆర్ మార్చి 3 వ తేదీన మీడియా సమక్షంలో విమర్శించారు.

అసెంబ్లీలో బలాబలాల రీత్యా టిఆర్ ఎస్ 91 మంది సభ్యులతో ఎదురులేని పార్టీగా అవతరించింది. ఏడుగురు ఎం.ఐ.ఎం. సభ్యులు కెసిఆర్‌కు మద్దతు పలుకుతున్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినందున ఆ పార్టీ సభ్యుల సంఖ్య 14. ఆర్.కృష్ణయ్య, సండ్ర వెంకటవీరయ్య ఇద్దరే టిడిపిలో మిగిలారు. సున్నం రాజయ్య సి.పి.ఎం.ప్రతినిధి. మిగతా ఐదుగురు భారతీయ జనతా పార్టీ సభ్యులు. ఈ లెక్కన అసెంబ్లీలో ప్రతిపక్ష శిబిరంలో 21 మంది ఎం.ఎల్.ఎ.లు ఉన్నారు. తెలుగుదేశం తెలంగాణలో చెల్లని రూపాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఆధారం చేసుకొని పోరాటం సాగిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ వెలుపల తన పాలసీని ప్రకటించింది. ఈ వేదికపైకి కాంగ్రెస్, టిడిపి నిరాయుధంగా చేరుకుంటున్న వైనాన్ని గడచిన మూడున్నరేళ్లుగా శాసన సభ, మండలి సమావేశాలలో చూశాం.

అధికారపక్షం టిఆర్ఎస్ దాదాపు 91 మందితో శక్తివంతంగా ఉంది. హరీశ్ రావు, కెటిఆర్ ఆల్ రౌండర్లు. ఇరిగేషన్, మార్కెటింగ్, శాసనసభ వ్యవహారాల మంత్రి హరీశ్ రావు ఇటు వ్యూహ ప్రతివ్యూహాలు, అటు సమీక్షలు, పర్యవేక్షణలు, ఆదేశాలతో బహు పాత్రాభినయం చేయడంలో దిట్ట. విపక్షాల కదలికలపై కన్నేసి వాటి వ్యూహాలను పసిగడ్తూ వాటిని మొగ్గలోనే తుంచివేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

టిఆర్ఎస్ పార్టీకీ, ప్రభుత్వానికీ టీమ్ కెప్టెన్, కోచ్, సలహాదారు సర్వం కెసిఆర్. ఆయన వాక్పటిమ ముందు అందరూ దిగదుడుపు. కెసిఆర్ అసెంబ్లీలో, విధాన మండలిలో మాట్లాడుతుంటే సరళమైన తెలుగు భాష, అవసరమైన చోట తగిన గాంభీర్యం, ప్రతిపక్షాలపై దాడి చేసేటపుడు కటువు శైలి, సబ్జెక్టుపై సంపూర్ణ పట్టు, సాధికారత, గొప్ప అవగాహన విపక్షాల శిబిరాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మంత్రముగ్ధులై వినడం మినహా ఆ శిబిరానికి ఇంకో మార్గమే లేదు. విధానమండలిలో అయితే వార్ వన్ సైడ్. టిఆర్ఎస్ సభ్యులతో మండలి కిటకిటలాడుతోంది. విపక్షం ఏడుగురు సభ్యులతో మిగిలిపోయింది.



ప్రధాన ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి మంత్రిగా 19 శాఖలు నిర్వహించిన ఘనుడు. సుదీర్ఘపాలనానుభవం. ఆచితూచి మాట్లాడే నైజం. ఆయనపై స్వపక్షంలో నిందలు. సూటిపోటి మాటలు. ఆడిపోసుకోవడాలు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టలేక పోతున్నారని, కెసిఆర్‌తో గట్టిగా తలపడలేక పోతున్నారని అభియోగం. ఎవరెన్ని చెప్పినా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జానారెడ్డికి ఒక పేజీ ఉంటుంది. ఆయన ఇంట్లోనే తెలంగాణ రాజకీయ జెఏసి పురుడు పోసుకుంది. కెసిఆర్ సహా అధికారపక్షం జానన్న పట్ల మర్యాదగా, గౌరవంగా ఉంటుంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 44 నెలలు. కెసిఆర్ ప్రభుత్వానికి అదే వయసు. 44 నెలలలో ఏ ప్రభుత్వమూ ఆకాశాన్ని నేలపైకి తీసుకు రాజాలదు. టిఆర్ఎస్ ప్రభుత్వం అతి తక్కువ వయస్సులో అనూహ్య విజయాలను సొంతం చేసుకుంది. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం మొదలు, అనేక అంశాలలో ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తోంది. ఇరవై నాలుగ్గంటలూ కరెంటు పుష్కలం. పాలమూరు జిల్లా కరవును ఢీకొనడం అసాధారణం. ప్రజలకు సురక్షిత తాగునీరందించే మిషన్ భగీరథ పనులు క్లైమాక్సులో ఉన్నాయి. చరిత్రలో మొదటిసారిగా మంజీర నది నీటిని సింగూరు ప్రాజెక్టు నుండి నిజాంసాగర్ ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తరలించి ఈ యాసంగిలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. మే నుండి ఎకరాకు 4000 రూపాయల చెక్‌లను రైతులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత చేస్తున్నా తెలంగాణా నేలపైన ఎక్కడో ఒక చోట రైతుల మరణమృదంగం వినిపిస్తూనే ఉంది. దీని నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. ఆ దిశగా కెసిఆర్ అడుగులు వేస్తున్నారు.

సాధారణంగా ఏ పాలకపక్షాన్నయినా ఇరుకున పెట్టడానికి ప్రతిపక్షాలకు లభించే అస్త్రం అవినీతి. తెలంగాణలో అవినీతిని కెసిఆర్ పూర్తిగా నిర్మూలించారనే నిర్ధారణకు రాలేకపోవచ్చును కానీ సాధ్యమైనంత వరకు ఈ భూతాన్ని కెసిఆర్ అదుపు చేయగలిగారని విమర్శకులు కూడా అంటున్నారు. శాంతిభద్రతల వ్యవస్థ సజావుగా ఉన్నది. పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం నెలకొంది. ప్రాజెక్టులను అడ్డుకునేవారంతా ఒక్కటే. కేసుల వెనుక సూత్రధారులు, వాటి వెనుక ఉన్న నాయకుల గుట్టును అసెంబ్లీ వేదికపై రట్టు చేస్తా'నని మంత్రి హరీశ్‌రావు ఢిల్లీలో ప్రకటించారు. కాళేశ్వరం పనులను నిలిపివేయాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. చెన్నై లోని గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించకుండా ఢిల్లీ ఎన్..జి.టి.ని ఎందుకు ఆశ్రయించారని పిటిషర్‌ను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అన్ని అడ్డంకుల్ని అధిగమించి అనుకున్న సమయానికి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు, తాగునీరు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కాళేశ్వరం నుంచి 5 నెలల పాటు రోజుకు 2 టి ఎం సి ల నీటిని ఎత్తిపోసుకోవచ్చు. భవిషత్తులో అవసరమైతే 3 టి ఎం సి లకు పెంచుకోవచ్చు. 142టి ఎం సి ల నిల్వ సామర్థ్యంతో ఆన్ లైన్ జలాశయాలను నింపుకోవచ్చు.

ఎల్లంపల్లి, మిడ్ మానేరు , శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, దిగువ మానేరు, అప్పర్ మానేరు జలాశయాలకు కొరతని బట్టి నీటిని నింప వచ్చు. దారిపొడుగునా వందలాది చెరువులను నింపుకోవచ్చు. రెండు పంటలకు, హైదారాబాద్ నగరానికి, పట్టణాలకు, వందలాది గ్రామాలకు తాగునీరందుతుంది. పరిశ్రమలకు నికరంగా నీరందుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో మొత్తంగా తెలంగాణఆర్థిక ముఖ చిత్రమే మారుతుందని, దేశంలో ఒక అగ్రగామి రాష్ట్రంగా తెలంగాణ రూపొందుతుందని కెసిఆర్, హరీశ్ రావుల అంచనా.

ఎస్.కె. జకీర్

ప్రజల డిపాజిట్లపైనే కన్ను

లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న వారిలో చెల్లించలేకపోయినవారు 7 శాతం ఉండగా, కోట్ల రూపాయల అప్పులు తీసుకొని ఎగగొట్టిన వారు 93శాతం ఉన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధులే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండ్ చేయటం విచిత్రం. ఈ బ్యాంకుల కుంభకోణాలన్నీ డిపాజిటర్ల, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను పణంగా పెట్టినవే. ఈ ఆర్థిక నేరాలన్నీ బ్యాంకుల అత్యున్నత అధికారులు రుణాల ఎగవేతదారులతో చేతులు కలుపడంవల్ల జరిగినవే.



సురవరం సుధాకరరెడ్డి
భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి

నోట్ల రద్దు కుంభకోణాన్ని భారత ప్రజలు ఇంకా మరచిపోలేదు. ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. బీజేపీ నాయకులు మాత్రం ఆ చర్యను నల్లధనంపై ఆకస్మిక దాడిగా అభివర్ణించారు. ఈ వ్యవహారాన్ని చాలా రహస్యంగా ఉంచినట్లు, మంత్రులకు సైతం తెలియదన్నట్లు ఒక విధమైన అభిప్రాయాన్ని కలిగించారు. సామాన్య ప్రజలు నోట్లు మార్చుకోవడానికి చేంతాడు లాంటి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. అనేకమంది క్యూలలోనే కన్నుమూశారు.

కొంతమంది బ్యాంకుల ఖాతాదారులు ఏటీయంల ద్వారా గాని, చెక్కుల ద్వారా గాని తాము దాచుకున్న ధనాన్ని పొందలేకపోతున్నారు. దీని ప్రభావం ఇంకా సగటు జీవిని పీడిస్తూనే ఉన్నది. మొన్న హర్షద్ మెహతా, మద్యం చక్రవర్తి విజయ్ మాల్యా కేవలం ఒకే ఒక్క భారతీయ స్టేట్ బ్యాంక్‌కు రూ. 7,000 కోట్లు ఎగగొడితే, ఈరోజు పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి నీరవ్ మోదీ, గణం రూ. 14,000 కోట్లు ఎగగొట్టారు. బ్యాంకులో అవకతవకలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

కార్పొరేట్ దిగ్గజాలు, ప్రభుత్వం, ఆర్థిక శాఖ ఈ కుంభకోణాలకు సామాన్య గుమాస్తాలను (చిరుద్యోగులను) బాధ్యులను చేయాలని చూస్తున్నారు. పరిశ్రమాధిపతుల సంఘం సైతం కుంభకోణాల ఆరోపణలను గుమాస్తాల మీదకు గురిపెడుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ప్రతి బ్యాంక్ నిర్వహణ, నిర్వాకాలను తనిఖీ చేయాలి. ఇన్ని సంవత్సరాలుగా ఈ తనిఖీ చేయలేదనేది స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘాలు ఒక పుస్తకాన్ని ప్రచురించాయి. ఎంతమంది కార్పొరేట్ దిగ్గజాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు ఏ బ్యాంకు నుండి ఎన్ని కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకొన్నారు? వారు ఎన్ని సంవత్సరాల నుండి ఎంత చెల్లించాల్సి ఉంది వంటి వివరాలు అందులో వెల్లడించారు.

ఈ పాత బాకీలు దాదాపు రూ. 15 లక్షల కోట్లకు చేరుకొన్నాయి. వీటన్నిటినీ నిరర్థక ఆస్తులుగా ప్రకటించే అవకాశముంది. కార్పొరేట్ దిగ్గజాలు ఏటా 6లక్షల కోట్ల రూపాయల రాయితీలు పొందుతున్నాయి.

ఈ కార్పొరేట్ సంస్థలే కుంభకోణాలకు చిరుద్యోగులను బాధ్యులుగా చిత్రీకరిస్తూ, ఈ సమస్యకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణే శరణ్యమని వాదిస్తున్నారు. రుణాల ఎగవేతదారుల పట్ల కఠినవైఖరి అవలంబించని వారంతా ఈనాడు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలని గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకులకు రుణాల ఎగవేతదారుల పట్ల సౌమ్యంగా వ్యవహరించే అధికారులే ఈనాడు బ్యాంకులకు నష్టాలు తేవడానికి బాధ్యులు.

దిగ్భ్రాంతి కలిగించే విషయమేమిటంటే ఒక్క బ్యాంకుకే రూ. 7,000 కోట్లు ఎగవేసిన మద్యం వ్యాపారి విజయ్ మాల్యాకు బీజేపీ రాజ్యసభ సీటు కేటాయించడం. నీరవ్ మోదీ అయితే, 'మీకు చేతనైంది చేసుకోండి' అని ప్రభుత్వానికి సవాలు విసరడం మరొక ఆశ్చర్యకరమైన విషయం.

2016 లోనే బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి నీరవ్ మోదీ బ్యాంకులకు రుణాలు ఎగగొట్టాడని, అతన్ని అరెస్టు చేయాలని, పాస్‌పోర్ట్ రద్దు చేయాలని ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. నీరవ్ ఈ జనవరిలోనే దేశం వదిలి పారిపోవడంతోపాటు, అదే నెల 23-26 తేదీలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో నరేంద్ర మోదీతో గ్రూపు ఫొటోకు పోజు ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవడానికి చిరుద్యోగులే ఈ కుంభకోణానికి కారణమని, అందుకే ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని గోలపెడుతోంది. అదే నిజమైతే బ్యాంకుల జాతీయాకరణకంటే ముందు 200 ప్రైవేటు బ్యాంకులు ఎందుకు మూతపడ్డాయి? అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్‌తో సహా అనేక కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు మూత పడ్డాయి. అమెరికాలో సైతం, లేమాన్ బ్రదర్స్, మెర్రిల్ లించ్, ఏఐడి, ఫ్రెడ్డి, మాక్ ఫాన్నిమాక్, హెచ్‌బీఓఎస్, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్ మూత పడ్డాయి.

ఇవన్నీ ప్రైవేట్ బ్యాంకులే. అందువల్ల అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ కుదుటపడటానికి ఫెడరల్ గవర్నమెంట్ 236 బిలియన్ల (1 బిలియన్స్100 కోట్లు) డాలర్లను వెచ్చించింది. ఈ అర్థ శతాబ్ద కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు అత్యద్భుతంగా అభివృద్ధి చెందాయి. దేశంలోని మారుమూల గ్రామాలకు సైతం శాఖలు విస్తరించాయి. ఈ బ్యాంకులు సన్నకారు రైతాంగానికి, చిరువ్యాపారులకు రుణాలిచ్చి ఆదుకుంటే కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం ఉమ్మడిగా వీటిపై దుమ్మెత్తి పోస్తున్నాయి. పబ్లిక్ రంగ బ్యాంకులు, రాజకీయ జోక్యంతో, రుణమేళాలు పెట్టి బ్యాంకులను దివాలా తీయించారని ఆరోపిస్తున్నారు.

లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న వారిలో చెల్లించలేకపోయినవారు 7శాతం ఉండగా, కోట్ల రూపాయల అప్పులు తీసుకొని ఎగగొట్టిన వారు 93శాతం ఉన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధులే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండ్ చేయటం విచిత్రం. ఈ బ్యాంకుల కుంభకోణాలన్నీ డిపాజిటర్ల, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను పణంగా పెట్టి జరుగుతున్నవే. ఈ ఆర్థిక నేరాలన్నీ బ్యాంకుల అత్యున్నత అధికారులు రుణాల ఎగవేతదారులతో చేతులు కలుపడంవల్ల జరిగినవే. ప్రభుత్వరంగ బ్యాంకులలో అప్పులు తీసుకునే వారికి 90 రోజుల గడువుతోనే అవగాహనా పత్రాలను అందజేస్తారు. బ్యాంక్ నియమావళికి విరుద్ధంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ యాజ మాన్యం 365 రోజులకు ఈ అవగాహనా పత్రాన్ని అందజేసింది. ఈ బ్యాంకులో ఈ తతంగం అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నది. నిర్ధారిత కాలంలో అప్పుతీసుకొన్న వ్యక్తి డబ్బు చెల్లించకపోతే విదేశాలలోని బ్యాంక్ శాఖలు తిరిగి అప్పు ఇచ్చి ఉండాల్సిందికాదు. రుణం తీసుకొన్న వారి ఆస్తుల విలువ మొత్తం రుణం మొత్తం కంటే ఎక్కువ ఉందా లేదా అనేది సాధారణమైన పరిజ్ఞానంతో అంచనా కడతారు. దానివల్ల బ్యాంకుకు ఏమైనా నష్టం వస్తుందా అనే అంశంపై అంచనా వేస్తారు. ఆస్తుల రహస్యమేమిటంటే బ్యాంక్‌లో జరిగే ఆర్థిక నేరాన్ని అరికడితే మేనేజర్‌కు వచ్చే ప్రోత్సాహకాలు లేవు. కాబట్టి మేనేజర్ అప్పు తీసుకొన్నవారితో చేతులు కలిపితే అతనికి ముడుపులు ముట్టడం ఖాయం.

ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లును ముందుకు తీసుకొస్తోంది. ఇదొక మోసపూరిత నల్లచట్టం. పార్లమెంట్‌లో చెవులు, కళ్లు మూసుకొని మందబలంతో ఒకసారి ఈ బిల్లును ఆమోదిస్తే పట్టపగలు డిపాజిటర్ల సొమ్మును ప్రభుత్వం లాగేసుకొని డిపాజిటర్లను వీధిన పడేస్తుంది. డిపాజిటర్ల సొమ్ము నుండి కార్పొరేట్లకు రుణాలను అందజేస్తే వీరు విదేశాలకు వెళ్లి తందనాలాడుతుంటే తద్వారా బ్యాంక్‌లకు నష్టం వాటిల్లితే, ఆ బ్యాంక్ డిపాజిటర్ల సొమ్ముతో, పన్ను చెల్లింపుదార్ల సొమ్ముతో ఆదుకోవడం ఈ బిల్లు లక్ష్యం. వీటినే 'బేల్ ఇన్' అని అంటారు. ఇలాంటి బ్యాంకులను ప్రభుత్వ ఖజానా నుండి గాని డిపాజిటర్ల సొమ్ము నుండి గాని ఆదుకోవడానికి ఈ బిల్లు అధికారాన్ని ఇస్తుంది. ప్రభుత్వమే చెల్లిస్తే 'బేల్ అవుట్' అంటారు. ఈ వార్త బయటికి పొక్కగానే బ్యాంకుల నుండి డిపాజిట్లు ఉపసంహరించుకోవటం చకచకా జరిగిపోయింది. ఈ ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఏటీఎం ద్వారా డబ్బులు తీసుకొనే యంత్రాలలో డబ్బులు లేని పరిస్థితి దాపురించింది. ఈ ఆర్థిక సంక్షోభానికి ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ కానీ, ఫైనాన్షియల్ బిల్లు కానీ జవాబు కానేరదు.

ఇలాంటి రుణ ఎగవేతదారుల పాస్‌పోర్టులను రద్దు చేయడం, వాళ్ల ఆస్తులను జప్తు చేయడం జరగాల్సిందే. రుణ ఎగవేతదారులందరిని వెంటనే అరెస్టు చేయాలి. వారిని జైళ్లకు పంపి కఠినంగా శిక్షించాలి. విదేశాలకు పారిపోయిన వీరిని వెంటనే ఇంటర్‌పోల్ సహకారంతో వెనక్కి రప్పించాలి. వారికి సహకరించిన బ్యాంకు ఉన్నతాధికారులను, బాధ్యతలను విస్మరించిన వారందరిని కఠినంగా శిక్షించాల్సిందే. ప్రభుత్వరంగ బ్యాంకులను పరిరక్షించాలి. ప్రైవేటీకరణ డిమాండ్‌ను నిరాకరించాలి.

15న ఎడ్‌సెట్-2018 నోటిఫికేషన్

●మే31, జూన్1న ఆన్‌లైన్‌లో పరీక్ష

హైదరాబాద్,ఆంధ్రప్రభ: బిఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2018కు మార్చి 15న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో 18 నుంచి స్వీకరిస్తారు. దరఖాస్తులను ఏప్రిల్ 20 వరకు తీసుకుంటారు. అపరాధ రుసుం రూ. 500తో ఏప్రిల్ 30 వరకు, రూ. 2000తో మే 15 వరకు రూ. 5000తో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఎడ్‌సెట్-2018 కమిటీ సమావేశంలో పాపిరెడ్డి అధ్యక్షతన సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. అభ్యర్థి దరఖాస్తులో తప్పులను సరిచేసుకోవడం కోసం మే 5 వరకు అవకాశం ఇచ్చారు. మే 20న హాల్‌టికెట్లను జనరేట్ చేస్తారు. అభ్యర్థులు 21 నుంచి 26 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు పరీక్ష ఫీజు రూ.450 ఇతరులకు రూ. 650గా నిర్ణయించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఫీజును పెంచారు. పరీక్ష మే 31, జూన్ 1 తేదిల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 గటల నుంచి 4.30 గంటల వరకు ఉంటుంది. ప్రాథమక కీని జూన్ 3ను విడుదల చేస్తారు. అభ్యర్థుల నుంచి జూన్ 5 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. జూన్ 11న ఫలితాలను ప్రకటించనున్నట్టు పాపిరెడ్డి తెలిపారు. ఈ ఏడాది అదనంగా సీట్లు మంజూరు చేయలేదని, కొత్త కాలేజీలకు కూడా అనుమతి ఇవ్వలేదని పాపిరెడ్డి తెలిపారు.

గుర్తింపులేని స్కూల్స్‌కి..
'పది' హాల్‌టికెట్లు నిరాకరణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో గుర్తింపులేని ప్రైవేటు స్కూల్స్‌కి ఎస్ఎస్‌సి హాల్‌టికెట్లు ఇవ్వడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు నిరాకరించారు. తమ స్కూల్స్‌కి హాల్ టికెట్లు ఇవ్వకుండా ఎందుకు నిరకరించారని ఆయా పాఠశాలల యజమానులు పాఠశాల విద్య శాఖ అధికారులను ప్రశ్నించారు. దీంతో విషయం ఉన్నతాధికారులకు చేరింది. అందుకు సంబంధించి విచారణ చేపట్టాలని పాఠశాల విద్య సంచాలకులు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డిలోని 17 స్కూల్స్‌కి సరైన గుర్తింపు లేదని అందుకే హాల్‌టికెట్లను జారీ చేయలేదని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు చెప్పారు. దీంతో వాస్తవంగా ఏమి జరిగిందనేదానిపై ఆర్‌జేడీ విచారణ చేపట్టారు. విచారణలో కళ్లు తిరిగే నిజాలు బయటపడ్డాయి.

హాల్ టికెట్లను జారీ చేయకుండా ఆపిన స్కూల్స్‌కి వాస్తవంగా గుర్తింపు ఇచ్చినట్టు పత్రాలు ఉన్నాయి. కానీ అవి సరైనవి కావని అధికారుల విచారణలో తేలింది. ఇదే విషయాన్ని అధికారులు పాఠశాల విద్య సంచాకులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయా స్కూల్స్‌కి జారీ చేసిన గుర్తింపులో ఆర్‌జేడీ స్థాయి అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.

15నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒంటిపూట బడులను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. పరీక్షా కేంద్రాలు ఉన్న హైస్కూల్స్‌లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగించాలని సూచించారు. స్కూల్స్‌లోని ఉపాధ్యాయులు ఉపయోగించే ఆప్షనల్ హాలీడేస్‌ను పాతపద్ధతిలోనే వినియోగించుకోవాలని సర్క్యులర్‌లో సూచించారు.

భాషా ప్రవేశాల వివరాలు సమర్పించండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంస్కృతం, తదితర భాషలు ప్రాధాన్యత కోల్పోయి కనమరుగయ్యే స్థితికి చేరుకున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ), శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో (ఎస్ వీయూ) ఉర్దూ, అరబిక్, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఆంగ్లం తదితర భాషా శాస్త్రాల్లో 2015-16 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలు సమర్పించాలని ఎస్ వీయూ, ఏయూ రిజిస్ట్రార్లను హైకోర్టు ఆదేశించింది. అలాగే డిపార్టుమెంట్ వారీగా మంజూరైన అధ్యాపక పోస్టుల వివరాలు, ఒక డిపార్టు మెంట్ నుంచి ఇంకో డిపార్టుమెంట్ కు బదలాయించిన అధ్యాపక పోస్టుల వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆ రిజిస్ట్రార్లను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. ఆంధ్ర వర్సిటీ, శ్రీవెంకటేశ్వర వర్సిటీల్లో ఉర్దూ, అరబిక్, పర్షియన్, భాషా శాస్త్రాలకు సంబంధించిన అధ్యాపకుల్ని, హిందీ, న్యాయశాస్త్రాలను బోధించేందుకు బదిలీ చేస్తున్నారంటూ సయ్యద్ రహ్మతుల్లా, షేక్ ఖాదర్ హుస్సేన్ లు హైకోర్టులో వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలను దాఖలు చేశారు. పాఠ్య ప్రణాళిక నుంచి పర్షియన్, అరబిక్ ఉర్దూ కోర్సులను తొలగించడాన్నిచట్ట విరుద్ధంగా ప్రకటించాలని వారు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆ వర్సిటీల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ..ఏయూ పరిధిలో 2014 నుంచి ఉర్దూలో ఒక్క అడ్మిషన్ తీసుకోలేదన్నారు. ఎస్ వీయూ వ్యవహారంలో ఉరదరీలో ప్రతి సంవత్సరం 5 నుంచి 8 మంది మాత్రమే ప్రవేశం పొందుతున్నారని తెలిపారు.

వేసవి సెలవుల్లోనే ప్రమోషన్లు ఇవ్వాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను ఇవ్వాలని తెలంగాణ టీచర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. టిటిజేఏసీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎనుకున్నారు. సమావేశానికి పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులి సరోత్తంరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో టిటిజేఏసీ చైర్మన్‌గా పి సరోత్తంరెడ్డి, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ ఎన్ విష్ణువర్ధన్‌రెడ్డిని ఎన్న కున్నట్టు తెలిపారు. డిప్యూటీ చైర్మన్‌గా ఎస్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎల్లాల లక్ష్మారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎస్ సోమేశ్వర్ ఎన్నికయినట్టు సరోత్తంరెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. సమావేశం అనంతరం ఉన్నత విద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యను కలిసి ఉపాధ్యాయులు ఎదు ర్కొంటున్న ప్రధాన సమస్య సర్వీస్ రూల్స్‌ను రూపొందించేలా తగిన చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు కేసును తొలగించి సర్వీస్ రూల్స్ రూపొందించి తద్వారా వేసవి సెలవుల్లోనే పదోన్నతులు, బదిలీలను ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవుల్లోనే కోర్టు కేసును తొలగింపజేసి సర్వీస్ రూల్స్ సమస్యను ఏదోవిధంగా పరిష్కరింప చేస్తామని హామి ఇచ్చినట్టు టిటిజేఏసీ నాయకులు తెలిపారు.

సిమో ఒలింపియాడ్స్‌లో నారాయణ హవా

●సిపోలో77శాతం, సిబోలో67శాతం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: జాతీయస్థాయిఓ సీమో ఎడ్యుకేషన్ నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ ఒలింయాడ్స్‌లో నారాయణ స్కూల్స్ తమ హవాను చాటుకున్నాయి. సౌతిండియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో జాతీయస్థాయి మొదటి 10 ర్యాంకుల్లో 77 శాతం నారాయణ విద్యార్థులే ఉన్నారని సంస్థ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ తెలిపారు. బయాలజీ ఒలింపియాడ్‌లో టాప్ 10 జాతీయ ర్యాంకుల్లో 67 శాతం, సైన్స్ ఒలింపియాడ్‌లో 62 శాతం, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో 60 శాతం టాప్ 10 ర్యాంకులను, మ్యాత్స్ ఒలింపియాడ్‌లో 34 శాతం ర్యాంకులను నారాయణ స్కూల్స్ విద్యార్థులు సొంతం చేసుకున్నారని తెలిపారు.

కత్తులతో స్వైరవిహారాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లో ఎటువంటి చిన్న ఘటన జరగడం లేదని అటు అమాత్యులు, ఇటు పోలీసు ఉన్నతాధికారులు పలు సందర్భాల్లో పరస్పరం ఢంకా బజాయిస్తున్నారు. అందుకు విరుద్ధంగా హైదరాబాద్‌లో చోటు చేసుకునే ఘటనలు పెను సంచలనాన్ని కలిగిస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు సికింద్రాబాద్ మారేడుపల్లికి చెందిన శంకర్(21), శ్రీనాథ్(20) యాక్టీవాపై వెళుతున్నారు. సంగీత్ చౌరస్తా దాటిన తర్వాత హీరో హోండా ప్యాషన్‌పై వచ్చినో వ్యక్తి వేగంగా వీరి వాహనాన్ని రాసుకుంటూ వెళ్లాడు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. తరువాత వారిద్దరూ ముందుకు వెళ్లగా మళ్లీ వచ్చినా ఆ వ్యక్తి.. తన దగ్గర ఉన్న కత్తితో శంకర్ మెడపై, శ్రీనాథ్ కడపులో పొడిచి పరారయ్యాడు. ఈ ఘటనలో శంకర్ కోలుకోగా.. శ్రీనాథ్‌కు ప్రాణాపాయం తప్పింది. వేగంగా ఎందుకబు వెళ్తున్నావ్ అని ప్రశ్నించినందుకు ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు. ఇక ఆదివారం ఘటనలో స్నేహితులతో జరిగిన వివాద నేపథ్యంలో ఓ ఇంటర్ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. వేటకొడవళ్లతో వెంటాడీ మరీ ఇంటర్ విద్యార్థిని పట్టపగలు స్నేహితులే హత్య చేశారని పోలీసులు చెబుతున్నారు. అయతే, ఈ ఘటనలో ఓ నిందితుడు పోలీసులకు చిక్కాడు. పట్టపగలే ఇలాంటి దారుణ ఘటనలు జరుగుతుండంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

51కాలేజీల్లో అడ్మిషన్లు నిల్

●డోస్టు నుంచి మైనారిటీ కాలేజీలకు మినహాయింపు ●25శాతం లోపు ప్రవేశాల కాలేజీలపై వేటు ●19న వీసీల సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఉన్న డిగ్రీ సీట్లల్లో 50 శాతం సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. మిగిలిన 50 శాతం సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. డిగ్రీలో ప్రవేశాలను ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్న విషయం తెలిసిందే. గత రెండేళ్లుగా డిగ్రీ ప్రవేశాలను ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్న సంగతి తెలిసిందే. ప్రవేశాలను ఆన్‌లైన్‌లో నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 51 డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు ఒక్కటీ కూడా రాలేదు. ఆయా కాలేజీల్లో 2016-17లో ఒక్క సీట్లు భర్తీ కాలేదు 2017-18లో కూడా ఒక్క సీటు కూడా భర్తీ కాలేదు. కానీ గత రెండేళ్లుగా ఆయా కాలేజీల యాజమాన్యాలు అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. రెండేళ్లుగా ప్రవేశాలు జరగకపోవడంతో 2018-19లో ఈ కాలేజీలకు అనుమతి ఇస్తే ఆయా కాలేజీల్లోని సీట్లు మిగిలిపోయే అవకాశం ఉంటుందని భావిస్తున్న ఉన్నత విద్యా మండలి ఆయా కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇవ్వకుండా ఉండాలనే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం.

25 శాతం దాటని ప్రవేశాలు...

అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 300 నుంచి 350 కాలేజీల్లో ఉన్న సీట్లలో కేవలం 15 నుంచి 25 శాతం వరకు మాత్రమే సీట్లు భర్తీ అవుతున్నాయి. గత రెండేళ్లల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వీటిలో వేలల్లో సీట్లు ఉండగా, కేవలం వందల్లోనే సీట్లు భర్తీ అవుతున్నాయి. కాబట్టి ఈ కాలేజీలను కూడా మూసేస్తే ఆయా కాలేజీల్లో చేరే వారు ఇతర కాలేజీల్లో చేరే అవకాశం ఉంటుందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఇదే విషయమై ఆయా కాలేజీల యాజమాన్యాలతో ఉన్నత విద్యా మండలి అధికారులు మాట్లాడినట్టు తెలుస్తోంది. కనీసం 25 శాతం కూడా సీట్లు భర్తీ కాకపోతే ఆయా కాలేజీలను నిర్వహించడం కష్టం కాబట్టి వాటిని మూసేసుకోవాలని యాజమాన్యాలకు ఉన్నత విద్యా మండలి సూచించినట్టు సమాచారం. అందుకు యాజమాన్యాలు సుముఖంగా లేనప్పటికీ కనీసం రెండు కాలేజీలు ఒక కాలేజీగా కలిసిపోతే బాగుంటుందనే ప్రతిపాదనను కూడా ఉన్నత విద్యా మండలి చేసినట్టు తెలిసింది.

ఇందుకు కొన్ని కాలేజీలు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. కాలేజీ యాజమాన్యాలు ఇందుకు సముఖంగా లేకపోతే ఉన్నత విద్యా మండలే వాటికి అనుబంద గుర్తింపు ఇవ్వకుండా నిలిపివేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. 2018-19 విద్యా సంవత్సరంలో వీటిలో సుమారు 70 శాతం కాలేజీలను మూసేయాలనే ఆలోచనతో ఉన్నత విద్యా మండలి ఉంది. వీటిని మూసేయడంతో మిగిలిపోయే సీట్ల సంఖ్య తగ్గుతోందని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది.

సీట్ల సంఖ్య కుదింపునకు కసరత్తు

ప్రస్తుతం రాష్ట్రంలో 4.10 లక్షల వరకు డిగ్రీ సీట్లు ఉన్నాయి. వాటిలో కేవలం 2.05 లక్షల వరకు మాత్రమే భర్తీ అవుతున్నాయి. రాష్ట్రంలోని కొన్ని కాలేజీల్లో 10 గ్రూపులకు అనుమతులు తీసుకుంటున్నారు. కానీ వాటిలో కేవలం 4 నుంచి 5 గ్రూపుల్లో మాత్రమే విద్యార్థులు చేరుతున్నారు. మిగిలిన గ్రూపుల్లోని సీట్లు అన్ని ఖాళీగానే ఉంటున్నాయి. అలాగే కొన్ని కాలేజీల్లో కేవలం సైన్స్ గ్రూపుల్లోనే చేరుతున్నారు. ఆయా కాలేజీల్లోని ఆర్ట్స్ గ్రూపుల్లోని సీట్లు అలాగే మిగిలిపోయి ఉంటున్నాయి. ఇలా మిగిలిపోయిన సీట్లు సుమారు 2 లక్షల వరకు ఉంటున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అనుమతి ఉన్న సీట్ల సంఖ్యకు కాలేజీల్లో చేరే సీట్ల సంఖ్యకు పొంతన లేకుండా పోతోంది. వాస్తవంగా అనుమతి ఉన్న సీట్లల్లో 50 శాతం సీట్లు మాత్రమే భర్తీ అవుతుండగా మరో 50 శాతం సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయి. ఈ ఏడాదిలో వాటిని కుదించడం కోసం ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించి యూనివర్సిటీల వారీగా కాలేజీలకు అనుమతి ఇచ్చిన గ్రూపులు, వాటిలో చేరిన విద్యార్థుల సంఖ్యను స్పష్టంగా తీసుకుని వాటిపై 19న జరిగే ఉపకులపతుల సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే డోస్టులో తీసుకోవల్సిన చర్యలపై కూడా వీసీల సమావేశంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోనున్నారు. గత రెండేళ్లుగా డోస్టు ద్వారా ప్రవేశాలను తీసుకోకుండా కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్న కాలేజీలపై కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మైనారిటీ కాలేజీలకు డోస్టు నుంచి మినహాయింపు

రాష్ట్రంలో ముస్లిమ్, క్రిస్టియన్ మైనా రిటీ కాలేజీలు సుమారు 40 వరకు ఉంటా యి. ఆయా కాలేజీలకు డోస్టు నుంచి మిన హాయి ఇచ్చే అవకాశం ఉంది. ఆయా కాలే జీల్లో చేపట్టే డిగ్రీ ప్రవేశాలను డోస్టుకు సంబంధం లేకుండా వారే నేరుగా తీసుకొనే అవకాశాన్ని కల్పించనున్నట్టు సమాచారం. తమను డోస్టు నుంచి మినహాయించాలని ఆయా కాలేజీల యాజమాన్యాలు ప్రభు త్వానికి విజ్ఞప్తి చేయగా సర్కార్ అందుకు అంగీకరించినట్టు సమాచారం. ఈ నేప థ్యం లో రాష్ట్రంలో ఉన్న 40 మైనారిటీ కాలే జీలకు డోస్టు నుంచి మినహాయింపు లభిం చనుంది. వీటితోపాటు అటానమస్ కాలే జీలకు కూడా డోస్టు నుంచి మినహాయింపు ఇచ్చే అవ కాశాలు ఉన్నాయి. ఆయా కాలే జీల్లో కరి కులమ్, పరీక్షల నిర్వహణ వేరుగా ఉంటున్న నేపథ్యంలో వారికి కూడా డోస్టు నుంచి మినహాయింపు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

22న లాసెట్ నోటిఫికేషన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: లాకోర్సుల్లో చేరడం కోసం నిర్వహించే లాసెట్-2018 నోటిఫికేషన్‌ను మార్చి 22న జారీ చేయనున్నారు. పీజీ లాసెట్‌కు కూడా అదే రోజు నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. 25 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువుగా నిర్ణయించినట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన లాసెట్, పీజీలాసెట్ కమిటీల సమావేశాం సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ. 500 ఇతరులకు రూ. 800గా నిర్ణయించారు. అపరాధ రుసుం రూ. 500తో మే 2 వరకు, రూ. 1000తో మే 9 వరకు, రూ. 2000తో మే 16 వరకు, రూ. 4000 అపరాధ రుసుంతో 23 వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు మే 17 నుంచి 20 వరకు అవకాశం కల్పించారు. మే 22 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షమే 25న ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు ఉంటుంది. 28న ప్రాథమిక కీ విడుదల చేస్తారు, 29 వరకు అభ్యంతరాలను స్వీకరించి మే 10న ఫలితాలను విడుదల చేయనున్నారు. పీజీ లాసెట్ పరీక్షకు కూడా ఇదే షెడ్యూల్‌ను అమలు చేయనున్నారు. పరీక్షఫీజు మాత్రం ఎస్సీ, ఎస్టీలకు రూ. 600 ఇతరులకు రూ. 1000 నిర్ణయించారు.

పెళ్లిళ్ల సీజన్‌లో..
మళ్లీ నగదు కష్టాలు

●ఏటీఎంలలో నో క్యాష్ బోర్డ్ ●క్యూలు కడుతున్న ప్రజలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మళ్ళీ నగదు కష్టాలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని పలు ఏటీఎం సెంటర్లలో నోక్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇక క్యాష్ ఉన్న ఏటీఎంల వద్ద ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో ఆయా ఏటీఎం కేంద్రాల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా శుభకార్యాలు జోరుగా సాగుతున్నాయి. పెళ్ళిళ్ళు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో నగదు కొరత ప్రజలను తీవ్రంగా వేధిస్తోందినిన్నా, మొన్నటి వరకు ఎంటీఎం సెంటర్ల వద్ద ఇలాంటి పరిస్థితి లేకపోయినప్పటికీ....ప్రస్తుతం మళ్ళీ దర్శనమిస్తోంది. 2016 నవంబర్ మాసంలో కేంద్రం పెద్దనోట్ల రద్దు చేసింది. వాటి స్థానంలో కొత్త రెండువేల నోట్లతో పాటు ఐదువందల నోట్లను జారీ చేసింది. అలాగే రెండు వందల నోట్లు, యాభై రూపాయల నోట్లను మార్కెట్‌లోకి విడుదల చేసింది. అయితే పాత వెయ్యి, ఐదువందల నోట్లను దృష్టిలో పెట్టుకుని (ఏటీఎం యంత్రాలు) పలు బ్యాంకులు రాష్ట్ర వ్యాప్తంగా ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొత్త నోట్ల కు పాతనోట్లకు వ్యత్యాసం ఉండడంతో కొన్ని నెలల క్రితం వరకు ఏటీఎం సెంటర్లు పనిచేయలేదు. దీంతో ప్రజలు డబ్బు కోసం నానా ఇక్కట్లకు లోనయ్యారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తనోట్లకు అనుగుణంగా ఏటీఎం సెంట ర్లను మార్చారు. అయినప్పటికీ ఆయా సెంటర్లలో సరిప డినంత డబ్బులు ప్రజలకు లభించడం లేదు. ఈ పరిస్థితి హైదరాబాద్‌లో ని పలు ఏటీఎం కేంద్రా వద్ద కనిపిస్తుండగా సంగారెడ్డి జిల్లాలో మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఇక స్వైపింగ్ యంత్రాలు కూడా అందుబాటులో లేకపోవడంతో నగదు రహిత లావాదేవీలు కూడా అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. ఏటీఎంల్లో డబ్బులు లేక...బ్యాంకుల్లో కావాల్సినంత నగదు ఇవ్వక అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రజలు కనీస అవసరాలైన పాలు, కూరగాయలు, నిత్యావసరాలకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. తమ ఖాతాల్లో డబ్బులు ఉన్నా తీసుకోలేని పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.

ఏటీఎంలు ఎప్పుడు తెరుస్తారా? అని ఎదు రుచూడాల్సి వస్తోందన్నారు. బ్యాంకుల్లోనూ నగదు నిల్వ లు లేవని, ఫలితంగా ఎప్పటికప్పుడు ఏటీఎంలలో కరెన్సీని నింపడం లేదని అంటున్నారు. సంగారెడ్డిలో 30వ రకు ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. వీటి పరిధిలో 150వరకు ఏటీఎంలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఎక్కడా డబ్బులు రావడం లేదు. కొన్ని ప్రాంతాలలో ఒకటీ రెండు ఏటీఎంలు పనిచేస్తున్నా...నిమిషాల వ్యవధిలోనే ఖాళీ అవుతున్నాయని ప్రజలు బెబుతున్నారు. దీంతో నగదు కోసం బ్యాంకుల ముందు క్యూకడుతున్నారు. ఇక ఆది లాబాద్ జిల్లాలో కూడా జనానికి నగదు కొరత చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి బ్యాంకులు, ఏటీఎం సెంటర్లలో తగు మొత్తంలో నగదు నిల్వలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా అంజనీకువమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంఛార్జి సీపీ వి.వి.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. 1990లో ఢిల్లీ యూనివర్సిటీలో చదువుతుండగా ఐపీఎస్‌కు అంజనీకుమార్ సెలక్ట్ అయ్యారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందారు. ఆ సమయంలో ఎన్నో అవార్డులను, ట్రోఫీలను ఆయన సొంతం చేసుకున్నారు. తన బ్యాచ్‌లో బెస్ట్ హార్స్ రైడర్‌గా మహ రాజా ఆఫ్ టోంక్ కప్‌ను, బెస్ట్ స్విమ్మర్‌గా ఆర్‌డీ సింగ్ కప్‌ను, బాస్కెట్ బాల్ టీమ్ కెప్టెన్‌గా వ్యవహరించారు. వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సేవలందించారు. 1998-99లో యూఎన్ పీస్ మెడల్‌ను రెండుసార్లు సొంతం చేసుకున్నారు. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అంజనీకుమార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి.

గవర్నర్, డీజీపీలను కలిసిన అంజనీకుమార్

హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయన ఆశీస్సుల నందుకున్నారు. అదే విధంగా డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డిని కలుసుకుని ఆయన ఆశీస్సులను పొందారు.

అడిషినల్ డీజీపీగా జితేందర్


పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో అడిషినల్ డీజీపీ(లా అండ్ ఆర్డర్)గా జితేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న ఆయన ఏడీజీపీ(లా అండ్ ఆర్డర్)కు బదిలీ అయ్యారు. జితేందర్ సెప్టెంబర్ 6, 1965లో జన్మించారు. 1992 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. న్యూఢిల్లీ జెఎన్‌యూలో ఎం.ఫిల్ లైఫ్ సైన్స్‌లో పట్టా పొందారు. ఆదిలాబాద్ నిర్మల్ ఏఎస్పీగా, మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా, వైజాగ్, వరంగల్ రేంజస్, గ్రేహౌండ్స్ డీఐజీగా, ఏపీ పోలీసు అకాడమీ జాయింట్ డైరెక్టర్‌గా, సీఐడీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీపీగా హైదరాబాద్ నగర అడిషినల్ సీపీ(ట్రాఫిక్)గా, టీఎస్‌పీఏ డైరెక్టర్‌గా జితేందర్ సేవలందించారు. విధి నిర్వాహణలో ఆయన పలు మెడల్స్, అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇంటర్నల్ సెక్యూరిటీమెడల్ పొందారు.

ఏపీ శాసనసభ, మండలి భవనాలను
స్వాధీనం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం


హెదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి భవనాలను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సమావేశాలు అమరావతిలో జరుగుతున్నందున ఇక్కడి అవసరాల మేరకు ఆ రాష్ట్ర భవనాలను కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విజ్ఞప్తిపైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల శాసనమండలి ఛైర్మన్లు, ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపి భవనాల అప్పగింతకు సంబంధించి అంగీకారం కుదిర్చుకున్నారు. అప్పగింతల ప్రక్రియ పూర్తి కావడంతో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన అసెంబ్లీ, మండలి భవనాల మరమ్మత్తులను తెలంగాణ ప్రభుత్వ అధికారులు చేపట్టారు. సమావేశ మందిరం, గదులకు తెలంగాణ అవసరాల మేరకు మెరుగులు దిద్దుతున్నారు. ఆంధ్రప్రదేశ్ బోర్డులను తొలగించి తెలంగాణ బోర్డులను ఏర్పాటు చేశారు. మండలి ఛైర్మన్, డిపట్యాటీ ఛైర్మన్, ముఖ్యమంత్రి ఛాంబర్లకు మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సమావేశ మందిరాన్ని తెలంగాణ శాసనమండలి సమావేశాలకు వినియోగించుకుంటే, జూబ్లీహాల్‌ను తిరిగి పాత తనహాలోనే అధికారిక సమావేశాలకు, సదస్సులకు వినియోగించుకొనే వెసులుబాటు కలుగుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఆహార శుద్ధి పరిశ్రమలపై సమాలోచన

●వ్యవసాయ శాఖ పార్థసారధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపన, తదనంతర ఉత్పత్తులు, వాటి ఎగుమతిపై వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి అనుబంధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. ఏఏ ఆహార పదార్థాలు ఎక్కడెక్కడ అధికంగా ఉత్పత్తి అవుతాయో వాటి సంబంధిత ప్రాసెసింగ్ యూనిట్లను మాత్రమే అక్కడ ప్రోత్సహించాలన్నారు. అదే సమయంలో ఉత్పత్తి చేసిన ఆహార పదార్థాలను నిల్వ చేసేందుకు అక్కడక్కడ కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా బి.మనోహర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించినట్టు తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది.

నడి రోడ్డుపై యువకుడి దారుణ హత్య



మూసాపేట్, ప్రభ న్యూస్ : జులాయితనం, చెడు అలవాట్లు, ఆదిపత్య పోరు వెరసి ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హతుడు, హంతకులు ఒకే నివాస ప్రాంతం ఒకరికి ఒకరు తెలిసిన వారైన మానవత్వాన్ని మరచి తమ కక్ష్యను తీర్చుకునేందుకు యువకుడిని నడి రోడ్డుపై అందరు చూస్తుండగానే అత్యంత దారుణంగా నరికి చంపే చేశారు. యుక్త వయస్సులో వ్యక్తిగత కక్ష్యలు, చెడు అలవాట్లు, గ్రూపుల ఆధిపత్యాలను చాటుకునేందుకు తహతహలాడుతున్నారనేందుకు ఈ పాశవిక హత్య ఉదంతంగా పోలీసులు భావిస్తున్నారు. పరీక్షకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఇంటర్ విద్యార్థిని కాపు కాసి వెంటాడి వేట కొడవళ్లతో దారుణంగా నరికి చంపేశారు. ఏసీపీ కార్యాలయానికి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగిన ఈ దారుణ హత్య కేసులో హత్య చేసి పారిపోతున్న వారిలో ఒకరిని ట్రాఫిక్ హోంగార్డ్ వెంబడించి పట్టుకున్నాడు.



వివరాల్లోకి వెళితే కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్ జనతానగర్‌లో నివసించే రాజు పాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాజుకు నలుగురు సంతానం. వారిలో చిన్న వాడైన సుదీర్ కూకట్‌పల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం పరీక్ష రాసేందుకు కళాశాల స్నేహితులు మేఘనాథ్, సాయిలతో కలిసి బైక్‌పై బయలుదేరిన సుదీర్‌ని కూకట్‌పల్లి జేఎస్‌పి హోండా షోరూం వద్ద సినిమా ఫక్కిలో అప్పటికే కాపు కాసిన నలుగురు దుండగులు వేటకొడవళ్లతో అత్యంత కిరాతకంగా పొడిచి చంపేశారు. అడ్డగించేందుకు ప్రయత్నించిన సాయి, మేఘనాథ్‌లపై దాడికి పాల్పడటానికి ప్రయత్నించడంతో వారు అక్కడి నుంచి ప్రాణ భయంతో పారిపోయారు. హత్య అనంతరం పారిపోతున్న నలుగురు నిందితులను అక్కడే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్ విధులు నిర్వహిస్తున్న పరమేష్ వెంటపడి అందులో ఒకరిని పట్టుకున్నాడు. అప్పటికే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులకు హోంగార్డు పట్టుకున్న నిందితుడిని అప్పగించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియ రాలేదని, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా మూసాపేట్‌లో నివసించే కృష్ణ, మహేశ్, తేజ, నవీన్‌లు ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో మహేశ్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. మిగిలిన ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మృతుడు హత్యకు పాల్పడిన నిందితులు దురలవాట్లకు బానిసలై ఒకరిపై ఒకరు ఆదిపత్యం చలాయించాలనే ఉద్దేశ్యంతో గ్రూపులుగా ఏర్పడి పరస్పర దాడులకు పాల్పడుతూ ఉండేవారని అందులో ఏర్పడిన కక్ష్యల కారణమే సుదీర్ హత్యకు దారి తీసిందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

లక్షా 36వేల ఉద్యోగాలు !

న్యూఢిల్లీ: కీలకమైన ఎనిమిది రంగాల్లో 1.36 లక్షల ఉద్యోగాలు వస్తాయని కార్మిక బ్యూరో ఒక సర్వేలో పేర్కొంది. ఈ ఆర్థికసంవత్సరం జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికం లో తయారీ,



ఐటీ, రవాణా లాంటి కీలక రం గాల్లో ఉపాధి కల్పనలో గణనీయమైన వృద్ధి కనిపి స్తుందని తెలిపింది.

రంగాల వారీగా చూ సిన ప్పుడు తయారీ రంగం 89 వేల ఉద్యోగా లు, వి ద్యా రంగం 21 వేలు, రవాణా రంగం 20 వే లు, వాణిజ్యం 14 వే లు, ఆరోగ్యం 11 వే లు,అకా మడేషన్ అండ్ రెస్టారెంట్ 2 వేలు, ఐటీ/బిపిఓ రంగం 1,000 ఉద్యోగాలు జోడిస్తుందని వెల్లడిం చింది.



జీఎస్టీకి దెబ్బ మీద దెబ్బ

• బిల్లులు లేకుండా దిగుమతులు • నల్లబజారులో అమ్మకాలు

• తొమ్మిది నెలల్లోనే భారీగా ఎగవేతలు • పడిపోతున్న జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జిఎస్టీ) రంగంలోకి వచ్చిన తొమ్మిది మాసాల్లోపే నల్ల బజారు గుండా, దిగు మతులను తక్కువ విలువ కట్టి చూపడం ద్వారా పెద్ద ఎత్తున పన్ను ఎగవేత చోటు చేసు కుంటున్న వైనాన్ని రెవెన్యూ అధికారులు గుర్తిం చారు. దిగుమతి దారులు జిఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ బిల్లులు లేకుండా సరకులు సరఫరా చేస్తున్నారని అధికా రుల బిగ్ డేటా ఎనలిటిక్స్ వెల్లడించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.



డేటా అధ్యయనంతో చెక్

డేటా అధ్యయనం మొదలైందంటే దానర్థం ప్రభుత్వం త్వరలో పన్ను ఎగవేతదారులను గుర్తిస్తుందని భావించాలని ఎఎంఆర్జి అండ్ అసోసియేట్స్ పార్టనర్ రజత్ మోహన్ తెలిపారు. దిగుమతిదారులు పెద్ద ఎత్తున పాల్పడుతున్న పన్ను ఎగవేతను అధికారులు వెలుగులోకి తీసుకు రావాలని తాను భావిస్తున్నట్టు చెప్పారు. వారు లగ్జరీ వస్తువులు లేదా మొబైల్ ఫోన్లు లాంటి సరకులను అత్యం త తక్కువ ధరల వద్ద దిగుమతి చేసుకుంటారు. అనంతరం అలాంటి వస్తువులను ఎలాంటి పన్నులు చెల్లించకుండా నల్ల బజారు లో విక్రయిస్తారని రజత్ మోహన్ తెలిపారు. తక్కువ వసూళ్ళతో కునారిల్లుతున్న ప్రభుత్వం పన్ను ఎగవేతదా రులపై దాడికి డేటా ఎనలిటిక్స్‌ను వినియో గిస్తుందని చెప్పారు.

లోక్‌సభకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానం ప్రకారం

జీఎస్టీ వసూళ్ళు జు లైలో రూ.93,590 కోట్లు,ఆగస్టులో రూ. 93,029 కోట్లు, సెప్టెంబ ర్‌లో రూ.95,132 కోట్లు, అ క్టోబర్‌లో రూ.85,931 కోట్లుగా ఉన్నాయి.అలాగే న వం బర్‌లో వసూళ్ళు రూ. 83,716 కోట్లు కాగా డిసెం బర్ లో రూ.88,929 కోట్లు, జనవరిలో 88,047 కోట్లుగా ఉన్నాయి.

ఎగవేతదారులపై నజర్

జిఎస్టీ కింద నెలవారి రెవిన్యూలు పడిపోతున్న తరుణంలో 73,000 మందికిపైగా పన్ను చెల్లింపుదారులు దాదాపు రూ.30 వేల కోట్ల వరకు ఐజిఎస్టీ చెల్లిస్తున్నారు కానీ దానికి రిఫండ్ క్లయిమ్ చేసుకోవడం లేదని ప్రాథమిక డేటా అధ్యయనం తేల్చింది. ప్రొప్రయిటర్, పార్టనర్‌షిప్ కంపెనీలపై కన్నేసిన రెవెన్యూ శాఖ ఎగవేతదారులను గుర్తించేందుకు రిస్క్ ఆధారిత పరామితులను వినియోగిస్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. రెవెన్యూ అధికారుల దగ్గరున్న డేటా ప్రకా రం రూ.16,965 కోట్ల విలువైన ఐజిఎస్టీ రి ఫండ్ క్లయిమ్‌లు జులై-జనవరి కాల వ్యవ ధికి కస్టమ్స్ సిస్టమ్‌ల వద్ద దఖలు అ య్యా యి. రూ.9,760 కోట్ల విలువైన అర్హమైన క్లయిమ్‌లకు గాను దాదాపు రూ.4,815 కోట్లు రిఫండ్లుగా మంజూరయ్యాయి.

ఐజీఎస్టీ చెల్లింపుతో సరి

దిగుమతిదారులు దేశంలోకి తీసుకువచ్చిన సరకులపై సమీ కృత వస్తు, సేవల పన్ను(ఐజిఎస్టీ) చెల్లిస్తారు. ఈ పన్నును చిట్టచి వరి వినియోగదారు చెల్లించేవాస్తవిక జిఎస్టీకి ప్రతిగా చెల్లించ డంలేదా రీఫండ్‌క్లయిమ్ చేసుకోవడం జరగాలి. అధ్యయన ఫలితాల ప్రకారం పెద్ద కంపెనీలు సహా దిగుమతిదారులు దిగుమతులపై ఐజిఎస్టీ చెల్లిస్తున్నారు. కానీ దానికి జమ చేస్తున్నట్టు క్లయి మ్ చేయడంలేదు. దానర్థం ఎలాంటి బిల్లులు లేకుండానే దేశం లోకి సరకులను దిగుమతి చేస్తున్నారని సంబంధిత వర్గాలు తెలి పాయి. ఇదే పరిస్థితి లగ్జరీ సరకులపై విధించే సుంకానికి ఉంది. కంపెనీలు దిగుమతులు చేసుకునేటప్పుడు చెల్లిస్తున్నాయి కానీ వినియోగదారులు చిట్టచివరి జిఎస్టీ చెల్లించినప్పుడు దానిని జమ చేస్తున్నట్టు క్లయిమ్ చేయడంలేదు. పన్ను ఎగవేత అంశంపై జిఎస్టీ మండలి శనివారంనాటి సమావేశంలో చర్చించింది.



హైదరాబాద్‌లో ఇసే ఫుడ్స్ ప్లాంట్ !

• పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణా కేంద్రం

• రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జపాన్‌కు చెందిన ప్రముఖ ఫుడ్స్ కంపెనీ ఇసే ఫుడ్స్ తెలంగాణలో తన కంపెనీని ప్రారంభించనుంది. ఈ మేరకు ప్రభుత్వ అనుమతులు, రాయితీలను ప్రభుత్వం తరఫున మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డిలు కంపెనీ సీనియర్ ప్రతినిధి బృందానికి సోమవారం అందజేశారు. కంపెనీ ప్రతినిధి బృందంతోపాటు జపాన్ ప్రధానమంత్రి ప్రత్యేకసలహాదారు మిత్సుహిరో మియాకోశి, జపాన్ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఇసే ఫుడ్స్ సుమారు 47 బిలియన్ల యెన్ల అమ్మకాలను గత ఏడాది నమోదు చేసింది. కంపెనీకి దేశ, విదేశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఇసే ఫుడ్స్ సిద్దిపేటలోని నంగనూర్ మండలంలోని నర్మెట్టా గ్రామంలో సుమారు 140 ఎకరాల్లో తన పరిశ్రమను ఏర్పాటు చేయనున్నది. ఇక్కడి నుంచి కోడిగుడ్ల ప్రాసెసింగ్ పరిశ్రమతో పాటు కోళ్ళఫాంలో లభించే వ్యర్థలతో సేంద్రీయ ఎరువులను సైతం తయారు చేయనున్నది. దీంతోపాటు పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడి విద్యార్థులను శిక్షణకోసం జపాన్ తీసుకువెళ్ళేందుకు అవకాశం కల్పిస్తుంది. దీంతో పాటు సుజుకి కంపెనీ భాగస్వామ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఆర్అండ్‌డి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇదే కేంద్రం నుంచి రెండు, మూడేళ్లలో బ్యాటరీలను సైతం ఉత్పత్తి చేయనుంది. ఇసే ఫుడ్స్ హైదరాబాద్‌లోని నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీ ద్వారా టోక్యో ఒలంపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఒక ఎంవోయూను ఈ సందర్భంగా కుదుర్చుకున్నారు.జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీ తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపట్ల మంత్రి కేటీ రామారావు హర్షం వ్యక్తంచేశారు. జపాన్‌లో పెట్టుబడుల కోసం పర్యటన చేసిన సందర్భంగా ఈ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని గుర్తుచేశారు. జపాన్ ప్రధాని సలహాదారు, కంపెనీ చైర్మన్, ప్రతినిధులతో మంత్రులు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, పాలసీలు, ఇక్కడి పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని మంత్రి వివరించారు. జపనీస్‌లో ముద్రించిన తెలంగాణ పారిశ్రామిక పాలసీని మంత్రి అదించారు. తెలంగాణకు జపాన్‌కు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, ఇప్పటికే జైకా వంటి ఆర్థిక సంస్థలు తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులకు 14 రంగాలకు ప్రాధాన్యత రంగాలుగా పెట్టుకున్నదని, ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తెలంగాణ ప్రణాళికలను మంత్రి వివరించారు. తెలంగాణ సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

• ఆర్థిక మంత్రిగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

• గోల్డ్ స్కీంకు పచ్చజెండా • 13కంపెనీలకు రూ.4,500 కోట్ల ఆయాచిత లబ్ధి

• చర్యలకు కేంద్రం సన్నాహాలు

• వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటన

చిదంబరం మెడకు గోల్డ్ స్కీమ్!



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరంపై చర్యలకు ఉపక్రమించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నది. యుపిఎ ప్రభుత్వం చివరి రోజుల్లో ప్రయివేట్ ట్రేడింగ్ కంపెనీల కోసం బంగారం దిగుమతిపై నియమ, నిబంధనలను సడలించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సడలింపు కారణంగా అలాంటి 13 కంపెనీలకు కేవలం ఆరు మాసాల్లోనే రూ.4,500 కోట్ల లబ్ది చేకూరిందని పేర్కొంది. రూ.12,700 కోట్ల పిఎన్‌బి కుంభకోణంతో కాంగ్రెస్ నుంచి దాడిని ఎదుర్కొంటున్న పాలక బిజెపి చిదంబరంపై అస్త్ర శస్త్రాలను సంధించింది. 80:20 స్వర్ణ దిగుమతి పథకం ద్వారా పిఎన్‌బి స్కామ్‌లో ప్రధాన నిందితులు మెహుల్ చోక్సీ, నీరవ్ మోడీలకు చిదంబరం సాయం చేశారని ఆరోపిం చింది. సోమవారం నాటి ప్రకటనలో పథకం నుంచి లబ్ది పొందిన వ్యాపారుల పేర్లను ప్రభుత్వం వెల్లడించలేదు.



ప్రయివేట్ స్వర్ణ దిగుమతిదారుల పట్ల అన్ని రకాల అనుకూలతలకు ముగింపు పలికే నిమిత్తం అధికారంలోకి వచ్చిన కొద్ది మాసాల్లోనే పథకాన్ని రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం సాహసోపేతమైన అడుగు వేసిందని తెలిపింది. సదరు పథకం దేశంలోకి బంగారం దిగు మ తులను పెంచిందని, 2012-13 ఆర్థిక సంవత్సరానికి కరెంటు ఖాతా లోటుపై ఒత్తిడి పెట్టిందని వెల్లడించింది. ఫలితంగా కస్టమ్స్ సుంకం పెంపుదల సహా దిగుమతులపై అనేక ఆంక్షలకు దారి తీసింది. ఇది 2013 సంవత్సరం జులై, ఆగస్టు మాసాల్లో చోటు చేసుకుంది. అదే సమయంలో 20:30 పథకం బ్యాంకులు, ఎంఎంటిసి, ఎస్‌టిసి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు బంగారాన్ని దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. అందులో కేవలం ఐదవ వంతు మాత్రమే ఎగుమతి అయ్యింది. అయితే 2014, మే 21వ తేదీన 20: 80 పథ కం కింద బంగా రం దిగుమతికి ప్రీమియర్ ట్రేడింగ్ కంపెనీలు(పిటిహెచ్), స్టార్ ట్రేడింగ్ కంపెనీలను (ఎస్‌టిహెచ్) అను మతించడం జరిగింది అని ప్రభుత్వం సదరు ప్రకటనలో తెలిపింది. పథకం కింద బంగారం దిగుమతి చేసుకోవడానికి కడకు ప్రయివేట్ వ్యాపారులను సైతం అనుమతిస్తూ చిదంబరం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించింది. అప్పటి ఆర్థిక మంత్రి 2014, మే 13న సవరించిన పథకానికి ఆమోద ముద్ర వేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటనతో అదే ఏడాది మార్చి ఐదవ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. అదే ఏడాది మే 16న ఓట్ల లెక్కింపు జరగనుంది. అయినప్పటికీ సవరించిన పథకం ఆమోదం పొందింది అని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సదరు ప్రకటనలో తెలిపింది. అప్పట్లో దేశీయంగా స్వర్ణ వినియోగానికి కొరత ఉంది. ఒక కేజీ బంగారం దాదాపు రూ.2 లక్షలు పలికింది.



పిటిహెచ్, ఎస్‌టిహెచ్ లాంటి ప్రయివెట్ కం పెనీలను స్వర్ణ దిగు మతికి అనుమతించ డం వలన భారీ లబ్ది పొందే అవకాశం సదరు కంపెనీలకు దక్కింది. అలాంటి కంపెనీలు ఇప్పటికీ బంగారంపై అత్యధిక ప్రీమియం పొందుతున్నా యి అని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా కాగ్ నివేదికను ప్రస్తావించింది. 2014 జూన్ నుంచి నవంబర్ మధ్య కాలంలో 13 ట్రేడింగ్ కంపెనీలు 282.77 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకున్నాయి. దానర్థం పైన పేర్కొన్న కాలవ్యవధిలో కేజీ బంగారం ధర రూ.2 లక్షలు చొప్పున దిగుమతి చేసుకున్న బంగారాన్ని దేశవాళీ మార్కెట్‌కు సరఫరా చేయడం ద్వారా సదరు కంపెనీలు దాదాపు రూ.4,500 కోట్ల మేరకు లబ్ది పొందాయని పేర్కొంది. ట్రేడింగ్ కంపెనీలకు భారీగా లబ్ది చేకూర్చడానికి దారి తీసిన పరిస్థితులను ప్రభుత్వం కచ్చితంగా పరిశీలిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రకటన తెలిపింది. ప్రభుత్వ సంధికాలంలో పథకం తీసుకువచ్చిన వారిపై చర్యలు తప్పవని పేర్కొంది.



ఆస్తుల జాబితా ఇస్తే... వేలం వేస్తాం



• గృహ కొనుగోలుదారులకు చెల్లిస్తాం • యూనిటెక్ కంపెనీకి సుప్రీం కోర్టు అదేశం • ఆఫిడవిట్ దాఖలుకు 26 దాకా గడువు • జెఎం ఫైనాన్షియల్‌కు రూ.25 కోట్లు జరిమానా

న్యూఢిల్లీ: దేశ,విదేశాల్లోని వివాదరహిత ఆస్తుల జాబితా ఇవ్వాలని రియ ల్ ఎస్టేట్ కంపెనీ యునిటెక్ లిమిటెడ్, జైలు పాలైన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సం జయ్ చంద్రను సుప్రీం కోర్టు సోమ వారం ఆదేశించింది. గృహ కొనుగోలుదారుల బకాయిలు తీర్చడానికి ఆస్తులు వేలం వేయడం జరుగుతుందని స్పష్టం చేసింది. చీ ఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎం. ఖన్‌విలకర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం యునిటెక్ లిమిటెడ్‌కు హెచ్‌డిఎఫ్‌సి అడ్వాన్స్ చేసిన కొన్ని రుణా లను తీసుకున్న జె.ఎం.ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (జెఎంఎఫ్ఎఆర్-సిఎల్)కు రూ.25 కోట్ల జరిమానా సైతం విధించింది. రెండు కంపెనీలూ కలిసి గృహ కొనుగోలుదారులకు జెఎంఎ ఫ్ఎఆర్-సిఎల్ నగదు తిరిగి చెల్లిస్తుందనే భావనను కలిగించాయని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం యావత్ విచారణ పక్కదారి పడుతున్నదని వ్యాఖ్యానించింది. ఇది ప్రధాన కేసును అనవ సరంగా పక్కదారి పట్టించిందని భావిస్తున్నామని జరిమానా విధించిన సంద ర్భంగా ధర్మాసనం పేర్కొంది. అసలైన గృహ కొనుగోలుదారులు ఇక్కడే ఉన్నారు. వారు మోసపోయారు అని వ్యాఖ్యానించింది. గృహ కొనుగోలుదారుల బకాయిలు తీర్చడానికి కంపెనీకి చెందిన వివాదరహిత ఆస్తులన్నింటిని వేలం వేయాలని ఆదేశిస్తాం అని ధర్మాసనం తెలిపింది.యునిటెక్ లిమిటెడ్‌కు చెందిన సమర్థ మంతమైన అధికారి భారతదేశంలో, విదేశాల్లో కంపెనీ, దాని అనుబంధ కంపెనీల వివాదరహిత ఆస్తుల జాబితాను ప్రస్తావిస్తూ ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఆదేశించింది. అఫిడవిట్ అవాస్తవమైన పక్షంలో భారతీయ శిక్షాస్మృతి(సిఆర్‌పిసి)లో సెక్షన్ 340 కింద చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించింది. కంపెనీ ఎండీ జైలులో ఉన్నారంటూ ఆయన తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ విన్నవించుకోగా, మీరు నగదు చెల్లించి బెయిల్ పొందండి అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. వివాదరహిత ఆస్తులను నిగ్గుతేల్చే పనిలో చార్టెర్డ్ అకౌంటెంట్లు ఉన్నందున వాటి పూర్తి వివరాలు దాఖలు చేయడానికి సమయం కావాలని న్యాయవాది అభ్యర్థించారు. ధర్మాసనం ఈ నెల 26 దాకా సమయం ఇచ్చింది. జెఎంఎ ఫ్ఎఆర్-సి ఎల్ కు జరిమా నా రద్దు చేసిన పక్షంలో కంపెనీ ఆ మొత్తం తో ప్రా జెక్టులను పూర్తి చేసి ఫ్లా ట్లను గృహ కొనుగోలు దారులకు అంద జేస్తుంటదనే అభ్యర్థన ధర్మా సనం ముందుకువచ్చిం ది. అయితే దానిపై ధర్మా సనం స్పందిం చలేదు.



డూప్లికేట్లకు క్యాష్ బ్యాక్!

• ఆన్‌లైన్ కొనుగోళ్లపై ప్రత్యేక మెకానిజం • వినియోగదారులకు అండగా సర్కారు • ఈ-కామర్స్ కంపెనీలతో మంతనాలు

న్యూఢిల్లీ: బ్రాండెడ్ ఐటెమ్స్ కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే వాటికి బదులుగా డూప్లికేట్ వస్తువుల ను పొందుతున్న బాధితులు కోకొల్లలు. న్యాయం పొం దడానికి సరైన వే దిక లభించక బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా డూప్లికేట్ వస్తువులను పొందుతు న్న వినియోగదారులకు పరిహా ర్థం ఒక యంత్రాం గాన్ని నెలకొల్పాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. క్యాష్ - బ్యాక్ అనే పేరుతో పిలిచేందుకు అవకా శం ఉన్న అలాంటి ఒక సిస్టమ్ ఇంకా ఆలోచనల్లోనే ఉందని సంబంధిత అధికా రి ఒకరు తెలిపారు. దీనికి సంబంధించిన చర్చలు ఇ-కామర్స్ కంపెనీలు, పారి శ్రామిక విధానం మరి యు ప్రోత్సాహక డిపార్ట్ మెంట్(డిఐపిపి), వినియోగ దారు వ్యవహారాల మం త్రిత్వ శాఖ మధ్య నడుస్తున్నా యి. యం త్రాం గం ముఖ్యో ద్దేశ్యం దేశీయ మార్కెట్‌లో డూప్లికేట్ ఉత్పత్తుల విక్రయాన్ని అరికట్టడం. ఆ క్ర మంలో ఇదే విషయమై మే ము అనేక మందితో సంప్రదింపు లు జరపాల్సిన అవసరం ఉందని అధి కారి వెల్ల డిం చారు. ప్రభుత్వ పరిగణన లో ఉన్న సదరు యంత్రాంగం స్వాభావికంగా స్వ తం త్రంగా వ్య వహ రించనుం ది. డూ ప్లికేట్ వస్తువుపై ఫిర్యాదు చేసే సౌలభ్యం, సదరు ఉ త్పత్తి డూప్లికేట్‌దా కాదా అని నిర్ధా రించేలా యం త్రాం గం రూప కల్పనపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి.



వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకారం డూ ప్లికేట్ ఉత్పత్తులు గణనీయంగా పెరిగిపో తున్నాయి. అవి ఒక ప్రాపంచిక ప్రభావంతో విస్తృతమైన విధానంగా అవతరించాయి. వీటి వలన బ్రాండ్ విలువ పడిపోతుంది. తయారీదారుల పేరు ప్రతిష్ఠలు దెబ్బ తింటాయి. యజమానుల మేథోసంపత్తికి(ఐపి) పెను విఘాతంగా మారుతుంది. సామాజిక విపరిణా మాలకు దారి తీస్తుంది. ఫలితంగా పన్నులు, రెవె న్యూల నష్టంతో భారీ ఎత్తున ఆర్థిక నష్టాలకు కార ణమవుతుంది. అది ఇతర అక్రమ కార్యకలాపాలకు నిధుల మళ్ళింపునకు దారి తీస్తుంది. వినియో గదారుల ఆరోగ్యం, భద్రతకు ముప్పు వాటిల్లుతుంది.







అసెంబ్లీ సమావేశాలు



అసెంబ్లీ మీడియా పాయింటు ..

కేసీఆర్ కుటుంబానికి ఇదే చివరి బడ్జెట్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి ఇదే చివరి బడ్జెట్ అని పీసీసీ నేత ఉత్తం కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో 4వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోతే గవర్నర్ ప్రసంగంలో ఒక్కమాట కూడా లేదన్నారు. రైతుల రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని చెప్పి ఒక్కరూపాయి కూడా చెల్లించలేదన్నారు. నిరుద్యోగ యువత గురించి గవర్నర్ ప్రసంగంలో ఒక్కమాట కూడలేదన్నారు. ముస్లింరిజర్వేషన్లు, దళితుల రిజర్వేసన్లపై కూడా ప్రసావన లేదన్నారు.ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని గవర్నర్ ప్రసంగం పట్ల ప్రజల పక్షాన అసెంబ్లీలో నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం కాలరాసిందన్నారు. సభలో మార్షల్స్ ద్వారా ఎమ్మెల్యేలపై దాడి చేయించారని , తమ పార్టీ ఎమ్మెల్యేలు పలువురు గాయ ల పాలయ్యారన్నారు. సభలో ప్రభుత్వతీరును ప్రజల్లో ఎండ గడతామన్నారు.మండలి చైర్మన్ స్వామిగౌడ్ పట్ల తమకు ,తమ పార్టీ సభ్యులకు అపార గౌరవం ఉందన్నారు.

తాగుబోతు ప్రభుత్వం : కోమటిరెడ్డి



రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం విచ్చల విడిగా మద్యం అమ్మకాలను పెంచుతూ ప్రజలనుంచి 20వేల కోట్లు పిండుకుంటున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సహా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమను వైద్యపరీక్షలు చేయిస్తే ఎవరు సభకు తాగివచ్చారో తెలుస్తుందన్నారు. తాగుబోతు ఎవరో బయటకు రావాలన్నారు. గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రభుత్వం పచ్చి అపద్దాలు చెప్పిస్తుంటే నిరసన తెలిపామే తప్ప తమకు ఎవరిపైనా దాడి చేసే ఉద్దేశ్యం లేదన్నారు. ఇదే సభలో గవర్నర్ ప్రసంగం ప్రతులు చింపి ఇదే గవర్నర్ ముఖాన విసిరికొట్టి పిడిగుద్దులు గుద్దిన హరీశ్ రావు తమకు నీతులు చేప్పాల్సిన పనిలేదన్నారు.

సభలో ఆర్ధవంతమైన చర్చ జరగాలి
టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి




అసెంబ్లీలో అర్ధవంతమైన చర్చలు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షం సభ సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు. కాంగ్రెస్ బస్సుయాత్ర తుస్సుయాత్రగా మారిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల వ్యానిఫెస్టోలో పెట్టిన 103 అంశాల్లో 97 అంశాలను ఇప్పటికే అమలు చేసిందని పేర్కొన్నారు.

దాడులు మంచి పద్దతికాదు: కొండా సురేఖ




అసెంబ్లీలో గవర్నర్‌పై దాడులు చేయటం మంచి పద్దతికాదని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. చర్చలకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తోందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కావాలనే స్పీకర్‌పైకి మైకు విసిరారని ఆరోపించారు. సభా నిర్వహణకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

వాస్తవికత లేని ప్రసగం: సున్నం రాజయ్య




అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు దూరంగా ఉందని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. వ్యవసాయం బతకాలంటే స్వామినాధన్ , జయంతీఘోష్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. మిషన్ భగీరథ వంటి పథకాలు కేవలం కాంట్రాక్టర్ల కోసమే అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సరైన జీతాలు ఇవ్వటంలేదన్నారు.

పాత అరిగిపోయిన రికార్డ్ :బీజేపీ నేత కిషన్ రెడ్డి



సభలో గవర్నర్ ప్రసంగం పాత అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా ఉందని బీజేపీ పక్షనేత కిషన్ రెడ్డి అన్నారు. రైతుల ఆత్మహత్యలు , సచివాలయం మార్పువంటి అంశాలు లేనేలేవన్నారు. 53మంది పోలీసుల మద్యన గవర్నర్ ప్రసంగం నడిచిందన్నారు. ఎమ్మెల్యే లక్ష్మణ్ మాట్లాడతూ గవర్నర్ ప్రసంగం తొలిపేజినుంచి చివరిపేజీ దాక అన్ని అపద్దాలే అన్నారు. మూడు ఎకరాల భూమి ఎంతమందికి ఇచ్చిందో చెప్పలేదన్నారు. తమకు సభపై గౌరవం ఉన్నందునే సభను బహిస్కరించామన్నారు.

బసీలను బిచ్చగాళ్లను చేశారు: ఆర్ కృష్ణయ్య



రాష్ట్రంలో టీఆర్‌ప్రభుత్వం బీసీలను బిచ్చగాళ్లుగా మార్చిందని టీడీపీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య అన్నారు. గవర్నర్ ప్రసంగంలో బీసీల సక్షేమం ప్రస్తవన లేదన్నారు. ఉద్యోగాల భర్తీ ఊసే లేదన్నారు. కొత్త పథకాల ప్రస్తవన కూడ లేదన్నారు.

పాత కౌన్సెల్ భవనంలోనే
తెలంగాణ కౌన్సెల్ సమావేశాలు

సర్క్యూలర్ జారీ చేసిన అసెంబ్లీ కార్యదర్శి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనమండలి సమావేశాలు మంగళవారం నుంచి జూబ్లిహాల్‌లోని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి భవన్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర విభజన అనంతరం శాసనమండలి భవనం ఆంధ్ర ప్రదేశ్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. దీంతో తెలంగాణ శాసనమండలిని జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభను విజయవాడకు తరలించడంతో గత బడ్జెట్ సమావేశాల నుంచి అమరావతిలోనే కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నందున పబ్లిక్ గార్డెన్‌లోని భవన్‌ను తెలంగాణకు ఇచ్చేందుకు ఎపి ప్రభుత్వం సమ్మతించింది ఈ మేరకు శాసనసభ కార్యదర్శి నర్సింహాచారి సర్క్యూలర్‌ను జారీ చేశారు.

ర్యాలీగా సభకు సండ్ర



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశంపార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య ఎన్‌టిఆర్ ఘాట్‌లో దివంగత ఎన్‌టి రామారావుకు నివాళులర్పించి అక్కడి నుంచి శాసనసభకు వచ్చారు. తెలంగాణ అధ్యక్షుడు ఎల్ .రమణ, ఆ పార్టీ ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్ బాబు, నగర పార్టీ అధ్యక్షుడు ఎంఎన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సారంగపాణి ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు.

అసెంబ్లీలో ఆగ్రహావేశాలు...

బహిష్కరణే?



(మొదటిపేజీ తరువాయి)

సంఘటనలో కోమటిరెడ్డి, మరో ఇద్దరు ఎమ్మెల్యేలను ఈ సమావేశాల వరకు సస్పెండ్ చేయాలా లేక ఏడాది పాటు సభ నుంచి బహిష్కరించాలా అనే అంశంపై ప్రభుత్వం మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. ఘటన తీవ్రంగా ఉండడంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేల శాసన సభ్యత్వా లను రద్దుచేసే అవకాశం కూడా లేకపోలేదని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ శాసనసభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శాసనమండలి అధ్యక్షుడు స్వామిగౌడ్‌పై విసిరిన హెడ్‌ఫోన్ తగిలి ఆయన కుడికంటికి గాయమైన సంగతి తెలిసిందే. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం సరోజిని కంటి ఆసుపత్రికి తరలించారు. స్వామిగౌడ్‌పై జరిగిన దాడి వీడియో ఫుటేజీలను పరిశీలించిన అధికారులు బాధ్యుడైన కోమటిరెడ్డితో పాటు మరో ఇరువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు వేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ శాసనసభల్లో ఈ తరహా సంఘటనలు జరిగిన సమయంలో అక్కడి ప్రభుత్వాలు సదరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఏ తరహా చర్యలు తీసుకున్నారో వాటిని అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా హెడ్‌ఫోన్ విసిరి స్వామిగౌడ్ కంటిని గాయపరిచిన ఘటనలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయనకు సహకరించిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెట్టి, అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌లపై కూడా వేటు వేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్టు తెలుస్తోంది. ఈ మేరకు శాసనసభాధిపతి మధుసూదనాచారి, కార్యదర్శి నర్సింహాచారి, శాసనసభ వ్యవహారాల మంత్రి తన్నీరు హరీష్‌రావు తదితరులు న్యాయ సలహా కూడా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డితో పాటు మిగిలిన ఎమ్మెల్యేలపై ఏడాదిపాటు అసెంబ్లీ నుంచి బహిష్కరించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై మంగళవారం ఉదయం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే మంత్రి హరీష్‌రావు కోమటిరెడ్డితో పాటు ఇతర ఎమ్మెల్యేల సస్పెన్షన్ తీర్మానాన్ని స్పీకర్ మధుసూదనాచారి అనుమతితో ప్రవేశపెడతారని వెంటనే వారిని సభనుంచి బయటకు పంపించేలా మార్షల్స్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యినట్టు చెబుతున్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రసంగిస్తున్న గవర్నర్‌పై ఇఎస్ఎల్ నరసింహన్‌ను లక్ష్యంగా చేసుకుని కోమటిరెడ్డి ఆయనపై హెడ్‌ఫోన్ విసిరారని అది గురితప్పి మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలిందని దీంతో కుడికంటికి గాయమైందని తెరాస ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆ పార్టీ ఆరోపిస్తుండగా, బడ్జెట్ సమావేశాల నుంచి బహిష్కరణకు గురికావాలన్న కాంగ్రెస్ లక్ష్యంగా కనిపిస్తోందని మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.

సభలో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియో చిత్రాలను సీఎం కేసీఆర్‌తో పాటు స్పీకర్ మధుసూదనాచారి, కార్యదర్శి నర్సింహాచారి పరిశీలించారని సమాచారం. కోమటిరెడ్డి హెడ్‌ఫోన్ అత్యంత వేగంగా విసరడంవల్ల స్వామిగౌడ్ కంటికి గాయమైందని వారు నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ముందస్తుగా, పథకం ప్రకారమే కాంగ్రెస్ పార్టీ శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా గొడవ సృష్టించి తద్వారా రాజకీయ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించిందని అధికారపక్షం తెరాస ఆరోపిస్తోంది. అయితే రైతుల సమస్యలపై శాసనసభలో తమ నిరసన వ్యక్తంచేశామని కాంగ్రెస్ పార్టీ మొదట్లోనే చెప్పిందని అందుకు అనుగుణంగా రైతుల సమస్యలపై గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో తాము ప్లకార్డులు ప్రదర్శించామని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి గతంలో తెదేపా శాసనసభ్యుడిగా అసెంబ్లీలో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితపై నిరాధారమైన ఆరోపణలు చేశారని అందుకు బాధ్యత వహిస్తూ ఆయనపై శాసనసభ సమావేశాలకు కొనసాగినంతకాలం సభకు రాకుండా చూడాలని మంత్రి హరీష్‌రావు తీర్మానం ప్రవేశపెట్టగా అందుకు స్పీకర్ ఆమోదించిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఏడాదిపాటు కోమటిరెడ్డితో పాటు మరో ఇరువురు ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. శాసనసభలో తాను వ్యవహరించిన తీరును కోమటిరెడ్డి సమర్ధించుకున్నారు. తాను గవర్నర్ నరసింహన్‌ను లక్ష్యంగా చేసుకుని హెడ్‌ఫోన్ విసిరితే పొరపాటున చైర్మన్‌కు తగిలిందని చెప్పారు. అయితే ప్రభుత్వం రైతులను నాలుగేళ్ళయినా పట్టించుకోకపోవడంతో తాను సంయమనం కోల్పోయానన్నారు.

తొలిరోజే రచ్చరచ్చ

శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలిరోజే రచ్చరచ్చయ్యింది. కాంగ్రెస్ సభ్యుల నిరసనతో సభ దద్దరిల్లింది. అసెంబ్లీలో వీరాంగంచేసిన కాంగ్రెస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రులు డిమాండ్ చేశారు. అయితే నిరసన తెలిపే హక్కు సభ్యులకు ఉందని సభలో జరిగిన ఘటనకు సీఎం కేసీఆర్ పూర్తి బాధ్యత వహించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రసంగం ప్రతులను చింపి గాలిలోకి విసిరేశారు. ఈసమయంలోనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విసిరిన హెడ్‌ఫోన్ గవర్నర్ వెనక ఉన్న గాంధీ ఫోటోకు తగిలి కిందనున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలింది. ఈ సందర్భంగా ఆయన కంటికి గాయమైంది. ప్రసంగం ముగిసి గవర్నర్ వెళ్ళిన వెంటనే సీఎం కేసీఆర్ సూచన మేరకు స్వామిగౌడ్‌ను సరోజిని కంటి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ప్రాథమిక చికిత్స జరిపిన అనంతరం ఆయనను ఇన్‌పేషంట్‌గా చేర్చారు. అంతకు ముందు శాసనసభ ఆవరణలోని డిస్పెన్సరీలో స్వామిగౌడ్‌కు వైద్యులు ప్రాథమిక చికిత్స జరిపారు. కంటి భాగంలో దెబ్బ తగలడంతో గాయానికి కట్టుకట్టి ప్రాథమిక చికిత్స జరిపించారు. మంగళవారం కూడా ఆయన ఆసుపత్రిలోనే ఉంటారని వైద్యుల పరిశీలనలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని సరోజినిదేవి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్ తెలిపారు.

దాడి ఎలా జరిగిందంటే..

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మార్షల్స్ , కాంగ్రెస్ సభ్యులకు మధ్య తోపులాట జరిగింది. పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. గవర్నర్ ప్రసంగిస్తున్నంత సేపు కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూనే ఉన్నారు. రైతులకు మద్దతు ధర, రైతుల ఆత్మహత్యల గురించి గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించలేదని నినాదాలతో సభను హోరెత్తించారు. ఉభయ సభల సభ్యులు తోడు కావడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఒకరి వెనుక ఒకరు కాగితాలు చింపి గవర్నర్ పైకి విసిరారు. అవి గవర్నర్ పై పడకుండా శాసనసభ సెక్యూరిటీ అధికారులు తంటాలు పడ్డారు. చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయితే,ఏకంగా భద్రతకు ఉపయోగించే బ్రీఫ్‌కేస్‌ను కాగితాలు పడేవైపు పెట్టి గవర్నర్‌పై పడకుండా అడ్డుకున్నారు. మార్షల్స్ పెద్ద సంఖ్యలో ఉండడంతో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వెళ్లకుండా నిలువరించగలిగారు. వారి నిరసనలను అప్పుడప్పుడు గమనిస్తూనే గవర్నర్ తన ప్రసంగం చేశారు. తొలుత కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్,రామ్మోహన్ రెడ్డి తదితరులు గవర్నర్ ప్రసంగ ప్రతిని చింపి గవర్నర్ పైకి విసిరారు. ఆ తర్వాత ప్రతిపక్ష నాయకుడు కె జానారెడ్డి, సీనియర్ సభ్యుడు కేప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి తప్ప మిగతా అందరు సభ్యులు ప్రసంగ ప్రతులను విసిరారు. ఆ తర్వాత ఇతర సభ్యులు కూడా అదే పని చేశారు. మహిళా సభ్యులు డాక్టర్ జె గీతారెడ్డి , డీకే అరుణ, పద్మావతి, ఆకుల లలిత సైతం వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా మహిళా మార్షల్స్ అడ్డుకున్నారు. వారు కూడా ప్రసంగం ప్రతులను చింపి గవర్నర్‌పైకి విసిరారు. సీనియర్ సభ్యురాలు, సాధారణంగా ఇలాంటి చర్యలకు దూరంగా ఉండే గీతారెడ్డి కూడా ప్రతులు చింపి గవర్నర్‌పైకి విసరడం విశేషం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అయితే, ఏకంగా బెంచ్ పైకి ఎక్కి మరీ కాగితాలు విసిరారు. ఒకవైపు కాంగ్రెస్ నిరసనలు ,మరోవైపు టీఆర్ఎస్ సభ్యుల చప్పట్ల మధ్య గవర్నర్ ప్రసంగం చేశారు. కాంగ్రెస్ సభ్యుల నిరసనలు, అరుపుల మధ్య వెల్‌లోకి దూసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు హెడ్‌మైక్‌లను విరిచి గవర్నర్‌పైకి విసిరారు. ఈ మైక్ నేరుగా స్వామిగౌడ్ కుడి కంటికి తగిలింది. సభ కొనసాగుతున్నందున ఆయన గాయంతోనే సభలో ఓపికగా కూర్చున్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత కాంగ్రెస్ సభ్యులు బయటకు వెళ్లారు. సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ సభ్యులు హెడ్ మైక్ విసరడంతో తనకు గాయమైన విషయం సభా వ్యవహారాల మంత్రి టీ హరీష్‌రావు దృష్టికి స్వామిగౌడ్ తెచ్చారు. స్వామిగౌడ్‌కు గాయమైన విషయం తెలియటంతో ఒక్క సారిగా కలకలం రేగింది. కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డే స్వామిగౌడ్‌పై హెడ్‌ఫోన్ విసిరినట్లు గుర్తించారు. గవర్నర్ ప్రసంగం మధ్యలోనే బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. గవర్నర్ నరసింహన్ ప్రసంగం అబద్ధాల పుట్టగా తిట్టుకుంటూ వారు బయటకు వెళ్లారు. టీడీపీ సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, ఆర్ కృష్ణయ్య గవర్నర్ ప్రసంగాన్ని ఓపికగా విన్నారు. అదే విధంగా సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య కూడా ప్రసంగం మధ్యలో ఎలాంటి కామెంట్స్ చేయలేదు. ఎంఐఎం సభ్యులు మైనారిటీ అంశాన్ని గూర్చి గవర్నర్ ప్రస్తావించిన సందర్భంగా చప్పట్లు కొట్టారు.



సీసీ ఫుటేజీ బయటపెట్టాలి

విలేకరుల సమావేశంలో సీఎల్‌పిఉపనేత కోమటిరెడ్డి

నల్గొండ (టౌన్), ప్రభన్యూస్ : తెలంగాణ శాసనసభ సమావేశాల్లో జరిగిన ఘర్షణ దురదృష్టకరం. స్వామిగౌడ్‌కు దెబ్బతగిలినట్లు సీసీ ఫుటేజీలు బయటపెట్టాలి. దెబ్బ తగిలినట్లు చూపిస్తే క్షమాపణ చెప్పి అసెంబ్లీలో అడుగుపెట్టనని సీఎల్‌పిఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ పట్టణంలో సెంటర్ లైటింగ్‌ను ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ చేసిన ప్రసంగం రైతులు, పేద ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని, తాను 20 సంవత్సరాల నుంచి చూస్తున్న ఇంత చెత్త ప్రసంగం ఎప్పుడూ లేదన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో సంక్షేమ పథకాలు అమలు చేసే విషయాలు ప్రసంగంలో లేదని, ముఖ్యమంత్రికి ఉపయోగపడే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ సంబంధించిన విషయాలే ప్రసంగంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోడీ మద్దతు ధర కల్పించడం లేదని స్వయాన కేసీఆర్ మోడీని గాడు గీడు అని తిట్టడం జరిగిందన్నారు. అయితే రైతులకు మద్దతు ధర కల్పిం చాలని, సమస్యల కోసం అసెంబ్లీ పోడియంవద్దకు వెళ్ళి నిరసన తెలిపే హక్కు తమ కుందన్నారు.

చిన్నారిని క్లాస్‌లో పెట్టి
తాళం వేశారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొమరం భీం జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కాగజ్‌నగర్‌లోని న్యూ కేరళ స్కూల్‌లో ఐదేళ్ల యూకేజీ చదువుతున్న చిన్నారి విశాల్‌ను క్లాస్‌రూమ్‌లో ఒంటరిగా వదిలి తాళాలు వేసుకు వెళ్లిపోయారు. తమ చిన్నారి ఎంతకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. విశాల్ ఆచూకీ కోసం ఐదు గంటలపాటు వెతుకులాట ప్రారంభించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో స్కూల్ తాళాలు తీసి చూస్తే అక్కడే ఉన్నాడు. దీంతో స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇంత జరిగినా సదరు స్కూల్ యాజమాన్యం ఘటనపై స్పందించకపోవడం పట్ల ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

లైంగిక వేధింపులపై గాయని ఆవేదన

ఆవేదన వ్యక్తం చేసిన యువ గాయని చిన్మయి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ గాయని చిన్మయి తాజాగా చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులపై వరుసగా ట్వీట్లు చేశారు. అలాగే తనపై జరిగిన వేధింపుల పట్ల కూడా అందులో ప్రస్తావించారు. తాను ఇటీవల ఓ కార్యక్రమానికి వెళ్లానని అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తూ తనను లైంగికంగా తాకాడని ఆమె అన్నారు. చాలా మంది మహిళలు, పురుషులు చిన్నతనంలో ఇలాగే లైంగిక వేదింపులు ఎదుర్కొన్నవారేనని తెలియడంతో తాను షాకయ్యానని అన్నారు. చిన్నారులు తమ ఉపాధ్యాయులు, అంకుల్స్, చివరకు మహిళల చేతిలో కూడా వేధింపులు ఎదుర్కొన్నవారు ఉన్నారని ఆమె ట్వీట్ చేశారు. సమాజంలో బస్సులు, రైళ్లతో పాటు ఆధ్యాత్మిక స్థలాల్లో, ఇళ్లలో, విద్యాలయాల్లోనూ లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆమె అన్నారు. తాము ఎదుర్కొన్న లైంగిక వేధింపుల గురించి తమ కుటుంబసభ్యులు, స్నేహితులకు చెప్పడానికి చాలామంది చిన్నారులకు ధైర్యం చాలదని అన్నారు. తాము చెప్పినా నమ్మరేమోనని వారు అనుకుంటారని చెప్పారు.

అలాగే బాల్యంలో తమపై జరిగిన లైంగిక దాడి గురించి పురుషులు చెబితే వారిని హేళన చేస్తారని, మరోవైపు మహిళలు చెబితే వాటిని ఎంజాయ్ చేస్తారని ఆమె అన్నారు. లైంగిక వేధింపుల గురించి తల్లిదండ్రులకు చెబితే బయటకు వెళ్లొద్దని, చదువు, ఉద్యోగం మానిపిస్తారని కొందరు చెప్పుబోరని ఆమె అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కొద్దిగా మార్పు వచ్చినట్లు కనపడుతోందని ఆమె తెలిపారు.

పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక
టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

జైనూర్, ప్రభన్యూస్: ఆసిఫాబాద్ కుమ్రంభీం జిల్లా, జైనూర్ మండలంలోని జామ్ని గ్రామానికి చెందిన కెంద్రె సత్యభామ(15)అనే 10వ తరగతి విద్యార్థిని సోమవారం తన ఇంట్లో తిమ్మిటి తిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సత్యభామ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటుంది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణురాలు అయితానోలేదో అని దిగులు చెందేదని సోమవారం పాఠశాలలో వార్సికోత్సవ కార్యక్రమం ఉండగా వెళ్తానని ఇంట్లో చెప్పడంతో ఇంట్లో ఎవరులేరని వెళ్లావద్దని చెప్పడంతో మనస్తాపనికి గురై ఆత్మహత్య చేసుకుందని తండ్రి బాలజీ ఫిర్యాదు చేసిన్నట్లు సిఐ సాధిక్‌పాషా తెలిపారు.

బాసర ఘటన
హంతకుడి ఫొటో విడుదల




బాసర, ప్రభన్యూస్: నిర్మల్ జిల్లా, బాసర మండల కేంద్రంలో ఈనెల 7వ తేదీ బుధవారం రోజున రైల్వేస్టేషన్ వద్ద గల స్టార్ ఇన్ హోటల్ యజమాని రితేష్, ఆయన తండ్రి గోపీనాథ్‌లను గుర్తుతెలియని దుండగులు అతి కిరాతకంగా హత్యచేసి పారిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించి ముథోల్ సీఐ రఘుపతి ఆధ్వర్యంలో ముమ్మర దర్యాప్తును చేపట్టారు. ఈ జంట హత్యల్లో ప్రధాన నిందితుడైన నేపాల్ దేశానికి చెందిన బండారి ప్రకాష్(28) అనే నిందితుని ఫొటోను ముథోల్ పోలీసులు సామాజిక మాధ్యమమైన ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. బండారి ప్రకాష్‌తో పాటు మరో ముగ్గురి స్నేహితుల ఫొటోలను సైతం పోస్టు చేశారు. ఎక్కడైనా కనబడితే ముథోల్ సర్కిల్ పోలీసులకు 9440795022, 9440795076, 9440900639 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

బాలాజీ ఆరోగ్యవర ప్రసాదిని పథకానికి
రూ. కోటి విరాళం

తిరుమల, ప్రభన్యూస్: బెంగుళూరుకు చెందిన జి.ప్రసాద్‌నారాయణ శ్రీ బాలాజి ఆరోగ్యవరప్రసాదిని పథకానికి కోటి రూపాయలను విరాళంగా అందించారు. ఈ విరాళాన్న తిరుమలలోని జేఈవో క్యాంపు కార్యాలయంలో సోమవారం తిరుమల జేఈవో శ్రీనివాసరాజుకు చెక్కు రూపంలో అందచేశారు. దాతకు టీటీడీ అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్ధ ప్రసాదాలను అందచేశారు.

ప్రజాసమస్యలపై చర్చ జరగాలి

భాజపా శాసనసభా పక్ష నేత కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బడ్జెట్ సమావేశాలు అత్యంత కీలకమైనవని...అందువల్ల ప్రజా సమస్యలపై అర్ధవంతంగా, సమగ్రంగా చర్చ జరగాలని భాజపా శాసనసభా పక్ష నాయకుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు స్పీకర్ తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనల ప్రకారం బడ్జెట్ సమావేశాలు కనీసం నలభై రోజుల పాటు నిర్వహించిన సంప్రదాయాన్ని తెరాస ప్రభుత్వ కాలరాస్తూ....సమావేశాలను 12 రోజులకు కుదించిందని ఆయన మండిపడ్డారు.సోమవారం అసెంబ్లీలోని మీడియా సమావేశం హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాసనమండలిలో పార్టీ నాయకుడు రాంచందర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. గత బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం 29 పేజీలు ఉండగా...ప్రస్తుతం18 పేజీలకు కుదించారన్నారు. అంటే తెరాస హయంలో రాష్ట్రం తిరోగమ దిశగా కొనసాగుతున్నట్లుగా కనిపిస్తోందన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని ఎందుకు తగ్గించారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగ పూర్తి పాఠాన్ని విన్నా.... రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చూసిన తరువాత తెరాస ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నట్లుగా కనిపిస్తోందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణం, దళితుడు మూడు ఎకరాల భూమి పంపిణీ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ఏం చేయాలనుకుంటే విషయంపై గవర్నర్ ప్రసంగంలో ఎలాంటి విధానపరమైన ప్రకటన రాలేదన్నారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని....సిఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న మెదక్ జిల్లా...గజ్వేల్ నియోజకవర్గంలోనే అధిక సంఖ్యలో నమోదు అవుతున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ రైతులను ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందన్న విషయంపై కూడా గవర్నర్ ప్రసంగంలో ఎటువంటి స్పష్టత లేదన్నారు. లక్షా ఇరవై ఐదు వేల ఉద్యోగల భర్తీనీ 2014 నుంచి చెబుతూ వస్తున్నా...ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాల భర్తీ చేశారో ప్రభుత్వం ఇప్పటి వరకు సభకు సరైన సమాచారం ఇవ్వలేదన్నారు.

కాంగ్రెస్, తెరాస....దొందు దొందే!


కాంగ్రెస్, తెరాసలు దొందు దొందేనని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ రోజు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రవర్తన....లోక్‌సభలో తెరాస అనుసరిస్తున్న తీరు ఒకటే విధంగా ఉన్నాయని అన్నారు. లోక్‌సభలో లేని సమస్యను తెరాస సృష్టించి సభ జరగకుండా అడ్డుకుంటోందని ఆయన మండిపడ్డారు. రిజర్వేషన్ల చట్టంపై మోదీ ప్రభుత్వం ఎలాంటి, మార్పులు చేయకపోయినప్పటికీ తెరాస సభను అడ్డుకోవడం తగదన్నారు. వారు ఏ ప్రాతిపదికన సభను అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు.

అసెంబ్లీలో వ్యూహంపై
బీజేపీ కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బడ్జెట్ అసెంబ్లీ సమావేశంలో తెరాస ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసేందుకుగానూ కమ లనాధులు సోమవారం హిమా యత్‌నగర్‌లోని ఒక హోటల్‌లో సమా వేశ మ య్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, శాసనసభా పక్ష నాయకుడు జి. కిషన్‌రెడ్డి, శాసనమండలి పక్ష నా యకులు రాంచందర్‌రావు, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ ప్రభాకర్, రాజాసింగ్ తదితరులు హాజరయ్యారని సమాచారం.సమావేశాలను కేవలం పన్నెండు రోజులకు మాత్రమే కుదిం చడంతో ప్రజలు ఎదుర్కొన్న పలు సమస్యలు...రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై గట్టిగా నిలదీయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేంద్రంపై ఇటీవల కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు....మోదీ ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసేందుకు సాగుతున్న కుట్రలను దృష్టిలో పెట్టుకుని కమలనాథులు సభలో రెండు, మూడు రకాలను అనుసరించాలని నిర్ణయించారు.


ఏపీలో పెద్దలు ఏకగ్రీవం

● టీడీపీ నుంచి సీఎం రమేష్, కనకమేడల రవీంద్ర ● వైకాపా నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ: రాజ్యసభకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎంపిక కావడంతో ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రం నుంచి మూడు సీట్లకు టీడీపీ నుంచి సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్, వైకాపా నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డమ్మీగా ఆయన సతీమణి ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయడంతో అభ్యర్థుల ఏకగ్రీవ ఎంపిక లాంఛనం కానుంది. నామినేషన్ల ఘట్టం చివరిరోజు సోమవారం టీడీపీ అభ్యర్థులుగా సీఎం రమేష్, కనకమేడల రవీంద్ర కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. మంత్రులు, శాసన సభ్యులు, కుటుంబసభ్యులు, సన్నిహితులతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకముందు వీరుభయులూ సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేయడంతోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన సీఎం రమేష్, కె.రవీంద్రకుమార్‌లు మీడియాకు తెలిపారు. వైకాపా అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గతంలోనే నామినేషన్ దాఖలు చేయడం జరి గింది. ఆయనకు డమ్మీగా సతీ మణి ప్రశాంత్‌రెడ్డి నామి నేషన్ దాఖలు చేశారు. టీడీపీ తరపున ఇద్ద రు అభ్యర్థులు మా త్రమే నామి నేషన్ దాఖలు చేయ డంతో వైకాపా నుంచి డమ్మీగా నా మినేషన్ దాఖ లు చేసిన ప్రశాం త్‌రెడ్డి నామినేషన్ ఉప సంహ రించుకుంటే ప్రభాకర్ రెడ్డితోపాటు మిగిలిన టీడీపీ అభ్యర్థుల ఎంపిక కూడా ఏక గ్రీవం కానుంది. కాగా ప్రభాకర్‌రెడ్డి సుమారు 18 కోట్ల స్థిర, చరాస్థులతోపాటు అప్పుల వివరాలను అఫిడవిట్లో వెల్లడించారు.

నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల్లో టీడీపీ అభ్యర్థి సీఎం రమేష్ అత్యధికంగా తన ఆస్తిని సుమారు 218 కోట్లుగా చూపించారు. సతీమణి శ్రీదేవితోపాటు కుమారులు రుత్విక్, రుత్విన్‌ల పేర్లతో ఉన్న స్థిర, చరాస్థులు, భనాలు, నగదు, రుణాలు తదితర వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే మరో అభ్యర్థి కనకమేడల రవీంద్ర కుమార్ సుమారు



40 లక్షల ఆస్థులతో పాటు స్థలాలు, భూమి, భవనాలు తదితరాలున్నట్లు పేర్కొన్నారు. వీరి నామినేషన్లకు మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర తదితర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయ కులు అభినందించారు. రాజ్యసభ నామినేషన్ల తుదిఘట్టం రోజున అసెంబ్లీ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

అక్రమ నిర్మాణాలు ఆపండి!




హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణలోని వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వక్ఫ్ వ్యవహారాల పైన సోమవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మాదాపూర్‌లోని గుట్టలబేగంపేటలో ఉన్న 91 ఎకరాలు వక్ఫ్ భూములని గుర్తించడం జరిగిందన్నారు. ఈ భూముల వ్యవహారం న్యాయ స్థానం పరిధిలో ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు కబ్జాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వక్ఫ్ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకొనవలసి ఉందన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్, ప్రభుత్వ సలహాదారు ఏ.కె. ఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సలీమ్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి దానకిశోర్‌తో పాటుగా మాదాపూర్ డీసీపీ, సీఐ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గంటల్లోనే రోడ్ అండర్ బ్రిడ్జి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే రోడ్ అండర్ బ్రిడ్జిని నిర్మించి దక్షిణ మధ్య రైల్వే అధికారులు రికార్డు సృష్టించారు. సికింద్రాబాద్ - నిజామాబాద్ మార్గంలోని శ్రీనివాసనగర్ - మాసాయిపేట మధ్యలో ఈ రోడ్ అండర్ బ్రిడ్జిని నిర్మించారు. ఈ నెల 9వ తేదీన ఈ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో పేర్కొంది. శ్రీనివాసనగర్ - మాసాయిపేట మధ్యన కొద్దిపాటి ఎత్తులో సబ్ వే నిర్మించాల్సిన అత్యవసర ప్రాధాన్యతను మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి రైల్వే అధికారుల దృష్టికి తెచ్చారు. బ్రిడ్జి నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.1.69 కోట్లను రైల్వే ఖాతాలో జమ చేయడం జరిగింది. హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు బ్రిడ్జి నిర్మాణ ప్రణాళికను రూపొందించారు. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే బ్రిడ్జి నిర్మాణం జరిగే విధంగా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక ప్రజల సహకారం, నిర్దిష్ట ప్రణాళిక మేరకు బ్రిడ్జి నిర్మాణాలను నాలుగు గంటల వ్యవధిలోనే పూర్తి చేయడం జరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే ఇంజనీరింగ్ అధికారులను జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అభినందించారు.

భగీరథలో ప్రపంచస్థాయి ప్రమాణాలు



హైదరాబాద్,ఆంధప్రభ: భగీరథ పథకంలో ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా నీటిశుద్ధి జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం తన కార్యాలయంలో నీటినాణ్యత, పర్యవేక్షణలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నాణ్యతను పరీక్షించటంలో కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్‌లదే కీలక పాత్ర అన్నారు. రాష్ట్రంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఆస్తులను జియోటాగింగ్ చేయాలని ఆదేశించారు. ఆర్వో నీటి వినియోగం, ప్లాంట్ల నియంత్రణకు సలహాలు ఇవ్వాలని కోరారు. తాగునీరు కలుషితం కావడంతో గతంలో హైదరాబాద్‌తో సహా ఇతర ప్రాంతాల్లో కొన్ని విషాద సంఘటనలు జరిగాయన్నారు. అటువంటి వాటికి మిషన్ భగీరథ ద్వారా అడ్డుకట్ట వేయాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయం అన్నారు .ప్రతి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోనూ అత్యాధునిక సదుపాయాలతో నీటి నాణ్యతను పరీక్షించే కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ల్యాబ్‌లతో సమన్వయం చేసుకుని పనిచేయాని సూచిం చారు . గ్రామ స్థాయిలో వాటర్ , శానిటేషన్ కమిటీలకు శిక్షణ ఇచ్చి వారిద్వారా భ గీ రథ నీటిఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించేకార్యక్రమాలు చేప డ తా మ న్నారు. వ్యాధులు లేని తెలంగాణ రాష్ట్రంగా నిలపాలన్నదే భగీరథ లక్ష్యంఅని ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్ , సీఈలు కృపాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


16 నుంచి 18 వరకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్,ఆంధప్రభ : ప్రయాణికుల రద్దీ పెరగడంతో సికింద్రాబాద్ - నర్సాపూర్, హైదరాబాద్ - కాకినాడ టౌన్ మధ్యన ప్రత్యేక రైళ్లను నడిపిం చబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ - నర్సాపూర్ ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ఈ నెల 16న 20.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.45 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్‌లో 18వ తేదీ 21.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 08.25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లను పాలకొల్లు, భీమవరం, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్లగొండ స్టేషన్‌లో నిలుపుదల చేయడం జరుగుతుంది. హైద రాబాద్ - కాకినాడ ప్రత్యేక రైలు హైదరాబాద్‌లో 16వ తేదీన 18.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. తిరు గు ప్రయాణంలో 18వ తేదీన 18.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మ రుసటి రోజు ఉదయం 06.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

ఢిల్లీలో వైస్సార్సీపీ ఆవిర్భావ వేడుకలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం న్యూఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సీపీ ఎంపీలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాద్, మిథున్ రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, జగన్ పోరాటపటిమ కలిగిన నేత అని అభివర్ణించారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఇబ్బందులు పెట్టినా, నమ్మిన సిద్ధాంత కోసం ముందుకు సాగుతున్నారని చెప్పారు. వైఎస్సార్ లాగే జగన్ మాటకు కట్టుబడి ఉండే నాయకుడని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించండి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఏపీ వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్పీఎస్) డిమాండ్ చేసింది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలంటూ ఆదివారం ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన వీఆర్పీఎస్ సభ్యులు, నాయకులు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్‌లో న్యాయ విజ్ఞాపన దీక్ష చేశారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేరుస్తూ గతేడాది డిసెంబర్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని వీఆర్పీఎస్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ గుర్తు చేశారు. శాసనసభలో తీర్మానం చేయడంతోనే తమ పని అయిపోయిందని భావించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని ఒప్పించే బాధ్యత చంద్రబాబు నాయుడిదని ఆయన అన్నారు.

● భావితరాలకు దిశానిర్దేశం

పటిష్టంగా జనసేన


● రేపు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా: పవన్ కల్యాణ్



అమరావతి, ఆంధ్రప్రభ: భవిష్యత్ భావితరాలకు దిశా నిర్దేశం చేసేలా జనసేన పార్టీని ప్రత్యేక కార్యాచరణతో మరింత పటిష్టం చేస్తున్నామని ఆ పార్టీ అధినేత, ప్రముఖ సినీ హీరో పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ మం డలం కాజా వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న సాహితీ వెంచర్‌లోని రెండెకరాల విశాల విస్తీర్ణంలో సొంతింటి నిర్మాణానికి ఆయన తన భార్య అన్నాపవన్ కల్యాణ్, కమార్తెతో కలిసి సోమవారం ఉదయం భూమి పూజ చేశారు. భవిష్యత్‌లో దీనిని పార్టీ కార్యా లయంగా కూడా వాడుకునే అవకాశం ఉందంటు న్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో కొద్దిసేపు మాట్లాడారు. 14న జరిగే పార్టీ ఆవిర్భావ సభ వేదిక సాక్షిగా పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పారు. ఆరోజు పార్టీ వైఖర్ని తేటతెల్లం చేస్తామని ప్రకటించారు. అంతా ఆతృతతో ఎదురుచూస్తున్న అనేక ప్రశ్నలకు ఆ రోజు పూర్తి క్లారిటీ దొరుకుతుందన్నారు. పార్టీకి ఉడుకు రక్తం ఎంత అవసరమో అంతేరీతిలో అనుభవజ్ఞులైన రాజకీయ నేతలు కూడా అవసరమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జనసేనలోకి కొత్తవాళ్లు వచ్చినా పాత వాళ్లకు ప్రాధాన్యం తగ్గదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన అస్సాం గణపరిషత్ ఉద్యమాన్ని ఉదహరించారు. ఆనాడు అస్సాం గణపరిషత్ ఆధ్వర్యంలో ఉవ్వెత్తున కెరటంలా విద్యార్థులు ఉద్యమాన్ని లేవదీశారని, కానీ ఆ తర్వాత పరిస్థితి చల్లబడిందన్నారు. దీనికి కారణం సీనియర్ నాయకత్వం కొరవడడమేనని అన్నారు. అలాగే జనసేన పార్టీలో యువతతోపాటు సీనియర్లకి కూడా మంచి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. అయితే మూస పద్దతిలో మాత్రం రాజకీయాలు ఉండవని స్పష్టం చేశారు.సరికొత్త పంథాలో పార్టీ పోకడ ఉంటుందన్నారు.అందుకే ఎంతో జాగ్రత్తగా పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇద్దరు ఇతర పార్టీల నుంచి జనసేనలోకి వచ్చినంత మాత్రాన జనసేన వలసవాదుల పార్టీ అని ముద్రవేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించి, 40వేల మందిని పార్టీలో పనిచేసేందుకు ఎంపిక చేశామని, అందులో మొదటి విడతగా 12 మందిని అధికార ప్రతినిధులుగా నియమించబోతున్నామని ప్రకటించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, ఇతర అంశాల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై 14న జరిగే పార్టీ ఆవిర్భావ సభలోనే పూర్తి క్లారిటీ ఇస్తానని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఎటువంటి న్యాయం చేయాలో, పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో తనకు పూర్తి స్పష్టత ఉందని, అయితే ఇప్పుడే ఆ విషయాన్ని వెల్లడించలేనని, అది ప్రజాసభా వేదిక సాక్షిగా ప్రజల సమక్షంలోనే వెల్లడిస్తే గౌరవంగా ఉంటుందని, అందుకే మీడియా ప్రతినిధులు అడిగిన ఏ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నానని వివరణ ఇచ్చారు. తాను ప్రజలకు సంబంధించి ఏ విషయాన్ని దాచుకోలేను..అంతేకాదు సమస్యల నుంచి కూడా పారిపోను..ఎప్పుడు ఏమి మాట్లాడాలో తనకు స్పష్టత ఉందని తేల్చి చెప్పారు. తనకు వ్యక్తిగతంగా ఎవరితోను ఎటువంటి శతృత్వం లేదు.. సాధ్యమైనంత వరకు అందరితోను సయోధ్యతోనే వెళతానని అన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోలేని పక్షంలో తన స్పందన చాలా బలంగా ఉంటుందన్న సంగతి తెలిసిందేనని అన్నారు. తాను ఏ పిలుపు నిచ్చినా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి, జయప్రదం చేశారు..వారి సంక్షేమం కోసం జీవితకాలం సావాసం చేస్తానని స్పష్టం చేశారు. ఉగాది నుంచి పార్టీ కార్యకలాపాలు మరింతగా ఊపందుకుంటాయని స్పష్టంచేశారు. ప్రతి విషయంలోను చాలా జాగ్రత్తగా ముందుకెళుతున్నానని అన్నారు.

ఢిల్లీలో పోరాటం ఉధృతం చేయండి

● తెదేపా ఎంపీలకు ఏపీ సీఎం దిశానిర్దేశం



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రయోజనాలు, హక్కుల అంశంలో రాజీపడే ప్రసక్తే లేదని వీటి సాధన కోసం చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్లమెంట్ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల మనోభావాలకనుగుణంగా పోరాటం కొనసాగించాలని సభ నుంచి సస్పెండ్ చేసినా వెనుకడుగు వేయొద్దని సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి పార్లమెంట్ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని అంశాలు, ఆనాడు పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర సమస్యల పరిష్కారమే మన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరగిన అన్యాయంపై ఉభయసభల్లో ప్రస్తావించాలని కేంద్ర మాజీ మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలకు ఆయన సూచించారు. రాజీనామాలపై ప్రకటన చేస్తున్న సమయంలోనే రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి నాలుగేళ్లైనా పునర్‌వ్యవస్థీకరణ చట్టం అమలు కాలేదన్న అంశం ప్రధానంగా ప్రస్తావించాలని చెప్పారు. అదే విధంగా ఆనాడు రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నెరవేరలేదన్న విషయాన్ని కూడా బహిర్గతం చేయాలన్నారు. నిన్నటి దాకా స్పెషల్ అసిస్టెన్స్ మేషర్ అన్న కేంద్రం ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ అంటూ అంటుందని రోజుకొక రీతిన వ్యవహరిస్తున్న కేంద్రం తీరును ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. నిధుల మంజూరుకు సులభ మార్గాలు ఉంటే ఇతర మార్గాలు ఎందుకు అంటూ కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజు నుంచే పార్లమెంటును స్థంభింపజేస్తున్న ఫలితం కానరాకపోవడంతో కేంద్రం నుంచి వైదొలిగామన్నారు. మంత్రి పదవులకు సైతం రాజీనామా చేసి ఆందోళనలను మరింత ఉధృతంగా చేసినా కేంద్రం తగిన రీతిలో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం దిగి వచ్చే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం మినహా మరే ఇతర ప్రత్యామ్నాయం ఎంపీలకు చంద్రబాబు సూచించారు.

బడి ఎగ్గొడితే ఫెయిల్ అవుతారు

ఎంపీ జేసీపై సీఎం చంద్రబాబు సెటైర్

అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంటు సమావేశాలకు హాజరుకాకుండా తనను కలవడానికి వచ్చిన ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం చంద్రబాబు సెటైర్ వేశారు. బడి ఎగ్గొడితే ఫెయిల్ అవుతారని వ్యాఖ్యానించడంతో అసెంబ్లీ లాబీలో నవ్వులు విరిశాయి. అనంతరం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పటివరకు ఫెయిల్ అయిన సందర్భం లేదన్నారు. బడి ఎగ్గొట్టి, బ్యాక్ బెంచ్‌లో కూర్చున్నవారు అనేక మంది ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. తనకు రాజ్యసభకు వెళ్లే ఆలోచనే లేదని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు దివాకర్ రెడ్డి బదులిచ్చారు.

తెరపైకి ‘సెంటిమెంట్’ రగడ

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మరోసారి కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. రాష్ట్రం పై వివక్షను ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి మరోసారి ట్విట్టర్‌వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో ఆయన ప్రసంగించారు. ఆ సందర్భంగా ఘాటుగా చేసిన వ్యాఖ్యలలో కొన్నింటిని ముఖ్యమంత్రి ట్విట్టర్‌లో పేర్కొనడం విశేషం. ఏ.పి కి హోదా విషయంలో చట్టబద్దంగా తాము కోరుతున్న వాటిని కూడా నిర్ద్వందంగా కేంద్రం తోసిపుచ్చుతోందనే అర్థం వచ్చే రీతిలో ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించడం భవిష్యత్‌లో అనుసరించబోయే కార్యాచరణకు అద్దం పడుతోందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు చంద్రబాబునాయుడు తాజా ట్వీట్‌లు ఆసక్తి రేపుతుండగా, మరోవైపు రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారాయి. కేంద్రం నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా ఏ మాత్రం చలనం రాకపోవడంతో , మిత్రపక్షంగా వుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ట్వీట్‌లు మాధ్యమాల్లో చర్చనీయాంశంగా పరిణమించాయి. నేరుగానే చంద్రబాబు బిజెపికి ప్రశ్నలు సంధించడంతో , త్వరలోనే ఎన్డీయే నుంచి కూడా తప్పుకుంటారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని రాజకీయవర్గాలు అంటున్నాయి. ప్రతిపక్ష పార్టీ నేత అయిన జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా కేంద్రాన్ని విమర్శించకపోవడాన్ని కూడా సి.ఎం ప్రస్తావించారు.




ఎంతకాలం హోదా డ్రామా!

గుంటూరు , ప్రభన్యూస్ బ్యూరో: ప్రత్యేక హోదాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంకా డ్రామాలు ఆడుతున్నారని ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం గుంటూరు జిల్లాలోని బాపట్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదాపై మాటిచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక దానిని విస్మరించారని విమర్శించారు. ప్రత్యేక హోదాకు 14వ ఆర్దిక సంఘానికి సంబంధం ఏమిటని, కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ రెండు సంవత్సరాల క్రితం అర్ధరాత్రి హోదా రాదని, ప్యాకేజ్ ఇస్తామని చెప్పినపుడు ఎలా స్వాగతించారని విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు విలువలు, విశ్వసనీయత అవసరమని, చంద్రబాబుకు ఇవి లేవని ఆరోపించారు. ఈ నెల 21వ తేదీన వైసీపీ పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు కోరుతుంటే ఇంకా బీజేపీతో కలసి ఉన్నామనే ధోరణితో టీడీపీ వ్యవహరించడం ఊసరవెల్లి రాజకీయాలని మండిపడ్డారు. రాష్ట్రం తరపున ఉన్న 25 మంది ఎంపీలు ఏకతాటిపైకి వచ్చి అవిశ్వాస తీర్మానం పెడితే దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందని, అప్పటికి కేంద్రం దిగి రాకపోతే ఏప్రిల్ 6న మూకుమ్మడి రాజీనామాలను లోక్‌సభ స్పీకర్‌కు అందజేస్తే కేంద్రం తప్పకుండా దిగి వస్తుందన్నారు. తాజా బడ్జెట్‌లో మిగులు బడ్జెట్‌ను రూ.5,000 కోట్లు చూపిస్తుంటే రాష్ట్ర సహకారానికి కేంద్రం ఎలా ముందుకు వస్తుందన్నారు.

తుదివరకు కాంగ్రెస్‌లోనే ఉంటా!

● ఆరోగ్యం బాగాలేకనే

ధర్నాల్లో పాల్గొనలేకపోతున్నా




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రాణం పోయే వరకూ లెజెండ్ వంటి కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ఆ పార్టీ మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లోనే పుట్టి పెరిగానని, ఆ పార్టీలోనే తుదిశ్వాస విడుస్తానని చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, వైఎస్సార్సీపీతో పోటీగా ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ధర్నాలు, ఆందోళనలు చేస్తూనే ఉంది.

గురువారం ఆ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఆంధ్ర ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ, బీజేపీ పార్టీల గుర్తింపును రద్దు చేయాలంటూ శుక్రవారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ కార్యక్రమాలన్నిటిలో ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, సుబ్బిరామిరెడ్డి, మాజీ ఎంపీ జేడీ శీలం, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు తదితర నేతలు పాల్గొన్నారు. అధికార పక్షానికి ధీటుగా తమ గళం వినిపించారు. అయితే ఈ బృందంలో ఎక్కడా మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి కనిపించకపోవడంతో రకరకాల ఊహాగానాలు తెర మీదికి వచ్చాయి. వాటిపై కాసు కృష్ణారెడ్డి స్పందించారు. ధర్నా, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనడానికి పది రోజుల కిందటే తాను ఢిల్లీ వచ్చానని ఆంధ్రప్రభకు ప్రత్యేకంగా వివరించారు. అయితే ఆరోగ్యం బాగా లేకపోవడం వల్ల ఎయిమ్స్‌లో చేరానని ఆయన అన్నారు. వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్స చేశారని, ప్రస్తుతం తాను ఆరోగ్యంగానే ఉన్నానని చెప్పారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణలో

ప్రశ్నించే హక్కును కోల్పోయాం

టీజేఏసీ చైర్మన్ కోదండరాం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రశ్నించే హక్కును కోల్పోయామని టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ టీజేఏసీలో చేరుతున్న సందర్భంగా సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ సొంత కోసం, స్వార్థం కోసం రాజకీయాలను ఉపయోగించుకోవద్దన్నారు. ఏ ప్రభుత్వమైనా అధికారాన్ని దుర్వినియోగం చేయవద్దని, దీనివల్ల సమాజంపై ప్రభావం పడుతుందన్నారు. సమష్టి కృషిని సమష్టి ప్రయోజనాలకే వాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో మార్పు అవసరమన్నారు. మనిషికి గుండెకాయి ఎంత ముఖ్యమో సమాజానికి రాజకీయాలు అంత ముఖ్యమన్నారు. రాజకీయాల్లోకి నేను వస్తానని ఎప్పుడు అను కోలేదని ప్రస్తుతం ఆ అవసరం ఏర్పడిందన్నారు. సామాజిక మార్పునకు సంబంధించి మార్గాన్ని నిర్ణయించేది రాజకీయమని, అలాంటి రాజకీయాలపై స్పష్టత లేనప్పుడు రాజకీయాల్లో రాణించలేరన్నారు. ప్రస్తుతం తాము చేసే ఉద్యమానికి రాజకీయ పార్టీ కూడా తోడైతే మరింత ముందుకు వెళ్లవచ్చని జేఏసీ సభ్యులు కోరడంతో వారి కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏ ఒక్కరి పోరాటం వలన రాష్ట్రం ఏర్పడలేదని, అందరూ పోరాడితేనే ఈ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రస్తుత టీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల గౌరవానికి భంగం కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ సచివాలయానికి రారు, ఒకవేళ ఆయన్ను కలవాలని ప్రగతిభవన్‌కు వెళితే ఆయన ధర్మదర్శనం దొరకడం లేదని ఇలాంటి పాలన ఏ రాష్ట్రంలో లేదని ఆయన విమర్శించారు. ఎలాంటి లాభాపేక్ష పదవులు ఆశించకుండా సామాజిక తెలంగాణ కోసం అందరూ కృషి చేయా లన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని అవలంభిస్తుందని ఈ విధానాన్ని ఎండగట్టాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. కోదండరాం పెట్టే పార్టీ టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయమన్నారు. దిలీప్ తో పాటు మరికొందరు టీజేఏసీలో చేరారు.

పట్టుపరిశ్రమ నిధుల వ్యయంపై కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పట్టు పరిశ్రమ శాఖ నిధులను ఖర్చు చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.ఆ శాఖ కమిషనర్ అధ్యక్షతన గల ఈ కమిటీలో వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్, సెంట్రల్ సిల్క్‌బోర్డ్ జాయింట్ డైరెక్టర్, ఆర్థికశాఖ డిప్యూటీ డైరెక్టర్‌లు సభ్యులుగా ఉన్నారు.శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సోమవారం జీవో విడుదల చేశారు.

యువత త్యాగాలను స్మరిస్తూ జనసేన గీతం

అమరావతి, ఆంధ్రప్రభ : స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి యువత చేస్తున్న త్యాగాలను, బలిదానాలను స్ఫురించుకుంటూ వారికి నివాళులు అర్పిస్తూ జనసేన పార్టీ ప్రత్యేక గీతాన్ని రూపొందించింది. ఈ గీతాన్ని పార్టీ సోషల్ మీడియా ద్వారా ఇక్కడ విడుదల చేసినట్లు జనసేన పార్టీ మీడియా అధినేత హరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


ప్రభుత్వాల వైఖరిపై నిరసన

ఆదివాసీల సమ్మేళన సమాఖ్యలో నిర్ణయం



హైదరాబాద్, ప్రభన్యూస్: భారత జాతీయ ఆదివాసుల సమ్మేళన సమాఖ్య (ఐసీఐటీపీ) జాతీయ కార్యవర్గ సమావేశం సమాఖ్య ముఖ్య అధ్యక్షురాలు డాక్టర్ ఉషారాణి మింజ్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో దేశం నలుమూలల నుంచి అన్ని రాష్ట్రాలకు చెందిన జోనల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. దక్షిణ భారత విభాగమైన సౌత్, ఈస్ట్ జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడప భోంజు నాయుడు, మీనక సింహాచలం, కోశాధికారి కొమరం లక్ష్మణరావు (తెలంగాణ) హాజరయ్యారు. ఈ సమావేశంలో 2018-2020 సంవత్సరాని సంబంధించిన జాతీయ, రాష్ట్ర కమిటీలు ఏర్పాటు గురించి చర్చించారు. దేశంలో ఆదివాసి ప్రజలపై నేటి పాలక ప్రభుత్వాలు అనుసరించే వ్యతిరేక విధానాలపై చర్చించారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదివాసులపై వ్యవహరిస్తున్న విధానాలైన గిరిజనేతర కులాలైన బోయ-వాల్మీకులు, కైత లంబాడీల వంటి అభివృద్ధి చెందిన బీసీ తెగకు చెందిన లక్షలాది మందిని గిరిజన తెగల జాబితాలో కలుపుటకు జరుగుతున్న కుట్రలు ఎత్తి చూపుతూ.. శాసన సభల ద్వారా భారత ప్రభుత్వానికి పంపిన సిఫార్సులను తిరస్కరించాలని సమాఖ్య ద్వారా కోరడం జరిగింది. సోమవారం జరిగిన తెలుగు రాష్ట్రాల ఆదివాసి ప్రతినిధులు ఆదివాసుల జాతీయ కమిషన్‌కు వెళ్లి వైస్ చైర్మన్ అనసూయ ఉయ్యేను కలిసి బోయ-వాల్మీకులను ఆదివాసీలలో కలపకూడదని వివరణతో తెలిపారు. అలాగే లంబాడీలను ఆదివాసుల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ.. ఆదివాసీ వికాస పరిషత్, ఐసీఐటీపీ సంఘాల ద్వారా వినతి పత్రాలు సమర్పించారు. వైస్ చైర్మన్ అనసూయ స్పందిస్తూ.. మీ రాష్ట్రానికి త్వరలో కమిషన్ వస్తుందని, మీ ఆందోళనలపై రిపోర్టు తయారు చేయిస్తామని చెప్పారు.

'బలరామ్'కు మద్దతు సమీకరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరికే బలరాం విజయం కోసం వివిధ రాజకీయ పార్టీల మద్దతు తీసుకుంటామని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీడీపీ, సీపీఐ, బీఎస్పీ, వైఎస్సార్ కాంగ్రెస్, సీపీఎం పార్టీల మద్దతు కోరుతామని ఉత్తమ్ చెప్పారు. సోమవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్‌లో చేరినా టెక్నికల్‌గా 20 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని తెలపారు. రాజ్యసభ ఎన్నిక ఉన్నందున కాంగ్రెస్ పార్టీ సభ్యులకు విప్ జారీ చేయనున్నట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. టీడీపీ, సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్, సీపీఐ పార్టీతో పాటు బీఎస్పీల మద్దతు కోరుతామన్నారు. ఇదిలా ఉంటే టీడీపీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, బీఎస్పీకి నుంచి విజయం గెలిచిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సీపీఐకి చెందిన ఏకైక ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధికార టీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లారు. ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు టీఆర్‌ఎస్‌లో చేరినప్పటికి.. అసెంబ్లీ నిబంధనల ప్రకారం టీఆర్‌ఎస్ సభ్యులు కారని ఆయన వివరించారు.

తెదేపాతోనే బలహీన వర్గాల అభివృద్ధి



కనగల్, ప్రభన్యూస్ : టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ ఆరోపించారు. పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. మొదటగా దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొనుగోడు గ్రామం వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రప్రజలకు జరిగిన మేలేమీ లేదన్నారు. రూ. 68 వేలకోట్ల అప్పుల నుంచి 2 లక్షల 30 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. టీడీపీని రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని ప్రజలను కోరారు. రామారావు హయాంలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందన్నారు. కాగా నల్గొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాదగోని శ్రీనివాసగౌడ్ కురంపల్లి, జి.యడవెల్లి, బుడుమర్లపల్లిలో జెండాలను ఎగురవేసి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.డి యూసుఫ్, జిల్లా పరిశీలకులు సతీష్, ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు సిలువేరు కాశీనాద్, కడారి అంజయ్య, బాబూరావు నాయక్, బంటు వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

'పరిపాలన'లో రాజకీయలొద్దు



నిర్మల్, ప్రభ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకే జిల్లా సమీకృత భవనాలు పట్టణంలోని నడిబొడ్డున పాత భవనాల వద్దనే నిర్మించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. సోమవారం మొదట పట్టణ శివారులోని జిల్లా సమీకృత కార్యాలయాల కోసం కేటాయించిన కొచ్చెరువును ఆయన సందర్శించారు. అనంతరం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ తీరుపై ఆయన దుయ్యబట్టారు. మొదట బీమన్న గుట్ట వద్ద భవనాలను నిర్మించేందుకు యత్నించగా తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు అడ్డుకోవడంతో విరమించుకుని ఆ పిదప మంత్రి స్వగ్రామమైన ఎల్లపల్లి గ్రామ సమీపంలో కొచ్చెరువులో సమీకృత భవనాలను నిర్మించేందుకు పనులు చేపట్టిందని పేర్కొన్నారు. వెంటనే పనులు నిలిపివేసి పట్టణ ప్రజలకు, జిల్లా ప్రజలకు అనువైన పాత భవనాల వద్దనే సమీకృత భవనాలను నిర్మించాలని బీజేపీ పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. డబుల్‌బెడ్‌రూం అని చెప్పి ఇప్పటి వరకు రాష్ట్రంలో అర్హులైన ప్రజలకు ఏ ఒక్క చోట కూడా ఎంపిక చేయలేదని, కొన్ని చోట్ల వారికి కావల్సిన వారిని మాత్రమే ఎంపిక చేసి పంపిణీ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు డబుల్‌బెడ్‌రూం పనులు ఐదు శాతం కూడా పనులు పూర్తి కాలేదని ప్రభుత్వ తీరుపై ఆయన ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర వాటికి మళ్లించి అభివృద్ధి నిరోధకులుగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం మారిందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, కేంద్ర ప్రభుత్వ విత్తన సంస్థ పాలక మండలి సభ్యులు అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కృష్ణ, గోదావరి జలాల కన్వీనర్ రావుల రాంనాథ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సామా రాజేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రావణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఒడిసెల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నాయిడి మురళి, ఆడెపు సుధాకర్ తదితరులు ఉన్నారు.





టీఆర్ఎస్ నుంచి నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న లింగయ్య, ఆర్‌బి ప్రసాద్ ముదిరాజ్, చిత్రంలో మంత్రులు



కాంగ్రెస్ నుంచి బలరాం నాయక్, తదితరులు

సంతోష్ నామినేషన్

- మూడు టీఆర్ఎస్
- ఒకటి కాంగ్రెస్, మరొకటి ఇండిపెండెంట్
- నేడు పరిశీలన
- బరిలో నలుగురు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు గాను ఐదుగురు వ్యక్తులు నామినేషన్లు వేశారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. సోమవారానికి నామినేషన్ల గడువు ముగిసే సమయానికి అధికార టీఆర్‌ఎస్ పార్టీ నుంచి జోగినపల్లి సంతోష్‌రావు , బడుగుల లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్‌లు నామినేషన్లు వేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ నామినేషన్ వేయగా శ్రమజీవి పార్టీకి చెందిన జాజుల భాస్కర్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభకు పోటి చేసే అభ్యర్థికి దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు ప్రతిపాధించాల్సి ఉంటుంది, అయితే స్వతంత్ర అభ్యర్థికి ఒక ఎమ్మెల్యే కూడా ప్రతిపాదిస్త సంతకం చేయకపోవడం గమనార్హం. దీంతో ఆయన నామినేషన్ స్క్రూట్నిలో పోనుంది. ఇక మూడు స్థానాలకు గాను నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశం ఉండటంతో రాజ్యసభ ఎన్నికలు నిర్వహించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడనుంది. ముగ్గురు సభ్యులే ఉంటే ఏకగ్రీవం అయ్యేదిజ

కాగా టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు రాజ్యసభకు నామినేషన్ వేసే ముందు గన్‌పార్కు వద్ద తెలంగాణ అమర వీరుల స్థూపానికి నివాళులు అర్పించారు.

ఈ నామినేషన్ కార్యక్రమానికి టీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కేడర్ భారీగా తరలి వచ్చారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించా రు. టీఆర్‌ఎస్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి మం త్రులు హరీశ్‌రావు, జోగు రామన్న, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ రెండు సెట్ల నామినేషన్లు వేయగా కాంగ్రెస్ పార్టీ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, గీతారెడ్డి, డీకే అరుణతో పాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ విజయం కోసం విపక్షాల మద్దతును కూడ గట్టాలని ఆ పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

ఇద్దరు బీసీలకు రాజ్యసభ సీట్లను కేటాయించిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావకు 12 బీసీ సంఘాలు దన్యవాదాలు తెలిపాయి. తెలంగాణకు వచ్చిన మూడు రాజ్యసభ సీట్లలో రెండు సీట్లు బీసీలకు ఇచ్చిన బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ఇతర బీసీ సంఘాల నాయకులు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, గొరిగే మల్లేష్ యాదవ్, సి రాజేందర్ తదితరులు సీఎం కేసీఆర్‌కు దన్యవాదాలు తెలిపారు. బీసీల్లో అతిసాధారణమైన పేద కుటుంబాల నుండి వచ్చిన బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాష్ ముదిరాజ్‌లకు అవకాశం కల్పించడం అభినందనీయమని వారు సోమవారం ప్రకటనలో హర్షం ప్రకటించారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం లోక్‌సభలో పోరాటం చేయాలని ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

స్వామినాథన్ సిఫారుసులకు మేమే శ్రీకారం

- దేశానికే ఆదర్శంగా నాలుగు విప్లవాలు
- రైతు సమన్వయ వ్యవస్థ దేశానికే మార్గదర్శకం
- టీఆర్ఎస్ఎస్ చైర్మన్‌గా గుత్తా సుఖేందర్ రెడ్డి బాధ్యతల స్వీకారోత్సవంలో మంత్రి కే. తారకరామారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్థిక సమస్యలకు దూరంగా అన్నదాతలు మనుగడ సాధించాలంటే ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తప్పనిసరిగా అమలు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. ఆ ఆలోచనతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే ప్రప్రథమంగా రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేశారని తెలిపారు. అన్నటి కేంద్ర ప్రభుత్వం ఏ లక్ష్యంతో కమిషన్‌ను ఏర్పాటు చేసిందో అవన్నీ నేడు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి (టీఆర్ఎస్ఎస్) చైర్మన్‌గా ఇటీవల నియమితులైన నల్గొండ పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం బషీర్‌బాగ్‌లోని వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, దేవాదాయ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జలవనరుల మంత్రి హరీష్‌రావు, వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, సాగునీటి రంగం



అభివృద్ధి, భూ సంస్కరణలు, వ్యవసాయ రుణాలు,పంటల భీమా, ఆహార భద్రత, ఉపాధి అవకాశాలు, అన్నింటికీ మించి కనీస మద్దతు ధరల అమలుపై ప్రొఫెసర్ స్వామినాథన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులతో కూడిన నివేదిక సమర్పించారని అన్నారు. దాదాపు పదిహేనేళ్ళ క్రితం నాటి ఈ వ్యవహారాన్ని గత ప్రభుత్వాలు మరిచిపోతే, తెలంగాణ ప్రభుత్వం గుర్తించి అమలుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఆ సాఫారసుల్లో ఉన్న అంశాలన్నింటినీ రాష్ట్రంలో అమలు చేస్తున్నామని, సమీప భవిష్యత్తులో దేశానికే ఆదర్శంగా నిలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రైతు పండివంచిన ప్రతి పంటకు కనీస మద్దతు ధరలు అమలు చేయాలటన్న ఉద్దేశంతోనే సమన్వయ సమితుల వ్యవస్థను నెలకొల్పామన్నారు. ఎకరాకు రూ.8వేల పెట్టుబడి మద్ధతు, సకాలంలో అందుబాటులో విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు తదితర కార్య క్రమాలన్నీ ఈ వ్యవస్థ ద్వారానే అమలు జరుగుతుందని పేర్కొన్నారు.

లక్ష్య సాధనకు నాలుగు విప్లవాలు

వ్యవసాయ రంగాభివృద్ధిలో ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు నాలుగు విప్లవాలను మొదలు పెట్టామన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు హరిత విప్లవం, 46వేల చెరువులను పునరుద్ధరించి ఆయకట్టును స్థిరీకరించేందుకు నీటివిప్లవం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు సబ్సిడీ గొర్రెల పంపిణీ, ఉచిత చేపపిల్లల పంపిణీతో విదేశాలకు మాంసం ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో గులాబీ విప్లవం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రధానమైన పాడి పరిశ్రమాభివృద్ధి ద్వారా రైతలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చేందుకు క్షీర విప్లవాన్ని ఆవిష్కరించామని కేటీఆర్ అన్నారు.

తెలంగాణ రైతు దేశానికే మార్గదర్శకం : గుత్తా

తెలంగాణ రైతు దేశానికే మార్గదర్శకం కావాలన్న లక్ష్యంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధిస్తానని ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గ్రామ, మండల, జిల్లా సమన్వయ సమితులన్నింటినీ కలుపుకుని వ్యవసాయ అనుబంధ రంగాల అధికార యంత్రాంగంతో ముందడుగు వేస్తానని తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో సీఎం కేసీఆర్ అప్పగించిన విశిష్ట బాధ్యతను నెరవేరుస్తానని అన్నారు. దేశంలోనే తొలిసారిగా రైతులను సంఘటితం చేస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మన రాష్ట్ర నుంచే దేశ వ్యాప్తంగా రైతు వ్యవస్థ బాగుపడాలన్నదే ప్రధానమైన ఉద్దేశమని చెప్పారు.

కుమార్తె కోసం జైట్లీ మౌనం

పిఎన్‌బి స్కాంపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ న్యాయవాది అయిన తన కుమార్తెను కాపాడుకునేందుకే పిఎన్‌బి కుంభకోణంపై మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆమె కార్యాలయంలో సోదాలు ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ట్వీట్ చేశారు. పిఎన్‌బి కుంభకోణంపై మన ఆర్థిక మంత్రి మౌనం వహించడం వెనుక కారణం ప్రస్తుతం బయటపడిందని రాహుల్ అన్నారు. తన కుమార్తెను కాపాడుకోవడానికే ఆయన మిన్నకుండిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. కుంభకోణం బహిర్గతం కావడానికి కేవలం నెల రోజుల ముందు నిందితుల్లో ఒకరి నుంచి వకీలు భత్యం కింద ఆమెకు భారీ మొత్తం ముట్టిందని తెలిపారు. నిందితుడికి చెందిన ఇతర న్యాయవాదుల కార్యాలయాలపై దాడులు జరిపిన సిబిఐ ఆమె కార్యాలయంపై ఎందుకు దాడులు జరపలేదని రాహుల్ నిలదీశారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చుందుగాను మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల వద్ద మహాదర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ మహాధర్నాలకు అన్ని రాజకీయ పార్టీల నేతలు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బంద్‌కు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నేతలకు కృష్ణ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే మంగళవారం నిర్వహించే బంద్‌ను వాయిదా వేసినట్లు తెలిపారు. ఏ ఒక్క విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి నష్టం జరుగొద్దనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దళితులు, గిరిజనులకు అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీలు అంటే కరివేపాకులా తీసేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి 18 మంది రాజ్యసభ సభ్యుల్లో ఒక్కరూ కూడా ఎస్సీ, ఎస్టీలు లేకపోవడం శోచనీయమన్నారు. రిజర్వేషన్లు లేకుంటే మన స్థానమెంటో వివిధ పార్టీల్లోని ఎస్సీ, ఎస్టీ వర్గాల నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ నుంచి ఇద్దరు బీసీలైన బడుగుల లింగయ్యయాదవ్, ప్రకాశ్‌లకు అవకాశం ఇవ్వడం సంతోషకరమన్నారు.

'ఆదా' బాటలోనే రైల్వే జోన్?

- జోన్‌పై అన్ని ప్రతికూల నివేదికలే..
- దీనిపై రాజకీయ నిర్ణయం తీసుకుంటే తప్ప సాధ్యం కాదు
- కేంద్ర హోంశాఖ అధికారుల ప్రస్తావన
- ఆంధ్ర, తెలంగాణ ఉన్నతాధికారులతో కీలక సమావేశం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదాకు పట్టిన గతే రైల్వే జోన్‌కు పట్టనుందా? కనీసం జోన్ కూడా ఏర్పాటు చేసే అవకాశం లేదా? ప్రస్తుతం కేంద్ర హోంశాఖ అధికారుల వ్యాఖ్యలు చూస్తుంటే ఇవే అనుమానాలు కల్గుతున్నాయి. అవి కేవలం తమ వ్యక్తిగత వ్యాఖ్యలే అయినప్పటికీ, ప్రత్యేకహోదా, విభజన హామీల కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుడి నుంచి చట్ట సభల సభ్యుల వరకు ఉద్యమిస్తున్న సమయంలో హోంశాఖ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో విభజన సమస్యలపై రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం జరిగింది. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న హోంశాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ అంశాలపై చర్చ జరిగింది. నిజానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కారణంగా పలు మార్లు వాయిదా పడుతూ చివరకు సోమవారం ప్రధాన కార్యదర్శి లేకుండానే జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఆదిత్యనాథ్ దాస్, ఏపీ భవన్ అధికారులు హాజరవగా, తెలంగాణ ప్రభుత్వం తరపున ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్, అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి హాజరయ్యారు. ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న షెడ్యూల్ 9, 10 సంస్థల ఆస్తుల విభజనపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆస్తుల పంపకానికి సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విభజన చట్టంలోని అన్ని సంస్థలకు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డిమాండ్ చేసింది. షెడ్యూల్ 9, 10లో సంస్థల ఆస్తుల పంపకాలు లేదా విభజనను జనాభా ప్రాతిపదికన 58:42 నిష్పత్తిలో పంచాలని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోంది.

షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనతో పాటు షెడ్యూల్ 13లో పేర్కొన్న అంశాలకు తోడు చట్టంలోనే పొందుపరిచిన గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు గురించి కూడా ఆంధ్రప్రదేశ్ అధికారులు సమావేశంలో ప్రస్తావించారు. ఈ రెండు సంస్థలకు సంబంధించి స్థలం ఎంపిక పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడమే మిగిలిందని ఏపీ అధికారులు కేంద్రానికి తెలిపారు. తదుపరి సమావేశంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జరుగుతుందని సమావేశం అనంతరం ఏపీ చీఫ్‌సెక్రటరీ దినేశ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలోనే ప్రత్యేక రైల్వే జోన్ గురించి కూడా ఏపీ అధికారులు ప్రస్తావించారు. అయితే ఇది తమ పరిధిలో లేని విషయమని, దానిపై చర్చించాల్సిన అవసరం లేదని హోంశాఖ అధికారులు వెల్లడించారు.

హోంశాఖ అధికారులు తమ వ్యక్తిగత స్థాయిలో చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. ప్రత్యేక హోదా అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రే స్వయంగా సాధ్యం కాదని కుండబద్ధలు కొట్టినట్టు చెప్పగా, ఇప్పుడు హోంశాఖ అధికారుల వ్యాఖ్యలు కలకలం రేపాయి. ప్రత్యేక జోన్ విషయంలోనూ కేంద్రం హోదా తరహాలోనే వ్యవహరిస్తుందా అన్న సందేహాలు వెలువడుతున్నాయి. కేవలం సాధ్యాసాధ్యాలు పరిశీలించాల్సిందిగా మాత్రమే విభజన చట్టం పేర్కొంటోంది. దీనిపై ఎప్పుడు ప్రశ్నించినా పొరుగున్న ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉందని, ఏకాభిప్రాయం సాధించిన వెంటనే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర పెద్దలు ప్రకటించారు. కచ్చితంగా ఇచ్చి తీరుతామని ఎప్పుడూ ప్రకటన చేయలేదు.


ఏపీలో 11వ పీఆర్‌సీ ఏర్పాటు

బకాయిల చెల్లింపులకు ఓకే : బాబు

అమరావతి, ఆంధ్రప్రభ: గత కొంతకాలంగా పెండింగ్‌లో పడుతూ వస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీకి సంబంధించి ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. 11వ పే రివిజన్ కమిషన్ వేసేందుకు సంసిద్దతను వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు మంగళవారానికి వాయిదా పడిన అనంతరం ఎపీఎన్జీవో ప్రతినిధుల బృందం అధ్యక్షుడు అశోక్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో భేటీ కావడం జరిగింది. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించగా, సీ.ఎం సానుకూలంగా స్పందించారు.అదే విధంగా 10వ పే కమిషన్ బకాయిలు కూడా చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఆర్థిక శాఖపై చర్చించి సత్వరమే ఒక నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉద్యోగుల పట్ల తమకు ఎప్పుడూ సానుకూల దృక్పథమే వుందని చెప్పారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని,పెండింగ్‌లో వున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కూడా ఏపీ ఎన్జీవో సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.

స్పీకర్‌పై అవిశ్వాసం..!

- కాంగ్రెస్, బీజేపీల చర్చ
- తెదేపా మద్దతు కోరాలని ప్రతిపాదన
- ఈ సమావేశాల్లోనే నోటీసిచ్చే అవకాశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభ స్పీకర్ సిరికొండ మదుసూధనాచారిపై అవిశ్వాసం పెట్టేందుకు విపక్షాలు యోచిస్తున్నాయి. స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వారెవరైనా నిస్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉన్నప్పటికీ అలా వ్యవహరించడం లేదని కొంత కాలంగా విపక్షాలు ఆరోపిస్తున్నాయి. శాసనసభలో అధ్యక్షస్థానంలో ఉన్న వారెవరైనా సభ్యులందరి హక్కులు, గౌరవాన్ని కాపాడాల్సి ఉందని విపక్షాలు వాపోతున్నాయి.

సభ్యులకు రక్షణ, గౌరవం కల్పించా ల్సిన స్పీకర్ పట్టించుకోక పోవడంపై విప క్షాలు కొంత కాలంగా అసహనంతో ఉన్నా యి. 2014 శాసనసభ ఎన్నికల అనంతరం పార్టీ పిరాయింపు లపై కాంగ్రెస్, టిడిపిలు పలు పర్యాయాలు స్పీకర్ మదు సూధనాచారికి ఫిర్యాదులు చేశాయి. దీనిపై స్పీకర్ తూ.తూ. మంత్రంగా విచారణ జరిపినట్లు చేశారు తప్ప ఎలాంటి క్రియాసీలక నిర్ణయం తీసుకోలేదని విపక్షాలు ఆరోపిస్తున్నా యి. పైగా పిరాయింపులకు పాల్పడ్డ ఎంఎల్‌ఎలకు అధికా రపక్షంలో కూర్చునే సభలో మాట్లాడేందుకు అవకాశం కల్పి ంచడం, కొన్ని సందర్భాలలో పార్టీ పిరాయింపులకు పాల్పడ్డ ఎంఎల్‌ఎలను అధికార టిఆర్‌ఎస్ సభ్యులుగా ప్రకటించడంపై అనేక సందర్భాలలో కాంగ్రెస్, టిడిపిలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇప్పటికే టిడిపికి చెందిన 12 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు, వైసీపికి చెందిన ముగ్గురు ఎంఎల్‌ఎలు అధికార టిఆర్‌ఎస్‌లోకి పిరాయించారు. ఎంఎల్‌ఎలు పార్టీ పిరాయింపులకు పాల్పడ్డ ప్రతీసారి టిడిపి, కాంగ్రెస్ పార్టీలు వారిపై చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రాలిచ్చారు. స్పీకర్ నిర్ణయం వెలువరించడంలో జరుగుతున్న జాప్యంపై కోర్టును కూడా ఆశ్రయించారు. కోర్టులు కూడా స్పీకర్‌కు చర్యలపై ఆదేశాలిచ్చినా అమలు చేసిన దాఖలాలు లేకపోవడంపై పార్టీలు గుర్రుగా ఉన్నాయి.

మరో పక్క అధికార టిఆర్‌ఎస్ పార్టీ వత్తిళ్ళకు తలొగ్గిన కొంత మంది అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని, నిబంధనల ను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు ఎంఎల్‌ఎలు చేసిన ఫిర్యాదులపై కూడా స్పీకర్ చర్యలు తీసుకోవడం లేద న్న ఆరోపణలను కూడా విపక్షాలు గుర్తు చేసుకుంటున్నాయి.

మరో వైపు శాసనసభను తప్పుదారి పట్టించే విధంగా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మాట్లాడిన వైనంపై బిజెపి రెండు పర్యాయాలు స్పీకర్‌కు సభా ఉల్లంఘన నిబంధనల కింద ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని నేతలంటున్నారు. నిజాం చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తా మని ఎప్పుడూ చెప్పలేదంటూ సిఎం కెసిఆర్ సభలో సభ్యుల ను దబాయించి మాట్లాడారని, మరోసారి సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, గొల్ల కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ఖజానాపై భారమైనా భరించి గొర్రెలను పంపిణీ చేస్తున్నామంటూ కెసిఆర్ సభకు చెప్పిన సందర్బంలో బిజెవిల్‌పి నేత కిషన్‌రెడ్డి కేంద్రం ఇస్తున్న నిధులపై ప్రస్తావించారు. ఈ సందర్బంగా సిఎం మాట్లాడుతూ, సబ్సిడీ గొర్రెల పథకంలో ఏకాన (ఆరు పైసలు) కూడా లేవని తేల్చి చెప్పారు. ఈ రెండు అంశాలపై బిజెపి సభ్యులు సిఎంపై హక్కుల ఉల్లంఘన నోటీసులిచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై అవిశ్వాసం పెట్టాలని భావిస్తున్నాయి.

● ఆరో రోజు సభ వాయిదా

పార్లమెంట్‌లో ప్రతిష్టంభన



● గందరగోళం మధ్య ఆర్థిక నేరగాళ్ల బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వం ● బ్యాంకు కుంభకోణాలపై చర్చ ఏ నిబంధన కింద అన్న అంశంపై పీటముడి ● మెట్టుదిగని అధికార, విపక్షాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విపక్షాలు, మిత్ర పక్షాల ఆందోళనలతో వరుసగా ఆరోరోజు పార్ల మెంటు సమావేశాలు తుడిచిపెట్టుకు పోయా యి. వివిధ అంశాలపై జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎంపీలు నినాదాలతో హోరెత్తించడంతో పార్ల మెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. సోమవారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిఆర్ఎస్ టిడిపి ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలి పాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్ఎస్, ఏపీ విభజన చట్టం హామీలు అమలు చేయాలని టీడీపీ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోకపోవడంతో సభను తొలుత మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్ శుక్లా పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల బిల్లును గందరగోళం మధ్యే ప్రవే పెట్టారు. అయితే దీనిపై బీజేడీ ఎంపీ భర్త హరి హెమతాబ్ దీనిని వ్యతిరేకించారు. నేరం రుజువు కాకముందే ఆస్తులను జప్తు చేయడమంటే రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. అయితే ఈ అభ్యంతరాలన్నీ చర్చ సందర్భంగా లేవనెత్తాలని మంత్రి శుక్లా సూచించారు. అనం తరం స్పీకర్ సుమిత్రా మహాజన్ లోక్‌సభను మంగ ళవారానికి వాయిదా వేశారు. ఇటు రాజ్యసభ లోనూ విపక్షాలు ఆందోళన హోరెత్తించాయి. సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిఆర్ ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. మరోవైపు, సభను సజావుగా నడిపించేందుకు సహకరిం చాలని రాజ్యసభ చైర్మన్ పదే పదే వెంకయ్య నాయుడు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సభ్యులు తమ స్థానాలకు వెళ్లాలని, ప్లకార్డులు ప్రదర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో సభను పదేపదే వాయిదా వేయాల్సి వచ్చింది. దాంతో ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

ఫైనాన్స్ బిల్లుపై ఉత్కంఠ

మార్చి 31లోగా ఫైనాన్స్ బిల్లును ఆమోదిం చాల్సి ఉంది. అయితే సభ కార్యక్రమాలు ఒక్క నిమిషం కూడా జరిగే పరిస్థితి లేకపోవడంతో ఫైనాన్స్ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపించడం లేదు. గందరగోళం మధ్యే బిల్లును ఆమోదించే పరిస్థితి వస్తుందని రాజకీయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. బ్యాంకు కుంభకోణాలపై వాయి దా తీర్మానం కింద చర్చ జరపాలని కాంగ్రెస్ సహా విపక్షాలు పట్టుబడుతుండగా, 193 నిబంధన కిందే చర్చకు అనుమతించినందున దానిపైనే చర్చ జరగాలంటున్నారు. దాంతో అధికార, ప్రతి పక్షా ల మధ్య ప్రతిష్టంభన నెలకొని పార్లమెం టు సమావేశాలు జరగడం లేదు.



దేశమంతా ఒకే నీతి!

● రిజర్వేషన్లపై ఆగని తెరాస పోరు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రిజర్వేషన్లను అమలు చేసే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలంటూ పార్లమెంట్‌లో ఆందోళన చేపట్టిన తెరాస ఈ వారం కూడా అదే స్పీడును కొనసా గించింది. పార్లమెంట్ ప్రాంగణంలో ఆ పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగారు.

తెలం గాణా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల శాతం పెరిగినా రిజర్వేషన్లను ఎందుకు పెంచరని ఎంపీలు ప్రశ్నించారు. తెలంగాణా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి పంపినా కేంద్రం స్పందించక పోవ డంపై వారు మండి పడ్డారు. ఈ అంశంపై కేంద్రం స్పష్టత ఇచ్చే వరకూ తమ నిరస నను కొనసాగి స్తామని ఎంపీ కవిత తేల్చి చెప్పారు. రిజర్వే షన్లలోనూ మార్పు తీసుకు రావాల్సిన అవసరముందని తెరాస లోక్‌సభా పక్ష నేత జితేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఒకే దేశం, ఒకే నీతి ఉండాలి : ఎంపీ కవిత

కేంద్రం స్పష్టత ఇచ్చేవరకు మా ఆందోళను పార్లమెం టులో కొనసాగిస్తాం. ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ఒకే దేశం, ఒకే నీతి ఉండాలి. సుప్రీంకోర్టు పేరుతో బీజేపీ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. మరి సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా 29 ఏళ్లుగా తమిళ నాడులో ఏ విధంగా 69 శాతం రిజర్వేషన్లు కొనసాగుతు న్నాయి. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం తన దగ్గర పెట్టుకో వడం సరికాదు.

న్యాయ ప్రకారమే మా పోరాటం : జితేందర్ రెడ్డి,

రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనా రిటీ ల శాతం పెరిగింది. 9వ షెడ్యూల్‌లో మేం కోరుతున్న రిజ ర్వేషన్ల అంశాన్ని చేర్చాలి.

తమిళనాడు, మహారాష్ట్ర, పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్లలో చాలా తేడాలున్నాయి. తెలంగాణ మాదిరిగానే ఏపీ, హర్యానా, పంజాబ్ సహా పలు రాష్ట్రాలు రిజర్వేషన్ల హక్కు రాష్ట్రానికే ఉండాలని కోరుతున్నాయి. రాష్ట్రం, రాష్ట్రానికి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీల శాతంలో మార్పు ఉంటుంది. అందుకే రిజర్వేషన్లను అమలు చేసుకునే హక్కు రాష్ట్రాలకు ఇవ్వాలన్నదే మా డిమాండ్. ఎస్సీ, ఎస్టీ ల శాతం పెరిగి నప్పుడు రిజర్వేషన్ల ను ఎందుకు పెంచరు..? ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా తీర్మానం చేసి పంపితే కేంద్రం స్పందించదా..?

హస్తినలో 'ఏపీ హోదా' సెగలు

● రెండోవారమూ ఆగని ఆందోళన
● నిరసన వాడి వేడి పెంచిన టీడీపీ
● వెనక్కి తగ్గని వైఎస్సార్సీపీ..పోటాపోటీ ధర్నా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా మీద రాజకీయ పార్టీలు చేపట్టిన ఆందోళన వేడి రెండో వారం కూడా తగ్గలేదు. గత వారం మాదిరిగానే సోమవారమూ టీడీపీ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్ గజపతి రాజు కూడా టీడీపీ ఎంపీలకు తోడుగా ఆందోళనలో పాల్గొన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. రోజుకో గెటప్‌తో అందరినీ ఆకర్షిస్తున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్ సోమవారం వాయిద్యకారుడి గెటప్‌తో ప్రత్యక్షమయ్యారు. సంగీతం ద్వారానైనా మోడీకి జ్ఞానోదయం కావాలని కోరుకుం టున్నానని ఆయన చెప్పుకొచ్చారు. మోడీ, ప్రత్యేక విభజన మీద సన్నాయి వాయిస్తూ పాటలు పాడి అందరినీ ఆకట్టు కున్నారు. విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వర కూ తమ పోరాటం ఆగదని మరోమారు టీడీపీ ఎంపీలు తేల్చి చెప్పారు. త్వరలోనే తమ పోరాటం ప్రజా పోరాటంగా మారు తుందని నొక్కి చెప్పారు. తమ రాజీనామాలపై స్టేట్‌మెంట్ ఇచ్చే అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరినట్టు మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు తెలిపారు. తాము నిరసన తెలుపుతున్న అంశాలపై స్పష్టత వచ్చే వరకూ ఈ వారం కూడా పార్లమెం ట్‌ను సాగనిచ్చే ప్రసక్తే లేదని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. స్వప్రయోజనాలు చూసుకోకుండా స్వరాష్ట్ర బాగు కోసం పార్టీ లు, రాజకీ యా లకు అతీతంగా నాయకులు తమతో చేయి కలపాలని ఎంపీ కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు.

ఈ వారం సభలు జరుగనివ్వం

గల్లా జయదేవ్, టీడీపీ ఎంపీ

గత పార్లమెంట్ సమావేశాల కంటే ఈసారి ఎక్కువ పార్టీలు వివిధ అంశాలపై పోరా టానికి దిగాయి. బీజేపీ ప్రభుత్వం ఎవరి మాటా వినట్లే దని మేమే కాదు వారందరూ అంటున్నారు. గత వారం మొత్తం పార్లమెంట్ సరిగా నడవలేదు. ఈ వారం కూడా అలాగే చేయాలని భావిస్తున్నాము. తామెందుకు రాజీ నామా చేయాల్సి వచ్చిందో మా మంత్రులందరూ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు. ఇంత మంది నిరసన తెలుపుతున్నప్పుడు ప్రభు త్వం స్పందించాలి.

స్వప్రయోజనాలు కంటే స్వరాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం : కొనకళ్ల నారాయణ

విభజన బిల్లులో చెప్పిన అంశాలన్నీ చట్టపరంగా అమలయ్యే వరకూ మా పోరాటం ఆగదు. ఏపీ ప్రజలు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు మాకు అభినందనలు తెలుపుతున్నాయి. మీ వెనుక మేమున్నామని మద్దతు ప్రకటి స్తున్నాయి. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు వచ్చి ఆందోళనలో పాల్గొనాలి. మాతో చేయి కల పాలి. రాష్ట్రం బాగుంటే మనమంతా బాగుంటాం. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటాన్ని కొనసాగిద్దాం.

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా మీద చేపట్టిన ఆందోళన విషయంలో రెండో వారమూ వైఎస్సార్సీపీ వెనక్కి తగ్గలేదు. అధికార పక్షం టీడీపీ ఎంపీలతో పోటాపోటీగా ఆ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లోని ఒకటో నంబర్ గేట్ వద్ద నిరసనకు దిగారు. అవి శ్వాస తీర్మానం విషయంలో తమతో టీడీపీ ఎంపీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మద్దతు కూడగడతానని ఇచ్చిన హామీని పవన్ కళ్యాణ్ నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నామని ఎంపీ విజయ సాయిరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయో జనాలను కాపాడేందుకు గతంలో చెప్పినట్టుగానే ఏప్రిల్ 6న రాజీనా మాలు చేయడానికి తమ పార్టీ ఎంపీలదంరూ సిద్ధంగా ఉన్నామని ఎంపీ మేకపాటి మరో మారు స్పష్టం చేశా రు.

పోరాటాలతోనే సాధించగలం

విజయసాయిరెడ్డి, ఎంపీ

అవిశ్వాస తీర్మానం విషయంలో మాకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలు పుతున్నాయి. టీడీపీ కూడా మద్దతు తెలుపుతుందని ఆశిస్తున్నాము. అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడ గడతానని ఇచ్చిన హామీని పవన్ నెర వేరుస్తారని విశ్వాస ముంది. తెలంగాణా రాష్ట్రం ఒక్క రోజులో వచ్చింది కాదు. పోరాటమనేది ప్రజా స్వామ్యంలో ఒక భాగం. పోరాటం చేసి దేన్నైనా సాధించుకోగలం. హోదా వచ్చేంత వరకూ పోరాటాన్ని కొన సాగిస్తాం.



ఏప్రిల్ 6న మేమంతా రాజీనామాలు చేయడం ఖాయం : ఎంపీ - మేకపాటి రాజమోహన్‌రెడ్డి

అవిశ్వాస తీర్మానం పెట్టమని చంద్రబాబును సపోర్ట్ చేసిన వారే కోరారు. మా నాయకులూ సరేనన్నారు. దానికీ 50 మంది మద్దతు కావాలి. 184 కింద ఓటింగ్ ఉంటే స్పీకర్ ఒప్పుకోరు. ఒకటి మాత్రం ఖాయం. ఏప్రిల్ 6వ తేదీన మా లోక్‌సభ నాయకులందరూ రాజీనామాలు చేయడం ఖాయం. అది మా చేతుల్లో ఉంది. ప్రజలకు అక్కడివరకూ హామీ ఇవ్వగలం. అంతకుమించి మేం పెద్ద హామీలు ఇచ్చే పరిస్థితుల్లో లేము.

విశాఖ షిప్‌యార్డ్ భవితవ్యంపై

కేంద్రం మౌనం!


లేదు, కాదు, కుదరదు

● మూడు ముక్కల్లో రక్షణ మంత్రి జవాబు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్‌కు పునరుజ్జీవనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. షిప్ యార్డుకు సంబంధించి రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నలకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ లేదు, కాదు, కుదరదు అంటూ మూడే ముక్కల్లో ఇచ్చిన జవాబే ఇందుకు నిదర్శనం. దేశంలో నౌకా నిర్మాణ రంగంలో ప్రసిద్ధి చెందిన షిప్ యార్డ్‌ల్లో విశాఖపట్నం ఒకటి. తూర్పు తీరంగా ఉన్న అతి పెద్ద షిప్‌యార్డ్ కూడా ఇదే. నౌకా నిర్మాణ రంగంలో విశేష ప్రతిభ కలిగిన 77 ఏళ్ల హిందూస్తాన్ షిప్‌యార్డ్ ఒకప్పుడు దేశంలోని ప్రభుత్వ సంస్థలకే తలమానికం. అలాంటి సంస్థ పలు కారణాల వల్ల నష్టాల ఊబిలో కూరుకుపోయి ఈమధ్య క్రమంగా లాభాల బాట పడుతోంది. హిందూస్తాన్ షిప్‌యార్డ్ యాజమాన్యం రక్షణ శాఖకు కొన్నేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినా అవి ఇంతవరకూ కార్యాచరణకు నోచుకోలేదు. ఇటీవల దేశ రక్షణను పటిష్ట పరిచే చర్యలలో భాగంగా నౌకాదళ అవసరాల కోసం 20 వేల కోట్ల రూపాయల వ్యయంతో మరిన్ని అధునాతన యుద్ధ నౌకలు, పహారా నౌకల నిర్మాణాన్ని చేపట్టే ప్రక్రియకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ప్రైవేట్ రంగంలోని నౌకా నిర్మాణ సంస్థలైన రిలయన్స్ డిఫెన్స్, ఎల్ అండ్ టీ ఈ ఆర్డర్లను దక్కించుకున్నప్పటికీ అందులో హిందూస్తాన్ షిప్‌యార్డ్‌కు కూడా ప్రభుత్వం కొంతమేర భాగస్వామ్యం కల్పించింది. దానికి అనుగుణంగా మూలధన పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనపై క నూడా రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోద ముద్ర వేసి ఉంటే షిప్ యార్డ్ భవితవ్యం ఉజ్వలంగా ఉండేది. అలాగే దక్షిణ కొరియాకు చెందిన హుండై షిప్ బిల్డర్స్‌తో హిందూస్తాన్ షిప్ యార్డ్ సంయుక్తంగా నౌకా నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదన కూడా ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. ఈ వివరాలు కోరుతూ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు రక్షణ శాఖ మంత్రి, సవివరణ ఇవ్వడానికి బదులు అవును, కాదు, లేదు అంటూ ముక్తసరి సమాధానాలతో సరిపెట్టడంపై ఎంపీ విజయ సాయిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. హిందూస్తాన్ షిప్‌యార్డ్ భవితవ్యంపై కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో సమగ్ర వివరాలను వెల్లడించాలని కోరుతూ ఆయన నేరుగా నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయాలని నిర్ణయించుకున్నారు.

దక్షిణాది సొమ్ముతో... ఉత్తరాది సోకులా?



● జాతి ప్రయోజనాలకై జాతీయ పార్టీలు కృషి చేయాలి ● సెంటిమెంట్‌తో విభజన చేసినప్పుడు నిధులు ఎందుకివ్వరు? ● పనులు, పదవుల కోసం టీడీపీ తాపత్రయపడదు ● రాష్ట్ర ప్రయోజనాల కోసమే మిత్రబంధాన్ని వదులుకున్నాం ● హోదా, విభజన హామీల అమలుకు జపాన్ తరహా పోరాటం ● ఏపీ మండలిలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: దక్షిణాది రాష్ట్రాల ఆదాయంతో ఉత్తరాది రాష్ట్రాలను అభివృద్ధి చేసుకోవడం జాతీయ పార్టీలకు చెందిన కేంద్ర పాలకులకు పరిపాటిగా మారిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. సోమవారం రాష్ట్ర శాసనమండలిలో చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో గవర్నర్ ప్రసంగంపై సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జాతీయపార్టీలు జాతీయ ప్రయోజనాలకై కృషి చేయాలిగానీ ప్రజల మనోభావాలతో ఆడుకుంటూ రాష్ట్రాల పట్ల వివక్ష చూపకూడదన్నారు. 2014 ఎన్నికల సమయంలో తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ ఏపీకి ప్రత్యేక హోదా అమలు చేస్తామని, విభజన హామీలన్నింటినీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నాలుగు సంవత్స రాలు గడుస్తున్నా ఆ హామీల ఊసే ఎత్తడం లేదని, పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలు, ఇచ్చిన హామీలపై ప్రధాని మోడీ దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకులను తామేమి గొంతెమ్మ కోర్కెలను కోరడం లేదని, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏపీకి ఇచ్చిన హామీల అమలుకై అడుగుతుంటే వ్యక్తిగత విమర్శలతో బీజేపీ నేతలు ఎదురుడాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కేంద్ర బీజేపీ పాలకులు విభజన కష్టనష్టాలతో ఏర్పడిన నవ్యాంధ్రకు ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదని, అన్ని రాష్ట్రాలతోపాటుగా ఏపీకి సహాయం చేశారని వివరించారు.

నాడు కాంగ్రెస్ మోసం, నేడు బీజేపీ కూడా..

విభజనను ఆంధ్రుల కోరుకోలేదని, అయిప్పటికీ సెంటి మెంట్ పేరుతో తెలుగు రాష్ట్రాన్ని ఎటువంటి హేతుబద్ధత లేకుండా నాడు కాంగ్రెస్ పాలకులు విడగొట్టి ఆంధ్రులను మోసం చేశారని చంద్రబాబు విమర్శించారు. ఆర్థిక లోటు, అనేక విభజన కష్టనష్టాలతో ఏర్పటిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పార్లమెంటు సాక్షిగా చేసిన విభజన చట్టంలోని 18 అంశాలను, ఇచ్చిన హోదా హామీలను అమలు చేయకుండా నేడు బీజేపీ పాలకులు కూడా ఆంధ్రుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నా రని తెలిపారు. అలాగే షెడ్యూల్ 9,10లోని సమస్యలు కూడా ఇంతవరకు పరిష్కారం కాలేదని, దీనిపై సభలో మాట్లాడితే కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రెస్‌మీట్ పెట్టి సెంటిమెంట్‌కు నిధు లను ఇవ్వమని ప్రకటణ చేయడం బాధను కలిగిం చిందన్నారు. ప్రత్యేక హోదాను ఆంధ్రులు బలంగా కోరుకుం టున్నారని, అందుకే రాష్ట్రప్రయో జనాల దృష్టా య్ బీజేపీతో మిత్ర బంధాన్ని వదులుకున్నా మన్నారు. సెంటి మెంట్‌తో విభజన చేసి నప్పుడు అదే సెంటిమెంట్‌కు నిధులను ఎందుకు కేటాయించరని ప్రశ్నిం చారు. పదవుల కోసం, పనుల కోసం, పైరవీల కోసం టీడీపీ తాపత్రయపడదని, వాజ్‌పేయి ప్రధాని అయిన సమ యంలో 29 మంది ఎంపీలు ఉన్న తమకు 6 కేంద్ర మంత్రి పద వులను ఆశ చూపినా సున్నితంగా తి రస్కరించి మ ద్దతు కొనసాగించామని గుర్తు చేశారు.

ద్వంద్వ వైఖరితో వైఎస్ఆర్ కాంగ్రెస్..

వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకు పెద్దపీటవేస్తూ ప్రతిపక్షవైసీపీ కేంద్రం పట్ల ద్వంద వైఖరితో వ్యవహరిస్తోందని చంద్రబాబు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ పాలన భేష్ అంటూనే పార్లమెంటులో మాత్రం అవిశ్వాసం పెడతామని ప్రకటనలు చేయడం వైసీపీ ఎంపీలకే చెల్లిందన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో రాష్ట్రప్రయోజనాల కోసం పోరాటం చేస్తోందని, అవసరమైనప్పుడు సరైన నిర్ణయాలను తీసుకుంటూ కేంద్రంపై దశల వారీగా ఒత్తిడి పెంచుతుం దన్నారు. 60 ఏళ్ల కష్టఫలాన్ని కాంగ్రెస్ కుటిల రాజకీయాలతో నాడు పోగొట్టుకుని, అప్పులు, కట్టుబట్టలతో బయటకు వస్తే నేడు బీజేపీ న్యాయం చేయకపోగా వాయిదాలు, సాకులు, విమర్శలు, ఎక్కిరింపులతో ఆంధ్రులను అవమానం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగ్, గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధిపై కేంద్రం అడిగిన నివేదికలను ఎప్పటికప్పుడు అందించామని, కానీ ఆ లెక్కలను తోసిపుచ్చి, చివరకు అకౌంట్‌లో వేసిన నిధులను కూడా వెనక్కు తీసుకుంటూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. శ్రమ, కష్టపడేతత్వం ఆంధ్రుల్లో సహజసిద్ధంగా ఉంటుందని, మద్రాసు నుంచి విడిపోయినపుడు ఎంతో కష్టపడి హైదరాబాద్‌ను నిర్మించుకుని ప్రపంచంలోనే ఆర్థిక నగరంగా, నాలెడ్జ్ హబ్‌గా తాను తీర్చిదిద్దానని, అదే స్ఫూర్తితో నవ్యాంధ్రను అంతకు మించి అభివృద్ధి చేస్తానని, అమరావతిని 2022నాటికి దేశంలోనే టాప్ త్రీగా, 2029 నాటికి దేశంలోనే నెంబర్ వన్‌గా, 2050నాటికి ప్రపంచలోని ఉత్తమమైన ఐదు నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేశారు.

రైతుల త్యాగఫలంతో అద్భుతమైన రాజధాని నిర్మిస్తాం

రైతుల త్యాగ ఫలంతో అద్భుతమైన రాజధాని.. తాను ఇచ్చిన పిలుపుమేరకు రైతులు స్వచ్ఛందంగా నాలుగు వేల కోట్ల రూపాయల విలువైన 33 వేల ఎకరాల భూములను ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. రైతుల త్యాగ ఫలితంగానే అద్భుతమైన రాజధానిని నిర్మించుకోగలుగు తున్నామని, లక్షల కోట్ల వ్యయమైన రాజధాని నిర్మాణానికి కేవలం రూ.1,500 కోట్లు ఇవ్వడం కేంద్ర పాలకులకు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర సహకారం అరకొరగా ఉన్నప్పటికీ తన శ్రమకు, చేపడుతున్న సంస్కరణలకు రైతుల త్యాగం, అధికారులు, ప్ర జల సహకారం కూడా తోడవడంతో రెండెంకల వృద్ధి రేటును సాధించామని తెలిపారు. రూ.16,072 కోట్ల ఆర్థిక లోటులో కూడా అద్భుతమైన సంక్షేమ పాలనను టీడీపీ ప్రభుత్వం అందిస్తోందని, అలాగే కులాల వారీగా సమాన అభివృద్ధికై తాజా బడ్జెట్ కేటాయింపు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 15 నాటికి ఏపీని ఓడిఎఫ్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, 50 వేల కోట్లతో ప్రారంభించిన 50 నీటి ప్రాజెక్టుల్లో జూన్ నెల చివరకు 29 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతీయం చేస్తామని చెప్పారు. తన ఎవరూ హైకమాండ్ లేరని, ఐదు కోట్ల ఆంధ్రులే టీడీపీ హైకమాండ్ అంటూ రాష్ట్రప్రయోనాలే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, కేంద్రం తక్షణం హోదాను అమలు చేయాల్సిందే అని డిమాండ్ చేస్తూ హోదా సాధనకు, విభజన చట్టంలోని 18 హామీల అమలుకు రాజీలేని పోరాటం చేస్తామని చెప్పారు. ఒకవైపు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూనే మరోవైపు జపాన్ తరహా పోరాటం కేంద్రంపై చేస్తామని, ఆంధ్రులను అన్యాయం చేసిన వారు బాధపడేలా నవ్యాంధ్ర అభివృద్ధిని సాధిద్దామని, అందుకు ప్రజలు కూడా సంపూర్ణ మద్దతు తెలపాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.



కోల్ స్కాం కథ కంచికి..?



- కీలక కేసుల్లో సాక్షాలు సమర్పించలేకపోతున్న దర్యాప్తు సంస్థలు
- మొన్న 2జీ.. నేడు కోల్ స్కాం
- వేల కోట్ల కుంభకోణాల్లో దోషులకు శిక్షేదీ..?
- ప్రారంభంలో సమన్ల, అరెస్టులు
- విచారణ దశలో నీరుగారుతున్న కేసులు

న్యూఢిల్లీ: దేశాన్ని ఓ కుదుపు కుదిపేస్తున్న వేల కోట్ల కుంభకోణాల కేసుల ఆరంభ హడావుడి.. విచారణాంతానికి నీరుగారిపోతోంది. ప్రముఖుల ప్రమేయమో..రాజకీయ పెద్దల ఒత్తిళ్లో తెలియవుగానీ కీలక కేసుల్లో ప్రారంభంలో సమన్లు,అరెస్టులు.. కస్టడీలు.. స్టేట్ మెంట్ రికార్డులు ఎన్ని జరిగినా విచారణ పూర్తయ్యే నాటికి దోషులు నిర్దోషులుగా మారిపోతున్నారు. 2జీ స్పెక్ట్రమ్ కేసునే పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమైపోతుంది. 2011 నాటి ఈ కేసు దర్యాప్తు దాదాపు 6 ఏళ్లపాటుసాగినా దర్యాప్తు సంస్థలు దోషులుగా పేర్కొన్న వారందరూ.. నిర్దోషులుగా తేలిపోయారు. మాజీ మంత్రి రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి సహా వారికి సహకరించిన వారందరినీ దోషులుగా పేర్కొంటు సీబీఐ కోర్టుకు నివేదించినా చివరకు సరైన సాక్షాదారాలు చూపలేకపోవడంతో అసలు దోషులు అనిఆరోపణలు ఎదుర్కొన్నవారంతా నిర్దోషులుగా తేలిపోయారు.

2జీ స్పెక్ట్రమ్ అక్రమ కేటాయింపుల వల్ల ప్రభుత్వానికి 1.76 లక్షల కోట్ల నష్టం వాటిల్లినట్లు కాగ్ నివేదిక సమర్పించడంతో సీబీఐ రెండు కేసులు..ఎన్ ఫోర్స్ మెంట్ ఒక కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించాయి. అయితే ఎన్నో వాయిదాల తర్వాత గతేడాది డిసెంబర్ లో పాటియాల సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా నిర్దోషులని తీర్పునిచ్చింది. ఇందుకు ప్రధాన కారణం సీబీఐ సమర్పించిన సాక్షాలు బలంగా లేకపోవడం వల్లే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలకమైన కేసుల్లో ప్రముఖుల ప్రమేయం ఉండటం వల్లే దర్యాప్తు సంస్థలపై ఒత్తిడి పెరిగి సరైన సాక్షాలను సమర్పించలేకపోతు న్నాయన్నది ప్రధాన ఆరోపణ.

సీబీఐకి ప్రత్యేక న్యాయస్థానం మొట్టికాయలు



తాజాగా కోల్ స్కాం కథ కూడా కంచికే అన్న వాదన వినిపిస్తోంది.ఈ కేసులోనూ సీబీఐ ఆరోపణలు మోపిన వారికి సంబంధించిన సాక్షాలను న్యాయస్థానంలో సమర్పిం చలేకపోయింది. దీంతో ప్రత్యేక న్యాయస్థానం సీబీఐకి మొట్టికాయలు వేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా సరైన సాక్షాధారాలను ఎందుకు కోర్టులో సమర్పించడం లేదని సీబీఐని ధర్మాసనం మందలించింది. మధ్యప్రదేశ్‌లోని ఉర్తాన్ ఉత్తర బొగ్గు గని కేటాయింపుల్లో జరిగిన అక్రమాల కేసులో పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ లాంటి వారి ప్రమేయం ఉన్నందువల్లే ఇలా జరుగుతుందా అని ప్రశ్నించింది. నవీన్ జిందాల్ సహా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరికి సంబంధించిన సాక్షాధారాల ను సమర్పించాలని గతనెల 15న ధర్మాసనం సీబీఐని ఆదేశించింది. అయితే సోమవారం విచారణ నాటికి కూడా సీబీఐ సరైన పత్రాలను సమర్పించకపోవడంతో ప్రత్యేక న్యాయమూర్తి భగత్ పరాశర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఆదేశాలను పాటించకపోవడాన్ని తప్పుబడు తూ సీబీఐకి మొట్టికాయలు వేశారు.వచ్చేనెల 10 తేదీ నాటికి సరైన సాక్షాలు సమర్పించాలంటూ ఈకేసును వాయిదా వేశారు. ఈ కేసులో జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ కంపెనీ మాజీ డైరెక్టర్ సుశీల్ మారూ, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎంపీ ఆనంద్ గోయల్,సీఈవో విక్రాంత్ గుజ్రాల్‌లతో పాటు మాజీ కేంద్రమంత్రి దివంగత దాసరి నారాయణ రావు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.బొగ్గు కేటాయింపులకు సంబంధించి 2007 జనవరిలో స్క్రీనింగ్ కమిటీకి సమర్పించిన దరఖాస్తులో అసత్యాలు ప్రస్తావించినట్లు సీబీఐ తన ఛార్జిషీట్ లో పేర్కొంది. 2009 లో బొగ్గు శాఖ కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులివ్వగా.. కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయంటూ సీబీఐ 64 మంది పేర్లతో చార్జిషీట్ దాఖలు చేసింది.

2జీ కేసులో కేంద్రానికి మొట్టికాయ

న్యూఢిల్లీ: 2జీ కుంభకోణానికి సంబంధించిన అన్ని కేసుల్లోనూ వేగం పెంచాలని కేంద్రానికి మొట్టికాయ వేసింది. దర్యాప్తును ఆరు నెలల్లోగా పూర్తిచేసి ముగించాలని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లను సుప్రీంకోర్టు సోమవారం నాడు ఆదేశించింది. 2జీ స్పెక్ట్రం, ఈ కేసుతో ముడిపడిన ఎయిర్‌సెల్ మాక్సిక్ సహా అన్ని కేసుల్లో విచారణపై స్థాయీ నివేదికను రెండు వారాల్లోగా తమకు సమర్పించాలని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది. కేసు సుదీర్ఘ విచారణపై బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 2జీ దాదాపు ఏడేళ్లపాటు ఈ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక కోర్టు 2017 డిసెంబర్ 21న డీఎంకే నేతలు ఎ.రాజా, కనిమొళి, మరో 15 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది. కాగా, 2జీ కుంభకోణానికి సంబంధించినన కేసుల్లో 2014లో నియమించిన ఆనంద్ గ్రోవర్ స్థానంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 17న నియమించింది.

నకిలీ విద్యాసంస్థల జాబితా లేదు

కేంద్ర సహాయ మంత్రి ఉపేంద్ర కుష్వాహ

న్యూఢిల్లీ: దేశంలోని నకిలీ విద్యా సంస్థల జాబితా తమ వద్ద లేదని, వాటి విషయంలో అప్రమత్తంగా వుండాలని రాష్ట్రాలనే హెచ్చరిస్తున్నామని కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి ఉపేంద్ర కుష్వాహ రాజ్యసభలో ప్రకటించారు. సభ్యులు ఈవిషయమై లిఖిత పూర్వకంగా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధా నం ఇచ్చారు. ఎంత మంది విద్యార్థు లు నకిలీ విద్యాసంస్థల బారిన పడి మోసపోతు న్నది తమ మంత్రిత్వ శాఖ వద్ద డేటా లేనప్పటికీ, వీటివిషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవలసిందిగా రాష్ట్రప్రభుత్వాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించినట్టు ఆయన వివరణ ఇచ్చారు. రాజ్యాంగం ప్రకారం, అత్యధిక విద్యా బోర్డులు ఆయా రాష్ట్రప్రభుత్వాల పరిపాలనా నియంత్రణలో వుంటాయని, నకిలీ సంస్థల విషయంలో అప్రమత్తంగా వుంటూ వాటిని నిరోధించాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని ఆయన తెలిపారు. దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో అత్యధిక సంఖ్యలో బోగస్ విద్యా సంస్థలున్నాయని, నకిలీ విశ్వవిద్యాలయాలు ప్రతి ఏటా వేలాది నకిలీ డిగ్రీ పట్టాలను జారీ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. 2016 లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రకటించిన కరదీపికలో మొత్తం 74 బోగస్ విద్యా సంస్థల్లో 44 సంస్థలు ఢిల్లీలోనే వున్నాయంటే అక్రమాలు ఏమేరకు పాతుకుపోయాయో తెలుస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వంగానీ, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ గుర్తింపు లేని విద్యా సంస్థలను నకిలీవిగా పరిగణించాల్సివస్తుందన్నారు.

అనంత్‌నాగ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మిలిటెంట్లు హతం

శ్రీనగర్ : అనంత్‌నాగ్‌లో సోమవారం జరిగిన మిలిటెంట్లు, భద్రతా దళాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు హతం అయ్యారని ఆర్మీ అధికారి తెలిపారు. ఉగ్రవాదులు ఉన్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు సైనికులు అనంత్‌నాగ్ జిల్లాలోని హకరా ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. సైనికులను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అనంతరం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతుల్లో ఇద్దరు మిలిటెంట్ల పేర్లు, ప్రాంతం గుర్తించారు. ఒకరు శ్రీనగర్‌కు చెందిన ఫాజిల్ కాగా, అనంత్‌నాగ్ జిల్లా కోకర్‌నాగ్‌కు చెందిన సయ్యద్ ఓవైసీగా నిర్ధారించారు. మూడో ఉగ్రవాది ఎవరు ఇంకా తెలియరాలేదని ఆర్మీ అధికారులు వివరించారు. ఘటన స్థలం నుంచి మారణ ఆయుధాలు, ఏకే 47 తుపాకులు, పిస్టల్స్, హ్యాండ్ గ్రెనేడ్‌తో పాటు పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఓ మిలిటెంట్ ఇటీవల సౌరా పట్టణంలోని పోలీస్ గార్డుపై జరిపిన దాడిలో హస్తం ఉంది. ఈ దాడిలో ఓ కానిస్టేబుల్ వీరమరణం పొందాడు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కళాశాలలు, యూనివర్సిటీలు, పాఠశాలలను మూసివేయించారు. కాశ్మీర్ యూనివర్సిటీలోని పరీక్షను కూడా వాయిదా వేసినట్టు ఆర్మీ అధికారి వివరించారు. ఈ పరీక్షకు సంబంధించిన తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల జాప్యాలపై నివేదికలివ్వండి

న్యూఢిల్లీ: ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, పథకాల అమలులో జాప్యంవల్ల వ్యయం బాగా పెరిగి పోతున్న దృష్ట్యా,ఇందుకుగల కారణాలను తెలియజేయాల్సిందిగా అన్ని మంత్రిత్వ శాఖలను ప్రభుత్వం ఆదేశించింది.ఈ మేరకు కేబినెట్ కార్యదర్శి పికె సిన్హా అన్ని శాఖలకూ ఒక సర్క్యులర్ పంపారు. ప్రభుత్వం ఆమోదించిన పలు ప్రతిపాదనలు,పథకాల అమలులో జాప్యం వల్ల వ్యయం బాగా పెరిగిపోయినట్టు సమాచారం అందడంతో కేబినెట్ కార్యదర్శి ఈ సర్క్యులర్‌ని విడుదల చేశారు.ఏయే ప్రతిపాదన,లేదా ప్రాజెక్టు ఏయే కారణాల వల్ల జాప్యం జరుగుతోందో ప్రభుత్వానికి సవివరణలతో నివేదికలను సమర్పించాల్సిందిగా మంత్రిత్వ శాఖలను కేంద్రం ఆదేశించింది.

కదంతొక్కిన ఎర్రదండు!

అన్నదాతల డిమాండ్లన్నీ పరిష్కరిస్తాం: మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్





- అర్హులకు అటవీశాఖ భూములు
- కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తాం
- అసెంబ్లీలో రైతుల గురించి చర్చ

ముంబై: న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సభ ఆధ్వర్యంలో మహా యాత్రకు మహారాష్ట్ర సర్కార్ తలొగ్గింది. కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని సీఎం ఫడ్నవిస్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. సోమవారం ఉదయం చూడగా మైదానం అంతా ఎర్ర సముద్రాన్ని తలపించింది. రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, కరెంట్ బిల్లు మాఫీ, స్వామినాథన్ సిఫార్సులను అమలుతో పాటు తదితర డిమాండ్‌లతో ఈ ర్యాలీ చేపట్టారు. సోమవారం అసెంబ్లీ ముట్టడించడానికి గాను ఈ ఎర్రదండు ముంబైకి తరలివచ్చిం ది. నాసిక్ నుంచి మొదలై ముంబైకి చేరిన రైతు ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాశం అయింది. రికార్డు స్థాయిలో వేలాది మంది అన్నదాతలు 180 కి.మీ మేర పాద యాత్ర చేపట్టడం బహుశా ఇదే తొలిసారేమో! సుమారు 30 వేల మంది రైతులు మార్చి 6న నాసిక్ నుంచి ముంబైకి మహా యాత్రగా బయల్దేరారు. థానే, పాల్ఘడ్ తదితర జిల్లాల రైతులు జతకలిశారు. సోమవారం 70వేల మంది రైతులు అసెంబ్లీ ముట్టడికి సిద్ధం అయ్యారు. గత ఏడాది మహారాష్ట్ర సర్కార్ రూ. 34 వేల కోట్ల రుణాల మాఫీ కి హామీ ఇచ్చినా అది క్షేత్రస్థాయిలో సరిగా అమలు కాలేదు. దీంతో కడుపు మంటతో వారంతా అసెంబ్లీ ముట్టడికి పూనుకున్నారు.

తలొగ్గిన మహా ప్రభుత్వం

రైతుల ప్రవాహం చూసిన మహారాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లకు దిగి వచ్చింది. రైతు సంఘం నాయకులతో చర్చలు నిర్వహించడానికి సీఎం ఫడ్నవిస్ సిద్ధంగా ఉండటంతో పలువురు వెళ్లి చర్చించారు. రైతుల తమ ముందు పెట్టిన డిమాండ్లు అన్నీ నెరవేర్చినట్టు రెవెన్యూ శాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్ ప్రకటించారు. ఆజాద్ మైదానికి చేరుకుని రైతులకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంఘీభావం తెలిపారు.

అటవీ భూమిలో వ్యవసాయం

మహారాష్ట్రలో ఉన్న అటవీ భూమిని రైతు లకు, గిరిజనులకు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రకటిం చారు. విధానభవన్ ఎదుట ఆయన మాట్లాడుతూ...అటవీ భూమిని సాగు భూమిగా మార్చడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. దీని కోసం కమిటీ వేస్తాం. అనంతరం అటవీ భూమిని అర్హులై న గిరిజ నులు, రైతులకు అందజేస్తాం. విధా నసభలో రైతు సంఘం, ఆదివాసీలతో అధికారులు సమావేశం నిర్వహిం చారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం సరిగా కురవకపోడంతో చాలా మంది ఆదివాసి రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య లకు పాల్పడు తున్నారు. అన్నదాతలు తీసుకొచ్చిన అన్ని డిమాం డ్లను మంత్రి వర్గంలో చర్చి స్తాం. కొద్ది సమ యం తీసు కుంటుం ది. రైతుల పట్ల సానుకూ లంగానే వ్యవహ రిస్తాం.



గిరిజనులకు భూమి ఇవ్వాలి: సీపీఎం

సీపీఎం అనుబంధ సంఘమైన ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టాం. రుణ మాఫీ, అటవీ భూమిని సాగు భూమిగా మార్చి రైతులకు అందజేయాలి. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలంటూ కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నాం. గిట్టుబాటు ధర కూడా ఇవ్వడం లేదు. అటవీహక్కు చట్టాలను అధికారులు ఉల్లంఘిస్తున్నారు.

అన్ని డిమాండ్లు నెరవేర్చాలి: రాహుల్

గిరిజనులు, రైతులు చేపట్టిన పాదయాత్రపై ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ స్పందించాలి. వారి డిమాండ్లను నెరవేర్చాలి. గర్వాన్ని పక్కనపెట్టి ప్రజా ప్రతినిధిగా రైతు సమస్యలు పరిష్కరించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రకు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నది.

కొంతమంది మంత్రులు కన్‌ఫ్యూజ్ చేశారు: శివసేన

రైతులు ప్రభుత్వం ఎదుట పెట్టిన డిమాండ్లు తీర్చలేనివి కావు. కొందరు మంత్రులు రైతులను, గిరిజనులను కన్‌ఫ్యూజ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పక వారి సమస్యలు పరిష్కరిస్తాయి. ప్రభుత్వం పార్టీకలతీతంగా వ్యవహరిస్తుంది రైతుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయం. రైతులందరూ ఎర్ర జెండాలు చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు.

రోగి మల ద్వారం నుంచి 100 చేపముళ్ళను తీసిన డాక్టర్!

న్యూఢిల్లీ: మాంసాహార ప్రియులు చేప ముక్కలు కనిపిస్తే లొట్టలేయకుండా వుండరు. అలాగనీ, ఆబగా లాగించాలని చూస్తే ఆస్పత్రి పాలు కావాల్సి వస్తుందని చైనాలోని ఒక చేపల ప్రియుడు నిరూపించాడు. చైనాలోని సిచువాన్ ప్రాంతా నికి చెందిన ఒక వ్యక్తి హోటల్‌కు వెళ్ళి ఉడకబెట్టిన రెండు చేపముక్కలను, ముళ్ళు తీసి పారేయకుండా అలాగే లాగించేశాడు. తీరా ఇంటికి వెళ్ళిన కొన్నిగంటల తరువాత మలవిసర్జన సమస్య తలెత్తడమే కాకుండా అతగాడి మలద్వారం ఉబ్బిపోయింది. అతని కుటుంబ సభ్యులు వెంటనే వెస్ట్ చైనా హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించారు. డాక్టర్లు సిటీ స్కాన్ తీసి చూడగా అతని మలద్వారం సుమారు 100కు పైగా చేపముళ్ళతో తీవ్ర రక్తస్రావమై వుంది. నలుగురు డాక్టర్ల బృందం రెండు గంటల పాటు శ్రమించి మలద్వారం నుంచి 100 చేపముళ్ళను వెలికితీశారు. ఈ సందర్భంగా డాక్టర్ హుయాంగ్ జియిన్ మాట్లాడుతూ, ఇది చాలా అరుదైన సంఘటన అని, ఇలాంటిదెప్పుడూ తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. ఈ చికిత్స చాలా రిస్క్‌తో కూడుకున్నదని, ముళ్ళు తొలగించేప్పుడు ఎక్కువగా రక్తస్రావమైందని అన్నారు.

తీహార్ జైలుకు కార్తీ చిదంబరం



న్యూఢిల్లీ: ఐఎన్ ఎక్స్ మీడియా అవినీతి కేసులో మాజీ ఆర్థికమంత్రి చిదంబరం కుమారుడు కార్తీ పన్నెండు రోజుల పోలీసు కస్టడీ పూర్తి కావడంతో ఆయనను సోమవారం సిబిఐ ప్రత్యేక కోర్టులో హాజరు పర్చారు. కాగా, ఆయనకు ఈనెల 24వ తేదీవరకూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సునీల్ రాణా జ్యుడీషియల్ కస్టడీ విధించి తీహార్ జైలుకు పంపారు. తీహార్ జైలులో ఆయనకు ప్రత్యేక సెల్ కేటాయించాలనీ, ఇంటి నుంచి ఆహారాన్ని తెప్పించుకోవడానికి అనుమతించాల ని కార్తీ తరపు న్యాయవాది దయాన్ కృష్ణన్ కోరారు.కార్తీ మాజీ కేంద్రమ మంత్రి కుమారుడనీ, సమాజంలో హోదా కలిగిన కుటుంబానికి చెందిన వారని కృష్ణన్ పేర్కొనగా, అంతమాత్రాన ప్రత్యేక సెల్ కేటాయించలేమని న్యాయమూర్తి కరాఖండీగా స్పష్టం చేశారు. చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు అనేక మంది ఉగ్రవాదులపై విచారణ జరగడం,శిక్షలు విధించడం జరిగిందనీ, ఆయనపై కోపంతో కార్తీపై జైలులో ఉన్న నేరస్థులు దాడి చేసే ప్రమాదం ఉందని కూడాఆయన వాదించారు. అయితే,ఆయన వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. కార్తీకి తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు.కార్తీని ఈనెల24వ తేదీన తిరిగి హాజరు పర్చాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశించారు.

చర్చిపై పిడుగు... 16 మంది మృతి

రువాండ(ఆఫ్రికా): తూర్పు ఆఫ్రికాలోని రువాండలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆ దేశ రాజధాని కిగాలిలోని ఓ చర్చిపై పిడుగుపడి 16 మంది చనిపోయారు. 140 మందికి పైగా గాయపడినట్టు స్థానిక అధికారులు తెలిపారు. అధికారిక సమాచారం ప్రకారం... ఈ ప్రమాద సమయంలో 14 మంది అక్కడికక్కడే చనిపోయారని, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మృతి చెందారని నగర మేయర్ తెలిపారు.

విమాన విషాదం

- కాట్మండ్‌లో కుప్పకూలిన విమానం
- ఒక్కసారిగా ఎగిసిపడిన అగ్నికీలలు
- 50మంది సజీవ దహనం
- ప్రమాద సమయంలో విమానంలో 71మంది
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు



కాట్మండ్(నేపాల్): నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి అమెరికా వెళ్తున్న విమానం కాట్మండ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యే సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో సుమారు 50 మంది మరణించినట్లు తెలుస్తోంది. మరో 20 మందిని సహాయక సిబ్బంది సురక్షితంగా కాపాడారు. విమానం ల్యాండ్ అయ్యే సమయంలో నిలకడ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు సమాచారం. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో విమానంలోని వారిలో చాలామంది అగ్నికి ఆహుతైనట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో వస్తున్న విమానం ఖట్మాండ్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలోప్రమాదానికి గురైనట్లు విమానాశ్రయ అధికార ప్రతినిధి ప్రేమ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు. ఢాకా నుంచిబయలుదేరిన విమానం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటలకు ల్యాండ్ కావాల్సి ఉంది. రన్‌వేపై దిగుతున్న సమయంలో ఒక్కసారిగా కూలిపోయి పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలోపడిపోయిందని, వెంటనే మంటలు చెలరేగి ప్రమాదానికి కారణమయిందని, మంటల్లో విమానం పూర్తిగా దగ్ధమైందని ఠాకూర్ తెలిపారు. సమాచారం అందుకున్న నేపాల్ ఆర్మీ సిబ్బంది ఎయిర్‌పోర్టుకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, అప్పటికే పరిస్థితి చేయిదాటిపోవడంతో 50 మంది సజీవదహనమయ్యారు. గాయపడిన వారిని ఖాట్మాండ్ మెడికల్‌కాలేజి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరగవచ్చునని ఖట్మాండు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. అయితే, సాంకేతిక కారణాల వల్లే విమానం కూలిపోయి ఉంటుందని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు. ప్రమాద నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాశ్రయాన్ని మూసేశారు.

తమిళనాట కార్చిచ్చు: 10మంది మృతి

- 17మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- అత్యాధునిక హెలికాప్టర్‌తో సేవలు : నిర్మలాసీతారామన్
- ట్రెక్కింగ్ తాత్కాలికంగా రద్దు: కేరళ సర్కార్



థేని, తమిళనాడు : థేని జిల్లాలోని కురంగణి పర్వతాల్లో ఆదివారం నిర్వహించిన పర్వతారోహణలో 10 మంది అగ్నికి ఆహుతలైనట్టు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అందరూ సంతోషంగా ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాల ను రెవెన్యూ పరిపాలనా శాఖ చీఫ్ కమిషనర్ కె.సత్యగోపాల్ వివరించారు. రెస్క్యూ బృందం వెంటనే రంగంలోకి దిగడంతో ప్రాణ నష్టం తగ్గింది. మంటల్లో చిక్కుకున్న 17 మంది విద్యార్థులను గుర్తించి ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. 10 మంది మాత్రం తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. తొమ్మిది మంది విద్యార్థులు మృతి చెందగా, వారిలో ఆరుగురు చెన్నైకి చెందిన వారు కాగా, ముగ్గురు ఏరోడ్ నివాసులుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న తమిళనాడు సీఎం పళని స్వామి ఘటన స్థలాన్ని సందర్శించారు. గాయాల పాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. 36 మంది సభ్యులు ఉన్న బృందంలో 24 మంది చెన్నైకి చెందిన వారు కాగా, 12 మంది తిరుప్పూర్, ఏరోడ్ నివాసులు. ట్రెక్కింగ్ చేయడానికి వీరంతా కురంగణి పర్వత ప్రాంతానికి మార్చి 10వ తేదీన చేరుకున్నారు. బృందంలో 25 మంది మహిళలు ఉండగా, ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు థేని జిల్లా కలెక్టర్ మరియం పల్లవి బల్‌దేవ్ వివరించారు. నాలుగు హెలీకాప్టర్లతో 10 మంది కమాండో లు కలిసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిం చినట్టు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్విట్టర్ వేదికగా తెలిపారు. పర్వతా ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంపు నిర్వహించి గాయాలపాలైన వారికి మెరుగైన చికిత్సలు అందించాలని వైద్య కార్యదర్శి జె.రాధా కృష్ణన్ ఆదేశించారు. కొయంబ త్తూర్ సూలూర్ ఏయిర్‌బేస్‌కు చెందిన నాలుగు చాపర్లు కూడా సహాయ చర్యల్లో పాల్గొన్నాయి. అటవీ శాఖ అధికారులు, పోలీసులు, స్థానిక నాయకులు, గిరిజనులు, ఉద్యోగుల తో పాటు టీ కొట్టు వాళ్లు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నా రు. థేని జిల్లా నుంచి 40 కిలోమీటర్ల దూరంలో కురంగణి, కోజుకుమలై పర్వతాలు ఉన్నాయి. ఈ కొండ ప్రాంతంలో చాలా మంది సెలవు దినాల్లో ట్రెక్కింగ్ వస్తారని కలెక్టర్ పల్లవి బల్‌దేవ్ తెలిపారు. తమిళనాడు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.విజయ భాస్కర్ మాట్లాడుతూ... కురంగనిలోనే పర్వతారోహకులకు మెరుగైన చికిత్స చేయాలి. అగ్ని ప్రమాదంలో మొత్తం 9 మంది మృతి చెందారు. వారిని గుర్తించడం జరిగింది. వారి మృతదేహాలను సమీపంలోని బోడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. 90 శాతం గాయాలపాలైన ఆమెను అనునిత్యగా గుర్తించారు.

రంగంలోని అడ్వాన్స్ లైట్ హెలికాప్టర్: నిర్మలా సీతారామన్

తమిళనాడులో అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలిసిన వెంటనే అత్యాధునిక లైట్ హెలికాప్టర్‌లను రంగంలోకి దించాం. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో చాలా మంది విద్యార్థులు చెల్లాచెదురు అయ్యారు. ప్రాణాలు కాపాడుకోవడానికి తలోదిక్కు వెళ్లడంతో కూడా కొందరు మృతి చెందారు.

క్రీడాప్రభ



యూకీ సంచలనం


12వ ర్యాంకు ఆటగాడిపై విజయం

ఇండియన్ వెల్స్: ఇండియన్ నెంబర్ వన్ టెన్నిస్ క్రీడాకారుడు యూకి భాంబ్రి మరో సంచలనం సృష్టించాడు. కెరీర్‌లో ఇప్పటికే పలు మధుర విజయాలు సాధించిన భాంబ్రి ఈసారి 12వ ర్యాంకు ఆటగాడు ల్యూకాస్ పౌలీ మీద గెలిచి తన ఎంత ప్రమాదకర ఆటగాడో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాడు. కెరీర్‌లో తొలిసారి ఇండియన్ వెల్స్‌కు అర్హత సాధించిన ఈ పాతికేళ్ల కుర్రాడు రెండో రౌండ్‌లో ఫ్రెంచ్ ఆటగాడు పౌలీపై 6-4, 6-4 తేడాతో విజయం సాధించాడు. ఈ విజయంతో భాంబ్రి 47,170 అమెరికన్ డాలర్లతో పాటూ 45 ర్యాంకింగ్ పాయింట్లను కూడా పొందనున్నాడు. ఇక మూడో రౌండ్‌లో అమెరికన్ పొడగరి, ఏస్‌ల వీరుడు, 21 ర్యాంకు ఆటగాడు సామ్ క్వెరీతో తలపడనున్నాడు. జకోవిచ్, ఫెడరర్ లాంటి పెద్ద పెద్ద స్టార్లకే వణుకు పుట్టించే సామ్ క్వెరీ మీద విజయం సాధిస్తే మాత్రం భాంబ్రి కెరీర్ మరో మెట్టు పైకెక్కినట్టే. ఈ మధ్యే ప్రకటించిన డేవిస్ కప్ జట్టులో భాంబ్రికి చోటు దక్కిన విషయం తెలిసిందే.

ఇదేమీ కొత్తకాదు

భాంబ్రికి సంచలన విజయాలు కొత్తేం కాదు. 2017 సిటీ ఓపెన్‌లో మరో ఫ్రెంచి స్టార్ గైల్ మోన్‌ఫిల్స్ మట్టి కరిపించి ప్రపంచ టెన్నిస్‌లో తన పేరు వినిపించేలా చేశాడు. 2014 చెన్నై ఓపెన్‌లో అప్పటి 16వ ర్యాంకు ఆటగాడు, క్లే కోర్టు స్పెషలిస్ట్ ఫాబియో ఫోగ్నినిపై టెక్నికల్‌గా గెలిచినా.. నిజానికి ఫాబియో గాయం కారణంగా మ్యాచ్ మధ్యలో తప్పుకోవడంతో విజయానికి పెద్ద విలువ దక్కలేదు. తర్వాత ఇప్పుడు మరోసారి విజయం సాధించి అమెరికా ఖండంలో తన సత్తా చాటాడు.

జకోవిచ్ ఇంటికి



మాజీ నెంబర్ వన్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ పునరాగమనం నిరాశాజనకంగా మొదలైంది. మోచేయి గాయానికి సర్జరీ తర్వాత తిరిగి కోర్టులో అడుగుపెట్టిన జోకర్ తొలి మ్యాచ్‌లోనే ఓటమి చవిచూశాడు. జపాన్ ఆటగాడు టారో డేనియల్ చేతిలో 6-7(3), 6-4, 1-6 తేడాతో పరాజయం పాలయ్యాడు. తొలి సెట్‌లో 5-2తో ఆధిక్యంలో నిలిచిన డానియల్ సర్వ్ బ్రేక్ చేసి సెట్ కైవసం చేసుకునే అవకాశాన్ని కోల్పోయిన సెర్బియన్ స్టార్.. ఆ తర్వాత సర్వీస్ గేమ్‌తో పాటూ, టై బ్రేక్‌లో సెట్‌నూ కోల్పోయాడు. తిరిగి రెండు సెట్‌లో పుంజుకున్నా.. మూడో సెట్ తన స్థాయికి తగ్గ ప్రదర్శనలేక మ్యాచ్ కోల్పోయాడు.

మళ్లీ చెలరేగిన రబాడా

- రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు
- ఆసీస్‌పై సఫారీల విజయం
- 1-1తో సిరీస్ సమం



పోర్ట్ఎలిజబెత్ : ఆస్ట్రేలియాతో ఆడుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన 101 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 4 వికెట్లు కోల్పోయి దక్షిణాఫ్రికా ఛేదించింది. ఈ విజయంతో నాలుగు టెస్టుల సిరీస్‌ను 1-1తో ఆ జట్టు సమం చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 5 వికెట్ల నష్టానికి 180 పరుగులతో నాలుగో రోజు ఆట మొదలు పెట్టిన పర్యాటక ఆసీస్ జట్టు 239 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో కంగారూల నడ్డివిరిచిన రబాడా(6/54) మరోసారి అలాంటి ప్రదర్శనే చేశాడు. రబాడా ధాటికి ఓవర్ నైట్ బ్యాట్స్‌మెన్ ఉస్మాన్ ఖ్వాజా(75) పరుగులేమీ చేయకుండానే నిష్క్రమించాడు. కాసేపటికే మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ మిచెల్ మార్ష్(39) కూడా రబాడా బంతికి బలయ్యాడు.. తర్వాత ప్రమాదకారి స్టార్క్(0) తో పాటూ నాథన్ లయాన్(5) ల వికెట్లు తీసి... అవతల ఎండ్‌లో టిమ్ పెయిన్(28) కు భాగస్వామ్యాలు నిర్మించే అవకాశం లేకుండా చేశాడు రబాడా. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లను కలుపుకుని మొత్తం 11 వికెట్లు తీసిన రబాడాకే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. మొత్తంగా ఒక టెస్టులో 10 వికెట్లు తీయడం రబాడాకు ఇది నాలుగోసారి కావడం విశేషం. దక్షిణాఫ్రికా తరఫున అత్యధికంగా స్టెయిన్ 5 సార్లు 10 వికెట్లు నేలకూల్చాడు. అయితే స్టెయిన్ 86 టెస్టుల్లో ఆ ఘనత వహిస్తే.. రబాడా ఇప్పటివరకూ ఆడింది 28 టెస్టులు మాత్రమే. ఇక రెండో ఇన్నింగ్స్‌లో డివిలియర్స్ సెంచరీ మ్యాచ్‌ను మలుపు తిప్పిన సంగతి తెలిసిందే. దీంతో సఫారీల తరఫున ఆస్ట్రేలియాపై అత్యధిక సెంచరీలు(6) చేసిన ఆటగాడిగా ఏబీ చరిత్రకెక్కాడు. హషీమ్ ఆమ్లా, గ్రేమ్ పొల్లాక్, జాక్వెల్ కల్లిస్, బార్లోలు 5 సెంచరీలతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు.

స్కోరు వివరాలు
ఆస్ట్రేలియా 243, 239
సౌతాఫ్రికా 382, 102/4

ఛేదించారు

- లంకపై భారత్ విజయం
- రాణించిన పాండే, కార్తీక్
- ఠాకూర్‌కు 4 వికెట్లు



ట్రై సిరీస్‌లో భారత్ తన రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆతిథ్య జట్టుపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్ అవకాశాలు మెరుగుపరుచుకుంది. లంక నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని మరో తొమ్మిది బంతులుండగానే ఛేదించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. మనీశ్ పాండే(42), దినేశ్ కార్తీక్(39)లు అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు విజయాన్ని అందించారు.

కుశాల్ మెండిస్ వికెట్ తీసిన ఆనందంలో చాహల్

కొలంబో : 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. రోహిత్(11) మరోసారి విఫలమవ్వగా, ఫామ్‌లో వున్న శిఖర్ ధావన్ (8) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. తర్వాత లోకేశ్ రాహుల్(18), సురేశ్ రైనా(27)లు కాసేపు క్రీజులో నిలబడడంతో పాటూ 40 పరుగుల కీలక భాగస్వామ్యం అందించారు. పిమ్మట ఇద్దరూ ఔటైనా చివర్లో మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్‌లు జట్టును విజయతీరాలకు చేర్చారు.

వర్షం కారణంగా మ్యాచ్ ప్రారంభానికి ఆలస్యమైంది. టాస్ గెలిచి రోహిత్ శర్మ ఫీల్డింగ్ ఎంచుకోగానే వర్షం మళ్లీ మొదలయింది. అయితే ఈసారి వచ్చింది ఉరుముల, మెరుపుల వర్షం కాదు. పరుగుల వర్షం.

బ్యాటింగ్ కు దిగి, దిగగానే బౌలర్ల మీద ఎదురుదాడికి దిగడంతో తొలి రెండు ఓవర్లలోనే 24 పరుగులు వచ్చాయి. సిరీస్ ఆద్యంతం పరుగులు సమర్పించుకుంటూ వచ్చిన ఉనద్కత్ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ తొలి ఓవర్‌లోనే 15 పరుగులు ఇచ్చుకున్నాడు. అయితే వరుస ఓవర్లలో గుణతిలక(17), పెరీరా(3) వికెట్లు కోల్పోవడంతో లంక జోరుకు భారత్ కళ్లెం వేసినట్టే కనిపించినా.. ఇన్ ఫామ్ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్ (55), ఉపుల్ తరంగ(22)తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మెండిస్ విధ్వంసంతో శ్రీలంక 11 ఓవర్‌లో తరంగ వికెట్ కోల్పోయే సరికి 96 పరుగులు చేసి భారీ స్కోరు చేసేలా కనిపించింది.

అయితే ద్వితీయార్థభాగంలో లంకను భారత బౌలర్లు కట్టడిచేయడంలో సఫలం కాగలిగారు. చండిమాల్ స్థానంలో కెప్టెన్సీ పగ్గాలు చేపట్టిన తిసార పెరీరాను ఠాకూర్ బోల్తా కొట్టిస్తే.. నిలకడకు పేరైన జీవన్ మెండిస్ వికెట్లకు వాషింగ్టన్ సుందర్ గిరాటేశాడు. ఆ వెంటనే చాహల్ వేసిన 15వ ఓవర్‌లో అప్పటిదాకా యాంకర్ రోల్ పోషించిన కుశాల్ మెండిస్.. రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో లంక భారీ స్కోరు ఆశలకు గండి పడింది. పేసర్లు ఆఖరి ఓవర్లలో పరుగులు నియంత్రించడంతో 9 వికెట్ల నష్టానికి లంక 152 పరుగులకు పరిమితమైంది. ఇదే క్రమంలో శార్దుల్ ఠాకూర్ కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. నాలుగు ఓవర్లలో 27 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. ఈ క్రమంలో అతను హ్యాట్రిక్‌ను కూడా కోల్పోయాడు. 19వ ఓవర్ లో నాలుగు, ఐదు బంతుల్లో వికెట్లు తీసిన ఠాకూర్, చివరి బంతికి వికెట్ తీయడంలో సక్సెస్ కాలేకపోయాడు. ఇక వాషింగ్టన్ సుందర్ 4 ఓవర్లకు 2 వికెట్లతో కేవలం 21 పరుగులే ఇచ్చి మరోసారి పొదుపు బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక: ధనుష్క గుణతిలక (సి) రైనా (బి) శార్దుల్ ఠాకూర్ 17, కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 55, కుశాల్ పెరీరా (బి) వాషింగ్టన్ సుందర్ 3, ఉపుల్ తరంగ (బి) విజయ్ శంకర్ 22, తిసార పెరీరా (సి) చాహల్ (బి) ఠాకూర్ 15, జీవన్ మెండిస్ (బి) వాషింగ్టన్ సుందర్ 1, దసున్ శనక (సి) కార్తీక్ (బి) ఠాకూర్ 19, దనంజయ (సి) రాహుల్ (బి) ఉనద్కత్ 5, సురంగ లక్మల్ 5(నాటౌట్), చమీరా(సి) ఉనద్కత్ (బి) ఠాకూర్ 0, నువాన్ ప్రదీప్ 0(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 10, మొత్తం: (19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 152

బౌలింగ్ : ఉనద్కత్ 3-0-33-1, వాషింగ్టన్ సుందర్ 4-0-21-2, ఠాకూర్ 4-0-34-4, యుజువేంద్ర చాహల్ 4-0-34-1, విజయ్ శంకర్ 3-0-30-1, సురేశ్ రైనా 1-0-6-0

భారత్: రోహిత్ శర్మ (సి) కుశాల్ మెండిస్ (బి) దనంజయ 11, శిఖర్ ధావన్ (సి) తిసార పెరీరా (బి) దనంజయ 8, లోకేశ్ రాహుల్ (హిట్ వికెట్/బి) జీవన్ మెండిస్ 18, సురేశ్ రైనా (సి) తిసార పెరీరా (బి) నువాన్ ప్రదీప్ 27, మనీశ్ పాండే మనీశ్ పాండే 42(నాటౌట్), దినేశ్ కార్తీక్ 8(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: (17.3 ఓవర్లలో 4 వికెట్లకు) 153 **బౌలింగ్:** సురంగ లక్మల్ 2-0-19-0, దనంజయ 4-0-19-2, చమీరా 3-0-19-2, నువాన్ ప్రదీప్ 2.3-0-30-1, జీవన్ మెండిస్ 4-0-34-1, తిసార పెరీరా 2-0-17-0

అంపైర్ పార్ట్‌నర్‌గా పేటీఎం

- ఐపీఎల్ స్పాన్సర్ షిప్

న్యూఢిల్లీ: ఇంతవరకూ భారత క్రికెట్‌కు అధికారిక స్పాన్సరర్‌గా వ్యవహరించిన పేటీఎం ఇక నుంచీ బీసీసీఐతో తన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించనుంది. రానున్న ఐదేండ్లకు గానూ ఐపీఎల్ అంపైర్ పార్టనర్‌గా పేటీఎం వ్యవహరించనుంది. పేటీఎం చైర్మన్ రాజీవ్ శుక్లా ఇదే విషయమై స్పందిస్తూ "మా బ్రాండ్ విలువ పెరగడంలో క్రికెట్ పాత్ర ఎంతైనా వుంది. ఇప్పుడు మరో ఐదేండ్ల పాటూ ఐపీఎల్‌లో భాగస్వామ్య మౌతున్నందుకు సంతోషిస్తున్నాం" అన్నారు.

లార్డ్స్ టెస్టుకు స్టోక్స్ దూరం



లండన్: ప్రముఖ ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఆగస్టులో భారత్‌తో జరుగనున్న లార్డ్స్ టెస్టుకు దూరం కానున్నాడు. గతంలో ఒక వ్యక్తిని గాయపరిచిన కేసులో విచారణ ఆగస్టు 6వ తేదీకి వాయిదా వేయడంతో.. ఐదారు రోజుల పాటూ జరిగే విచారణకోసం 9 నుంచి మొదలయ్యే లార్డ్స్ టెస్టుకు స్టోక్స్ మిస్సవ్వక తప్పని పరిస్థితి. ఈ విషయమై వీడియో లైవ్‌లో స్టోక్స్‌తో మాట్లాడిన జడ్జి.. తర్వాత విచారణ సమయంలో తప్పక హాజరవ్వాలని ఆదేశించడం జరిగింది.

భారత్‌కు అగ్రస్థానం

- ముగిసిన షూటింగ్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: ఒలింపిక్ క్రీడలకు అర్హత పోటీలైన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ షూటింగ్ ఈవెంట్ చివరి రోజు భారత్ పతకాలు సాధించలేకపోయినప్పటికి పతకాల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచి టోర్నీని ముగించింది. మెక్సికోలోని గ్వాడలజారాలో జరుగుతున్న ఈ పోటీల్లో భారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్యాలతో మొత్తం 9 పతకాలు సాధించింది. చివరిరోజు సోమవారం జరిగిన పురుషుల స్కీట్ పోటీల్లో రెండు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ అమెరికాకు చెందిన విన్సెంట్ హ్యాన్‌కాక్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన పాల్ ఆడమ్స్ రజతం, ఇటలీకి చెందిన టమ్మారో కాసినాండ్రో కాంస్యాన్ని గెలుచుకున్నారు. భారత షూటర్లు స్మిత్ సింగ్ 116 పాయింట్లు సాధించి 15వ స్థానం, అంగద్ బవాజ 115 పాయింట్లతో 18వ స్థానం, షీరజ్ షేక్ 112 పాయింట్లతో 30వ స్థానం పొందారు.

టోర్నీలో భారత దేశానికి చెందిన షాహజార్ రిజ్వి, మను భాకర్, అఖిల్ షెహరాన్, ఓం ప్రకాశ్ మిథర్వాల్ స్వర్ణ పతకాలు గెలువగా, అంజుం మౌద్గిల్ రజతం గెల్చుకుంది. జితురాయ్, రవికుమార్, మెహులీ ఘోష్, కాంస్యాలు గెలుచుకున్నారు. ఇంకో కాంస్యాన్ని భారత్ టీం ఈవెంట్లో గెలుచుకుంది.

అభినవ్ బింద్రా ప్రశంసలు

మెక్సికోలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ పోటీల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచి చరిత్ర సృష్టించిందని ఒలింపిక్ పతక విజేత అభినవ్ బింద్రా అన్నాడు. 'మెక్సికోలో భారత షూటింగ్ జట్ల ప్రతిభ భారత షూటింగ్ చరిత్ర సరికొత్త మైలురాయికి చేరింది. షూటింగ్‌లో భారత భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని విశ్వసిస్తున్నాను.

ఒలింపిక్ పోడియంలో భారత్‌కు పతకాలు తేవడంలో ఈ యువతరం మూల స్తంభాలుగా నిలుస్తారనటంలో ఎలాంటి సందేహం లేదు. విజేతలకివే నా శుభాకాంక్షలు' అని బింద్రా అన్నాడు.



కోహ్లీకి తిరుగులేదు



- 2025లోగా 100 సెంచరీలు చేస్తాడు
- క్రీడా జ్యోతిష్కుడు నరేంద్ర బుండె

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ 2018లో తన కెరియర్ పరంగా ఉన్నత స్థానంలో నిలిచి, ప్రచార కర్తగా భారీగా ఆదాయాన్ని కూడగట్టుకుంటాడని క్రికెట్ జ్యోతిష్కుడు నరేంద్ర బుండె అంటున్నాడు. జ్యోతిష్యమే కదా అని తేలికగా తీసిపారేయారేయలేము. ఎందుకంటే గతంలో ఈయన మహేంద్రసింగ్ ధోనీ కెరియర్‌పై చెప్పిన భవిష్యం నిజమైంది. ధోనీ 36 ఏళ్లకు పైబడి క్రీడల్లో కొనసాగుతాడని 2019 ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతాడని చెప్పాడు. నాగపూర్‌కు చెందిన బుండె తాజాగా తన దృష్టిని కోహ్లీ వైపు మర ల్చాడు. కోహ్లీ ఆధ్వర్యంలోని భారత జట్టు టీ20 ప్రపంచ కప్‌ను, వన్డే ప్రపంచ కప్‌ను గెలుస్తుందన్నాడు. సచిన్ అంతర్జాతీయ మ్యాచుల్లో నెలకొల్పిన 100 సెంచరీల రికార్డును కోహ్లీ 2025లోగా అధిగమిస్తాడని జోస్యం చెప్పాడు. 'నేను చెప్పినవన్నీ నిజమవుతాయి. 2025లోగా కోహ్లీ టీ20, వన్డే ప్రపంచకప్‌లు గెలిచి సచిన్ సెంచరీల రికార్డును బద్దలు కొడతాడు' అని బుండె అన్నాడు. 2018లో కోహ్లీ ప్రముఖ సంస్థతో ప్రచారకర్తగా భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంటాడన్నారు. ఈ ఒప్పందాన్ని సచిన్ మార్క్ మస్కారెన్‌హాస్ వరల్డ్ టెల్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో పోల్చితే కోహ్లీ ఒప్పందం విలువ ఎక్కువగా ఉంటుందన్నాడు. 90వ దశకంలో టెండూల్కర్ మంచి ఊపుమీద ఉన్నాడు. మస్కారెన్‌హాస్ సచిన్ దశను మార్చేసింది. సచిన్‌కు సెలబ్రెటీ హోదాను కట్టబెట్టింది. ఆ విధంగా ఈ క్రికెట్ దిగ్గజం మల్టీ మిలియనీర్‌గా మారిపోయాడు. గతంలో సచిన్ టెన్నిస్ ఎల్బో గాయంనుంచి కోలుకొని తిరిగి ఆటలో పుంజుకుంటాడని, అతనికి భారత రత్న పురస్కారం, సౌరబ్ గంగూలీ విశ్రాంతి తర్వాత తిరిగి జట్టులోకి రావడం, 2011లో ప్రపంచ కప్ విజయం, విదేశాల్లో కోహ్లీ జట్టు విజయం సాధిస్తుందని బుండె చెప్పిన జ్యోస్యాలు నిజమయ్యాయి. 'భారత్ ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించింది. వేసవిలో ఇంగ్లండ్‌లో అనంతరం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ప్రస్తుతం, కోహ్లీ అధిష్ఠాన గ్రహం శుక్రుడు బలంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతడు విదేశాల్లో బాగా రాణిస్తున్నాడు. నాకు విశ్వాసముంది. ఆస్ట్రేలియాలో భారత్ బాగా రాణిస్తుంది' అని అన్నాడు. 2006 నుంచి బుండె క్రికెటర్ల భవిష్యత్తును చెపుతున్నాడు. భారత క్రికెటర్లు గంగూలీ, మురళీ కార్తిక్, ఎస్. శ్రీశాంత్, జహీర్ ఖాన్, గౌతం గంభీర్, సురేష్ రైనాలు తమ భవిష్యత్తుకు సంబంధించి బుండె నుంచి సలహాలు పొందారు. ఐపీఎల్‌లో కింగ్స్-11 పంజాబ్ యజమానిగా ఉన్న బాలీవుడ్ నటి ప్రీతి జింటా కూడా ఒకప్పుడు బుండెను సంప్రదించిన వారిలో ఉంది.

అదరగొట్టిన నికోలా

- భారత్ ఓటమి
- మహిళల క్రికెట్



వడోదొరా: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు సిరీస్ ఆరంభ వన్డేలో గెలిచింది. భారత బ్యాట్స్‌మన్లను నిలువరించడంలో ఆస్ట్రేలియా స్పిన్నర్లు అద్భుతంగా రాణించారు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ నికోలా బోల్టన్ 101 బంతుల్లో 100 పరుగులు చేసి నాటౌట్ నిలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను 8 వికెట్ల తేడాతో గెలవడంలో కీలక భూమిక పోషించింది. దీనితో సిరీస్‌లో 1-0 ఆధిక్యాన్ని ఆసీస్ సాధించింది. ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్ తొలి మ్యాచ్ వడోదరాలోని రిలయన్స్ స్టేడియంలో జరిగింది. టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్‌ను ఎంచుకుంది. పూనం రావత్(37), వికెట్ కీపర్ సుష్మావర్మ(41), పూజా వస్త్రాకర్(51) మినహా మిగతావారెవరూ రాణించలేకపోయారు. ఎనిమిదో వికెట్‌కు సుష్మా వర్మ, పూజా వస్త్రాకర్‌ల మధ్య కొనసాగిన 76 పరుగుల భాగస్వామ్యంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 200 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆసీస్ ఎడమచేతి వాటం స్పిన్నర్ జెస్ జొనస్సెన్ అపూర్వ ప్రతిభను చాటి 10 ఓవర్లలో 30 పరుగులిచ్చి 4 వికెట్లను తీసింది. లెగ్ స్పిన్నర్ అమండా జేడ్ వెల్లింగ్టన్ 6ఓవర్లలో 24 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన ఆసీస్ జట్టు రెండు వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి విజయం సాధించింది. ఆసీస్ బ్యాట్స్‌మన్లను నిలువరించడంలో భారత జట్టు బౌలింగ్‌లో ఘోరంగా విఫలమైంది. శిఖాపాండె 7 ఓవర్లు వేసి 38 పరుగులిచ్చి 1 వికెట్ తీసి పరవాలేదనిపించింది. మిథాలీ రాజ్ అనారోగ్యంతో బరిలోకి దిగలేకపోవడంతో హర్మన్ ప్రీత్ కౌర్ జట్టుకు నాయకత్వం వహించింది. భారత్ అన్ని రంగాల్లో విఫలకావటంతో ఓటమిని చవిచూసిందని కౌర్ వ్యాఖ్యానించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును నికోలా బోల్టన్ గెల్చుకుంది. ఈ సిరీస్‌లో రెండో మ్యాచ్ ఇదే మైదానంలో గురువారం జరుగనుంది.

సంక్షిప్త స్కోరు

భారత్ బ్యాటింగ్ 200 ఆలౌట్(50 ఓవర్లలో) (పూనం రావత్ 37, వికెట్ కీపర్ సుష్మావర్మ41, పూజా వస్త్రాకర్51) (ఆసీస్ బౌలింగ్: జెస్ జొనస్సెన్ 30/4, అమండా 24/3), ఆస్ట్రేలియా బ్యాటింగ్: 202/2(32.1 ఓవర్లలో) (భారత్ బౌలింగ్: శిఖా 38/1)

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
మంగళవారం
13 మార్చి 2018

ఈ రోజుల్లో వాట్సాప్ అంటే తెలియని వారుండరేమో!.. ప్రతి కొత్త స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయి ఉంటుంది వాట్సాప్. లేదంటే కొన్న వెంటనే ముందుగా ఫోన్‌లోకి గృహప్రవేశం చేసేది వాట్సాప్. కాబట్టి దాని గురించిన పరిచయం అనవసరం. ఇప్పుడు ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన తక్షణ సందేశ సేవలందించే యాప్... వాట్సాప్ అనడం అతిశయోక్తి కాదు. జనవరి 2009లో మొదట విడుదలైన వాట్సాప్‌కు .. ఇప్పుడు 150 కోట్లకు పైగా యూజర్లున్నారు. వాట్సాప్‌కి పదుల సంఖ్యలో పోటీ మరియు ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ... ప్రస్తుతానికి అత్యంత ప్రజాదరణ పొందింది మాత్రం వాట్సాప్ అని చెప్పక తప్పదు. ఇలాంటి ఎదుగుతున్న, అతి ఉత్తమమైన, ఆకట్టుకొనే, ఆకర్షణీయమైన యాప్‌లపై.. టెక్ దిగ్గజాలైన గూగుల్ , ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ , యాహూలు ఓ కన్నేసి ఉంచుతాయి. ఒకసారి ప్రజాదరణ పొందినా, లేక తమల కంపెనీల మనుగడకు వాటివలన ముప్పు కనిపించినా, తమ ఖజానాకు లాభదాయకమని తెలిసినా.. వెంటనే చెక్కు బుక్‌తో వెళ్లి పోటీ పడి మరీ కొనేస్తాయి. అలా వాట్సాప్‌ను 19 బిలియన్ డాలర్లు ఇచ్చి 2014లో ఫేస్‌బుక్ సొంతం చేసుకుంది. 150 కోట్ల క్రియాశీల యూజర్లు ప్రతిరోజూ దాదాపు 6000 కోట్ల మెసేజ్‌లను దీని ద్వారా పంపుతున్నారు. అనునిత్యం నవీకరణల కోసం పాటుపడే వాట్సాప్ యాజమాన్యం కొత్తగా చాలా ఫీచర్లను అందివ్వబోతున్నారు. అవేంటో చూద్దాం!



వావ్!... వాట్సాప్ ఫీచర్లు!!



➤ అయ్యో కాలేజి స్నేహితులతో పంచుకోవాల్సిన జోకో, మెసేజో పొరపాటున ఫ్యామిలీ గ్రూప్‌లో పెట్టి చూసుకోలేదా? గర్ల్ ఫ్రెండ్‌కి పంపాల్సిన సందేశం పొరపాటున సోదరికో, బాస్‌కో పంపించారా? అయితే ఇపుడు 7 నిమిషాల్లో ఆ మెసేజ్‌ను వెనక్కి తీసుకోవచ్చు. అంటే డిలీట్ చేయవచ్చు. కానీ త్వరలోనే మెసేజ్ డిలీట్ ఆప్షన్ వ్యవధి ఒక గంట 8 నిమిషాలకు పొడిగించే అవకాశాలున్నాయి. ఈ ఆప్షన్‌కి కొన్ని పరిమితులున్నాయి. పెట్టిన మెసేజ్ నిర్ణీత వ్యవధిలో మీరు డిలీట్ చేసేలోగా ఎవరైనా చూడొచ్చు. స్క్రీన్ షాట్ తీసుకోవచ్చు, ఫార్వర్డ్ చేయొచ్చు. అయితే డిలీట్ ఫర్ ఎవరీబడీ లేదా అందరి కోసం తొలగించు'' నొక్కండి. ''ఈ సందేశం తొలగించబడినది'' అని మాత్రం వస్తుంది. దీన్ని బట్టి అందరికి తెలుస్తుంది మెసేజ్ తొలగించినట్టు. కానీ పెద్ద ప్రమాదం ముందు ఇది ఒక లెక్క కాదు కదా.

➤ కొత్తగా గ్రూప్ వాయిస్ కాల్స్, కాన్ఫరెన్స్ కాల్స్‌తో పాటు వాట్సాప్ డెస్క్‌టాప్ ఎడిషన్‌లో /వెబ్‌సైట్ ఎడిషన్‌లో లాగిన్ పేజీలో కూడా ఎన్నో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఐ పాడ్ లో వాట్సాప్ లేకపోవడం దాని యూజర్లందరిని నిరుత్సాహ పరిచింది. దీంతో ఐ పాడ్ కోసం సరికొత్త వాట్సాప్ వెర్షన్ కార్యరూపం దాలుస్తోంది. ఇది సాధ్యమయినంత త్వరలో అందుబాటులోకి రానుంది.

➤ వాట్సాప్ కొత్తగా అభివృద్ధి చేసిన మరో ముఖ్యమైన ఫీచర్ విషయానికి వస్తే... యూట్యూబ్ వీడియో లింక్‌ను ఎవరైనా పంపితే నేరుగా వాట్సాప్ స్క్రీన్‌లోనే దానిని ఓపెన్ చేసుకొని వీడియోను తిలకించడానికి అవకాశముంటుంది. ప్రస్తుతం మనం వాట్సాప్‌లో వచ్చిన యూట్యూబ్ లింక్‌పై క్లిక్ చేస్తే వాట్సాప్ బయటికు తీసుకెళుతుంది. ఈ కొత్త ఫీచర్‌తో యూజర్‌కు ఆ ఇబ్బంది తప్పింది. ఇక వాట్సాప్ కొత్త ఫీచర్లు ఆండ్రాయిడ్, ఐ ఓ ఎస్, విండోస్ మరియు వాట్సాప్ డెస్క్‌టాప్‌లాంటి విభిన్న ఆపరేటింగ్ సిస్టం కోసం వేరువేరు అప్‌డేట్లు వేర్వేరు సమయాల్లో విడుదల చేస్తుంది. ఒక కొత్త ఫీచర్ ఒకసారి ఐఓఎస్‌లో ముందుగా వస్తే మరొకటి ఆండ్రాయిడ్‌లో ముందు వస్తుంది.

➤. వాట్సాప్ గ్రూప్ వివరణ....ఒక యూజర్ సగటున 10 నుంచి 15 గ్రూపుల్లో పాల్గొంటారు. అది ఎల్ కేజీ క్లాస్‌మేట్స్ నుంచి పీజీ క్లాస్‌మేట్స్ వరకు... బంధువులకు వేర్వేరుగా, పాత ఆఫీస్ కోలీగ్స్ నుంచి ప్రస్తుత కంపెనీ కోలీగ్స్, అపార్ట్ మెంట్ వాళ్ళకి ఇలా ఎన్నో గ్రూపులుంటున్నాయి. ఇప్పుడు కొత్తగా గ్రూవు వివరణ.. అనగా ఫ్యామిలీ, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, ప్రొఫెషనల్, ఫైనాన్షియల్ లాంటి గ్రూప్‌ల యొక్క ఉద్దేశ్యం తెలియజేయడానికి ప్రవేశపెడుతున్నారు.



➤ వాట్సాప్ గ్రూప్ పేరు ప్రస్తుతానికి 20 కేరక్టర్స్ కన్నా అనుమతించదు. ఒకే రోజు గ్రూప్‌లో ముగ్గురు జన్మదినాలున్నపుడు అందరి పేర్లు పెట్టి హేపీ బర్త్ డే అని హెడ్డింగ్ మార్చడం కష్టం. ఇప్పుడు స్క్రోలింగ్‌తో పాటు 30 క్యారెక్టర్స్ వరకు పెంచొచ్చు.

➤ వాట్సాప్‌లో అప్పుడప్పుడు మన ప్రమేయం లేకుండా కీ పాడ్ నొక్కుకొని వాయిస్ రికార్డ్ కావడమే కాకుండా..వేరే గ్రూపుల్లోకి పొరపాటున పోస్ట్ అవుతుంటుంది. దీనివల్ల మిగతా గ్రూప్ మెంబర్లకు ఇబ్బంది కలుగుతుంది.దీనిని నివారించేందుకు వాట్సాప్ వాయిస్ రికార్డింగ్ లాక్ ఫీచర్ ఉపయోగపడుతుంది. అవసరమైనపుడు మాత్రమే ఫోన్లో మైక్రోఫోన్ లాక్‌ని ఓపెన్ చేసి, వాయిస్ రికార్డింగ్ చేసి మెసేజ్ పంపొచ్చు.

➤ మనం వాయిస్ మెసేజ్ రికార్డు చేసిన వెంటనే పంపివేయబడుతుంది. లేదా ఒక డమ్మీ గ్రూప్ లో ముందు పెట్టి, దానిని విని నచ్చితే అసలు గ్రూప్‌లో పెట్టొచ్చు. కొత్త ఫీచర్‌లో రికార్డు చేసిన వాయిస్ మెసేజ్ ముందుగా మనం విని సంతృప్తికరంగా ఉంటేనే పంపొచ్చు.

➤వ్యాట్సాప్ గ్రూప్‌లో ఒకరికన్నా ఎక్కువ అడ్మిన్లు ఉండడం సహజం. కానీ ఒక అడ్మిన్ ఇతర అడ్మిన్‌లను లేదా మరొక అడ్మిన్‌ను కొన్ని కారణాల వలన తొలగించాలంటే ముందుగా గ్రూవు నుంచి తొలగించి మళ్లీ గ్రూపులో సాధారణ సభ్యునిగా యాడ్ చేయాలి. గ్రూప్‌ను స్థాపించిన వ్యక్తిని కూడా ఇతర అడ్మిన్ తొలగించడానికి ఆస్కారముంది. కొత్త ఫీచర్లో ఒక అడ్మిన్ మరో అడ్మిన్‌ను లేదా ఇతర అడ్మిన్‌లను గ్రూప్ నుంచి బయటకు పంపకుండా అడ్మిన్ నుంచి సాధారణ సభ్యులుగా చేయచ్చు. మరొక ముఖ్య విషయం ఏ అడ్మిన్ అయినా గ్రూప్‌ను ప్రారంభించిన వ్యవస్థాపకులను అడ్మిన్ నుంచి తొలగించలేరు.

➤ అనునిత్యం నవీకరణల కోసం పాటు పడే వాట్సాప్ యాజమాన్యం కొత్తగా మరో ఫీచర్ అందివ్వనుంది. మన ఫోన్లో హోమ్ స్క్రీన్‌లో ఉండే వాట్సాప్ ఐకాన్‌ని మరింత ఆకర్షణీయంగా మలచుకోవచ్చు. వాట్సాప్ చిహ్నం లేదా ఐకాన్ ఆకారాన్ని వృత్తాకారం, చతురస్రాకారం...లాంటి ఆకారాలకి మార్చడానికి అనుమతిస్తుంది.

➤ వ్యాపారస్తుల కోసం ఈ మధ్య కొత్తగా మొదలు పెట్టిన వాట్సాప్ బిజినెస్.. కొద్ది రోజుల్లోనే ప్రాచుర్యం పొంది, అందరి మన్ననలు చూరగొంది. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్లే ఒక ఫోన్లో రెండు వాట్సాప్ అక్కౌంట్లు సాధ్యం కాదు. డ్యూయల్ సిమ్ ఉన్నా సరే ఇది సాధ్యపడదు. కానీ ఒక ఫోన్లో ఒక మామూలు వాట్సాప్ అకౌంట్ మరొక వాట్సాప్ బిజినెస్ అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చు. రెండు మామూలు వాట్సాప్ అకౌంట్స్ లేదా రెండు వాట్సాప్ బిజినెస్ అకౌంట్స్ కుదరదు. వ్యాపారస్తుల కొరకు వారి బిజినెస్ అవసరాలు లక్ష్యంగా పెట్టుకొని ప్రవేశపెట్టిన వాట్సాప్ బిజినెస్‌లో ఒక ఫోన్ నంబర్ ఉపయోగించి అకౌంట్ సృష్టించవచ్చు. కానీ ఒకే ఫోన్ నంబర్ ఉపయోగించి వాట్సాప్ బిజినెస్ మరియు మామూలు వాట్సాప్ వాడలేరు. ఒక ఫోన్లో ఒక వాట్సాప్ బిజినెస్ ఒక సాధారణ వాట్సాప్ నమోదు చేసుకోవచ్చును. కానీ రెండింటికి వేరువేరు ఫోన్ నెంబర్లు ఉండాలి!



- సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

రెడ్‌మీ-5 స్మార్ట్‌ఫోన్ వచ్చేస్తోంది

సరికొత్త ఫీచర్లతో జియోమి రెడ్ మీ-5 స్మార్ట్ ఫోన్ ఈనెల 14న భారతీయ మార్కెట్లోకి వచ్చేస్తోంది. చైనీస్ కంపెనీ ఇప ్పటికే తన సోషల్ మీడియా ఛానెల్ ద్వారా రెడ్ మి-5 పనితీరును పరిశీలిస్తోంది. ప్రత్యేక ఫీచర్లతో కస్టమర్లను ఆకట్టుకునేలా రానున్న రెడ్ మి-5 స్మార్ట్ ఫోన్ ఫీచర్ల విషయానికి వస్తే...



రెడ్ మీ-5 స్మార్ట్‌ఫోన్ ఫీచర్లు..

- ✶ 5.7అంగుళాల హెచ్‌డీ ప్లస్ ఫుల్ వ్యూ డిస్‌ప్లే
- ✶ 12 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
- ✶ 5 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా విత్ ఫ్లాష్
- ✶ 3300 ఎంఏహెచ్ బ్యాటరీ
- ✶ 1440 X 720 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
- ✶ 2/3 జీబీ ర్యాం, 16/32 జీబీ స్టోరేజ్
- ✶ఫింగర్ ప్రింట్ సెన్సార్ ..తదితర ప్రత్యేకమైన ఫీచర్లతో రెడ్ మీ-5 రాబోతోంది. దీని ధర 6,999 రూపాయలు ఉండవచ్చని అంచనా.

చందమామకో సెల్‌ఫోన్!



భూమి మీద కోట్లాది మంది అల్లుళ్లు స్మార్ట్ ఫోన్ వాడుతుంటే.. పైన ఉండే మామకు కడుపు మండడంలో ఆశ్చర్యం ఏముంది, కాని అడిగితే పెద్దరికం పోతుంది కదా? అందుకే మంటను కడుపులో దాచుకుని,.మనకు మాత్రం చల్లని వెన్నెల అందిస్తున్నాడు మన ముద్దుల చందమామ. మరి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో రాకెట్లా దూసుకెళ్తున్న అల్లుళ్లు మామ మనసులో మాట తెలుసుకోలేరా చెప్పండి. అందుకే ఆయన కోర్కెను తీర్చనున్నారు. వచ్చే సంవత్సరం చంద్రునికి ఓ మొబైల్ ఫోన్ అందించనున్నారు.

వొడాఫోన్ జర్మనీ, నెట్వర్క్ పరికరాల తయారీ సంస్థ నోకియా, కార్ల తయారి సంస్థ ఆడి సంయుక్తంగా ఈ మూన్ మిషన్ కోసం పనిచేస్తున్నాయి. నాసా హ్యోమగాములు చంద్రమండలం మీద నడిచిన 50 సంవత్సరాల తర్వాత..అక్కడ సెల్ ఫోన్ నెట్‌వర్క్ ను ఏర్పాటు చేయనున్నారు. చంద్రుని ఉపరితలం నుంచి భూమిమీదికి పనిచేసే విధంగా 4జీ నెట్వర్క్ రెడీ అయింది. పరీక్షలు జరుగుతున్నాయి. ఏదేమైనా వచ్చే ఏడాది నుంచి చందమామ కూడా సెల్ ఫోన్‌లో భూమిమీద ఉన్న అల్లుళ్లతో మాట్లాడనున్నారు! ఆల్ ది బెస్ట్ చందమామా!

ఎల్జీ నుంచి రెండు కొత్త ఫోన్లు

ఎల్ జీ కంపెనీ రెండు కొత్త స్మార్ట్ ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేయనుంది. కే8(2018), కే 10(2018) పేరుతో ఈనెల 26న బార్సిలోనాలో జరగనున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ -2018 ప్రదర్శనలో ఈ నూతన ఫోన్లను విడుదల చేయనుంది. అయితే ఈ ఫోన్లు యూరోప్, ఆసియా, లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాల మార్కెట్లలో అందుబాటులోకి వస్తాయి. ధర ఎంత అనేది మాత్రం కంపెనీ ప్రకటించలేదు.



ఎల్ జీ కే8(2018) స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

- 5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే
- 8 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
- 5 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా
- 2500 ఎంఏహెచ్ బ్యాటరీ
- ఫింగర్ ప్రింట్ సెన్సార్
- బ్లూటూత్ 4.2
- 4జీ వీవోఎల్‌టీఈ, డ్యూయల్ సిమ్
- 1280 x 720 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
- అండ్రాయిడ్ 7.1.2 నూగట్ ఆపరేటింగ్ సిస్టమ్
- 2 జీబీ ర్యాం, 16 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ (32టీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజీ)
- 2500 ఎంఏహెచ్ బ్యాటరీ

ఎల్ జీ కే8(2018) స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

- 5.3 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే
- 8 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
- 5 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా
- 2500 ఎంఏహెచ్ బ్యాటరీ
- ఫింగర్ ప్రింట్ సెన్సార్,
- బ్లూటూత్ 4.2 4జీ వీవోఎల్‌టీఈ, డ్యూయల్ సిమ్
- 1280 x 720 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
- అండ్రాయిడ్ 7.1.2 నూగట్ ఆపరేటింగ్ సిస్టమ్
- 2/3 జీబీ ర్యాం, 16/32 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ (2టీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజీ)
- 3000 ఎంఏహెచ్ బ్యాటరీ





అర్జునుడితో పాటు పాండవులందరూ తమ స్థితిని గుర్తెరిగి వ్యవహరించిన వారే. రాజ్యం ఉన్నా లేక పోయినా, అడవుల్లో ఉన్నా, భిక్షమెత్తుకోవాల్సి వచ్చినా మానవులుగా విధి రాతకు అనుగుణంగా మసలుకోవాల నుకున్నారే గాని మేము అరివీర భయంకరులం, దేవతాంశతో పుట్టిన వారం అని ఏనాడూ అహంకరించలేదు.

ఉన్న స్థితిని మరచిపోకూడదు

ఎప్పుడూ మనం ఉన్న స్థితిని మరచిపోకూడదు. మహాత్ములు అలానే వ్యవహరిస్తారు. శ్రీరాముడు అలానే వ్యవహరించాడు. ఒక సందర్భంలో దేవతలంతా వచ్చి 'నీవు శ్రీమన్నారాయణుడివి. ఇది రామావతారం అన్నా ఆయన **ఆత్మానం మానుషం మన్యే...** అంటూ అదంతా నాకు తెలియదు నేను దశరథ కుమారుడిని మాత్రమే అన్నాడు. అర్జునుడితో పాటు పాండవులందరూ అలా వ్యవహరించిన వారే. రాజ్యం ఉన్నా లేకపోయినా, అడవుల్లో ఉన్నా, భిక్షమెత్తుకోవాల్సి వచ్చినా మానవులుగా విధి రాతకు అనుగుణంగా మసలుకోవాలనుకున్నారే గాని మేము అరివీర భయంకరులం, దేవతాంశతో పుట్టినవారం అని ఏనాడూ అహంకరించలేదు. ఒకసారి అర్జునుడు ఇంద్రునితో కలిసి స్వర్గానికి వెళ్ళాడు. అక్కడవారు అర్జునుని ఎంతో ఆదరంతో చూచారు. ఆయన అస్త్ర శస్త్రా పాటవాన్ని కొనియాడారు. ఇంద్రుడు ఆర్జునుని సేవకు ఊర్వశిని నియోగించాడు. ఊర్వశి అత్యుత్సాహం ప్రదర్శించింది. అత్యుత్సాహం ప్రమాద హేతువు. పూర్వం సగరుడు అశ్వమేధ యాగం చేస్తూండగా దానికి విఘ్నం కలిగించాలనే ఉద్దేశంతో ఇంద్రుడు ఆ యాగాశ్వాన్ని మాయం చేశాడు. అయితే దానిని వెతుక్కుంటూ తన వద్దకు రావచ్చని దానిని తీసికెళ్ళి మహాతపస్వి అయిన కపిల మహాముని ఆశ్రమం వద్ద కట్టి వేశాడు. దానిని వెతుక్కుంటూ వచ్చిన సగర కుమారులు 60 వేల మంది ఆ యాగాశ్వాన్ని కపిల ముని ఆశ్రమం వద్ద చూశారు. ముందూ, వెనుకా ఆలోచించకుండా వెంటనే అతనే తమ అశ్వాన్ని అపహరించాడని అత్యుత్సాహంతో అతనిని శిక్షించదలచి అరుస్తూ ముందుకు దూకారు. ఈ కలకలానికి కపిలునికి తపోభంగమయింది. తనపైకి క్రోధావేశాలతో వస్తున్న వారిని చూశాడు. ఒక్క హుంకారంతో వారినందరినీ భస్మం చేశాడు. తర్వాత చాలా కాలానికి వారికందరికీ ఉత్తమ గతులు లభించేందుకు భగీరథుడు శివుని, గంగా దేవిని ప్రసన్నం చేసుకుని భాగీరథీ జలాలను ఆ భస్మ రాశులపైగా ప్రవహించేట్లు చేశాడు. తద్వారా వారికందరికీ పుణ్యగతులు లభించేలా చేశాడు. అదంతా వేరే కథ. అత్యుత్సాహం అంతపని చేయిస్తుందనేందుకు ఇది ఉదాహరణ. ఇక్కడ ఊర్వశి అర్జునుడు ఎలాంటివాడో తెలుసుకోలేదు. అతను

మహాభారతంలో చిన్న కథలు


అందమైనవాడు. తను అద్భుత సౌందర్యవతి. సర్వాలంకార భూషితయై అర్జునుని దగ్గరకు వెళ్ళింది. అర్జునుడు ఆమెను చూసి 'అమ్మా! నా కోసం వచ్చినందుకు ఇవిగో నా నమస్సులు స్వీకరించండి' అన్నాడు. దానికి ఆమె 'ఓ మనోహరా! నీ గురించి నాకు చాలా తెలును. నీ కోసం పనిగట్టుకు వచ్చాను. నీకు సేవ చేయమని ఇంద్రుడు నన్ను పంపాడు. నీవేమిటి అమ్మా అని పిలుస్తున్నావు' అని ఆగ్రహంతో అడిగింది. దానికి అర్జునుడు 'అమ్మా! మీరేమో దివ్యులు, స్వర్గనివాసులు. నేను నరలోకంలో ఉండేవాడిని. కేవలం అతిథిగా వచ్చాను' అని బదులిచ్చాడు. దానితో ఊర్వశి మండి పడింది. 'నేను వలచి వస్తే నీవు నపుంసకుడిలా వ్యవహరిస్తున్నావు కనుక, నపుంసకుడివైపో' అని శపించింది. దానిని అజ్ఞాతవాస సమయంలో ఉపయోగించుకోమని ఇంద్రుడు సలహా ఇచ్చాడు. అసలు ఇంద్రుడు అర్జునుని సేవించమని ఊర్వశిని పంపడంలో అంతరార్థం ఇలా జరుగుతుందని అజ్ఞాతవాసంలో అర్జునునికి అది ఉపయోగిస్తుందనే అయి ఉంటుందని అది దైవేచ్ఛేనని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇంద్రుడు అర్జునునికి సాయం చేయడం ఉన్నదే. కర్ణుడు అర్జునుని చేతిలో హతమయ్యేందుకు వీలుగా అతని కవచ కుండలాలు అడిగి తీసుకున్నాడు. ఇదీ అటువంటిదేనని వారి అభిప్రాయం. పురాణ ఇతిహాస వాఙ్మయంలో చాలా శాపాలు వరాలుగా, దైవేచ్ఛ ననుసరించే జరిగాయనే విషయం తెలిసిందే. అజ్ఞాతవాసంలో అర్జునుని రూపం మారాలి. పాండవులలో మిగతా నలుగురూ ఏదో రూపాలతో గడపగలవారే. ఒక్క అర్జునుణ్ణే మారువేషంలో ఉన్నా ఎక్కువ మంది పసిగట్టే అవకాశం ఉంది. అందుచేత అర్జునునికి ఆ రూపం వచ్చేలా చేశాడు. అర్జునుడు స్వర్గానికి వెళ్ళినా తన స్థితిని మరువలేదు. తాను మానవుడిననే విషయం అక్కడా గుర్తు చేశాడు. దేవత లను ఏ విధంగా చూడాలో, ఏ విధంగా వారిని గౌరవించాలో అక్కడా అదే పాటిం చాడు. తాను ఇంద్ర కుమారుణ్ణని అహంకరించలేదు. శాపం వచ్చినా అన్నిటికీ కృష్ణుడే ఉన్నాడని అనుకున్నాడు. ఈశ్వరార్పణగా కష్టాన్ని స్వీకరిస్తే అది మంచేచేస్తుంది అన్న నీతి కూడా దీనిలో ఉంది.

- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

దేశాంతరగతులు



శ్రీరమణాశ్రమం
12-7-47

చాలాకాలం నుంచీ భక్తుడుగా ఉంటూ వున్న బెంగాలు దేశస్థుడగు అరవిందబోసుకు ఒకే కొడుకు, ఒకే కూతురు ఉండేవారు. చెట్టల్లే పెరిగిన కొడుకు 18 ఏండ్లయినా నిండకుండా గతించాడు. అది కారణంగా అతను ఖిన్నుడై ఆ ఖిన్నత పోగొట్టుకునే నిమిత్తం భగవాన్నప్పుడప్పుడు ఏదైనా ప్రశ్నిస్తూ ఉండేవాడు. ఈరోజున కూడా ఏదో ప్రశ్నించాడు. అందులోనూ ఆ విచారం వ్యక్తమౌతూనే ఉన్నది. భగవాన్ యథాప్రకారం నిన్ను నీవు తెలుసుకొమ్మనే బోధ చేశారు. అతనికింకా తృప్తి కాలేదు. భగవాన్ ''విచారసాగరంలో ఒక కథ ఉన్నది. చెప్తాను వినం''డని ఇట్లు సెలవిచ్చారు.

''రాముడు, కృష్ణుడు అనే యువకులిద్దరు విద్యాభ్యాసమొనరించి విశేషధనం ఆర్జిస్తామని వారి వారి తల్లిదండ్రులకు చెప్పి, విదేశమునకు వెళ్లారు. కొన్నాళ్లకు ఒకడకస్మాత్తుగా మరణించాడు. ఒకడు విద్యాభ్యాసమొనరించి విశేష ధనార్జనాపరుడై సుఖంగా ఉన్నాడు. ఆ వెనుక కొన్నాళ్ళకు ఒక వర్తకుడక్కడ నుండి బయలుదేరి వీరి తల్లిదండ్రులున్న దేశానికి వెడుతుంటే, జీవించియున్నవాడు, తన తండ్రికి తాను ఐశ్వర్యవంతుడై సుఖంగా ఉన్నాననీ, తనతో వచ్చినవాడు గతించాడనీ చెప్పి పంపాడు. ఆ వర్తకుడట్లు చెప్పక, బ్రతికున్నవాని తల్లిదండ్రులతో మీవాడు గతించాడనీ, గతించినవాని తల్లిదండ్రులతో మీవాడు విశేషంగా ధనం సంపాదించి, సుఖంగా ఉన్నాడనీ చెప్పాడు. గతించివాని తల్లిదండ్రులు అబ్బాయి వస్తాడని సంతోషిస్తున్నారు. ఉన్నవాని తల్లిదండ్రులు పోయినాడని దుఃఖిస్తున్నారు. వాస్తవానికి వారి కొడుకును వారూ చూడలేదు. వీరి కొడుకును వీరూ చూడలేదు. ఎక్కడో ఉన్నాడనీ, పోయినాడనీ హర్షశోకాలను అనుభవించారు. అంతే, ఆ దేశం వెళ్లి చూస్తే గదా యథార్థం తెలియటానికి. మనమూ అంతే. మనస్సు చెప్పే అవకతవక మాటలు నమ్మి ఉన్న వస్తువు లేనిదిగా, లేని వస్తువు ఉన్నదిగా తలచి భ్రమిస్తాం. మనస్సు మాటలు నమ్మక హృదయంలో ప్రవేశించి ఉన్న కుమారుని చూస్తే బయటి బిడ్డలతో పనిలేదు''.

ఒక సంవత్సరం క్రిందట బొంబాయి రాష్ట్రంలోని రాణి ఒకామె వచ్చింది. ఉత్తమ ఇల్లాలు. బిడ్డల తల్లి. ఆమె భర్త విదేశాలలో వుంటూ ఉన్నాడు. ఎంతో ధైర్యవతి కానీ, ఆ లోటు మనస్సులో ఉండదా? భగవాన్ దర్శనం వల్లా, వారి బోధవల్లా శాంతి లభించగలదని వచ్చిందనుకున్నారంతాను. దానికి తార్కాణంగా ఏం జరిగిందనుకున్నావు! మురుగనార్ భగవానుని గురించి అరవంలో పాటలూ, పద్యాలూ చాలా వ్రాశారని విని, మంచివి కొన్ని చదివించి, ఇంగ్లీషులో తర్జుమా చేయించమని స్నేహితురాలి ద్వారా శ్రీవారితో మనవి చేసింది.

భగవాన్ ''నాకేం తెలుస్తుంది. మురుగనారునే అడుగుట మంచిది'' అని ముందు ఛలోక్తిగా అన్నారేగాని, మధ్యాహ్నం రెండున్నరకు నేను వెళ్లేసరికి పుస్తకంలో పుటలు తిప్పుతూ గుర్తులు పెట్టి, సుందరేశయ్యరుకు చూపుతున్నారు. ఆ కరుణకు ఆశ్చర్యపడుతూ కూర్చున్నాను. భగవాన్ నా వైపు చూచి, 'ఆ రాణి మురుగనార్ పాటల్లో మంచివి ఏరి ఇంగ్లీషులో చెప్పించమని కోరింది. వారు వ్రాసిన 'సన్నిధిమురై' అనే ఈ పుస్తకంలో భృంగసందేశమనే ఒక భాగం ఉన్నది. ఆ భాగంలో ముఖ్యమైనవి గుర్తులు పెట్టాను. నాయికా నాయకభావం. మనస్సు నాయిక, రమణుడు నాయకుడు. తుమ్మెద (నిశ్చలాత్మక బుద్ధి) చెలికత్తె, గుర్తుపెట్టిన ఈ పాటల సారాంశమేమంటే, నాయిక తన చెలితో 'నా రమణుడు ఎటో మాయమైనాడు. వెతుక్కొని రావే'' అంటే, తుమ్మెద నాయికతో ఇట్లా అంటుందట. 'ఓ అమ్మా, నీ రమణుడు నీలోనే ఉంటే నన్నెక్కడ వెతకమంటావు. ఎపుడైనా వేడిగా ఆహారం యిస్తే అయ్యో, నా రమణుడు, నా నాథుడు హృదయంలో ఉన్నాడే, ఈ వేడికి కాగిపోడా? అనేదానవే. ఇప్పుడు నన్నెక్కడో వెతకమంటావేమి? నీ నాథుడు నీలోనే ఉంటే నేనెక్కడ వెదికేదీ? ఈ భ్రాంతి వదలి నీలో ఉన్న నీ నాథుని కలుసుకొని శాంతించు' అని తుమ్మెద చెప్పిందట. ఇదీ ఆ పాటల సారాంశం ఇవైతే మంచిదని గుర్తులు పెట్టాను. పాపం, భర్త ఎక్కడో ఉన్నాడు. మనస్సుకు కించ. ఆమె చిత్తవృత్తిననుసరించి చెప్పవలసి ఉన్నది. అందుకని అనుగుణ్యంగా ఉంటవని చూచా'' నన్నారు.

ఇంతలో రాణి వచ్చింది. లోకమ్మచేత పాటలు పాడించి, రామచంద్రయ్యరు చేత ఇంగ్లీషులో అర్థం చెప్పించారు. ఆమెకు తృప్తి కలిగింది. దూరమందున్న భర్తకై దుఃఖించక మనస్సును అంతర్ముఖం చేస్తే, ఆత్మేశ్వరుడు సదా సన్నిహితుడై ఉంటాడని భగవాన్ ఈ పాటల నెపంతో బోధించారని అంతా అనుకున్నాము.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

వీటికి శేషం ఉండకూడదు

శత్రు శేషం ఉండకూడదనే మాట కథల్లో వింటుంటాం. శత్రు శేషం ఉండకూడదని రాజులు తమ శత్రువులను ఒక్కరినీ మిగలకుండా చంపేసారని కథల్లో ఉంటుంటుంది. అయితే శత్రు శేషం ఉండకూడదనేది ఒక సుభాషితంలోని భాగం మాత్రమే. ఏమాత్రం శేషం లేకుండా పూర్తి చేయవలసినవి ఇంకా ఉన్నాయి. ఆ పూర్తి సుభాషితం ఇది.

అగ్ని శేషం రుణః శేషం శత్రు శేషం తథైవచ
పునః పునః ప్రవర్ధేత్ తస్మాత్ శేషం నకారయేత్

దీని అర్థం నిప్పు, రుణం, శత్రువును మిగల్చకూడదని. అలా వదిలేస్తే అవి పెరిగే అవకాశం ఉంది కనుక వాటిని నిశ్శేషం చేయాలని దీని అర్థం.

ఈ సుభాషితంలోని అంశాలు నిజ జీవితంలో తారసపడేవే. చాలా మందికి అనుభవంలోకి వచ్చేవే. అగ్నిని పూర్తిగా ఆర్పక నిర్లక్ష్యం చేస్తే అది ఇంటిని కాల్చివేస్తుంది. చాలా అగ్ని ప్రమాదాలకు కాల్చి పడేసిన సిగరెట్లు, సరిగా ఆర్పకుండా వదిలేసిన పొయ్యిలు కారణమైన సందర్భాలు ఉన్నాయి. నిజానికి నిప్పు ఎంతో మేలు చేస్తుంది. అది మనకు జీవనాధారం. ఉదయం లేచినది మొదలు ఆహారం వండడానికి ఇంకా ఎన్నో పనులకు నిప్పు ఎంతో అవసరం. సనాతన ధర్మంలో అగ్నితో చేసే హోమాలు, యాగాలు ఎంతో ప్రముఖమైనవిగా పేర్కొన్నారు. అగ్నికి ఏకంగా దేవుడే ఉన్నాడు. అయితే ఆ నిప్పును నిర్లక్ష్యం చేస్తే మాత్రం అది కాల్చివేస్తుంది.

అలాగే రుణ శేషం ఉండకూడదనేది ఆ సుభాషితంలోని మరో హితవు. రుణం తీసుకోవడం ఈ రోజుల్లో సర్వ సాధారణం. బ్యాంకులు ఇస్తుంటాయి. డబ్బు అవసరాలు అందరికీ ఉంటాయి. గతంలో వడ్డీ వ్యాపారులుండేవారు. వారు ప్రజలకు రుణం ఇచ్చి హెచ్చు వడ్డీలు వసూలు చేసి కట్టకపోతే ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటివి చేసేవారు. తీసుకున్న రుణాన్ని తీర్చకపోతే అసలుపై వడ్డీ పెరిగిపోతూంటుంది. కొంత కొంతగా తీర్చి వదిలేస్తే అది పెరిగిపోతూంటుంది. ఈ రోజుల్లోనూ వడ్డీ పెరిగే రుణాలు ఉన్నాయి. అలా కాకుండా ఉండేందుకు రుణ శేషం ఉంచుకోకూడదనేది ఈ సుభాషితం చెబుతోంది.


ఇక శత్రు శేషం విషయానికి వస్తే అడవుల్లోకి పారిపోయిన రాజులు తరువాత బలపడి సైన్యాన్ని సమకూర్చుకుని తమ రాజ్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారన్న కథలు వింటుంటాం. అటువంటి వాస్తవ సంఘటనలు కూడా ఉన్నాయి.



జీవితానుభవాన్ని, నిజజీవితంలోని సంఘటనల్ని కాచి వడపోసి ఈ సుభాషితాల్ని రూపొందించినట్లు కనిపిస్తుంది. ఇక ఇది కాక ఏ పనైనా పూర్తిగా చేయడం చాలా మంచిది. ఏ పనైనా మొదలుపెట్టినపుడు ఆర్భాటంగా, ఆసక్తిగా దానిని చేపట్టి ఆ తర్వాత దానిని వదలివేయడం ఒక్కోసారి జరుగుతూంటుంది. మొదట ఉన్న ఆసక్తి, ఉత్సాహం ఆ తర్వాత ఉండకపోవచ్చు. ఏ పనినైనా వీలయినంతవరకూ మిగల్చకుండా చేస్తే అది పూర్తయిపోతుంది. రేపటి పని ఈ రోజే చేయి అనేది మరో రకమైన నీతి వాక్యం. దాని నుంచి పుట్టినదే ఆలస్యం అమృతం విషం. ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమైపోతుందని దీని అర్థం. అందుచేత శేషం వదలకూడదు. ఆలస్యం చేయకూడదు.

ఇలా ఎన్నో సుభాషితాలు, నీతి వాక్యాలు,నీతి కథలు, విధి, నిషేధాలు మన వాఙ్మయంలో ఉన్నాయి. తర తరాలుగా భారతీయులని జాగ్రత పరుస్తూ, మార్గదర్శనం చేస్తూ అవి నేటికీ నిత్యసత్యాలుగా కొనసాగుతున్నాయి.

భగవద్గీత



పరమోత్కృష్టం అవ్యక్త ప్రకృతి

అధ్యాయం 8
శ్లోకం 20

పరస్తస్మాత్తు భావోన్యో
వ్యక్తో వ్యక్తాత్ సనాతనః।
యః స సర్వేషు భూతేషు
నశ్యత్సు న వినశ్యతి ॥

తాత్పర్యం

వ్యక్తావ్యక్తమయ్యే ఈ భౌతిక ప్రకృతి కన్న పరమైనది, శాశ్వతమైనది అగు అవ్యక్త ప్రకృతి వేరొక్కటి ఉంది. అది పరమోత్కృష్ణము, నాశరహితము అయియున్నది. ఈ జగము నందు గల సమస్తం నశించినా అది మాత్రం యథాతథంగా నిలిచి ఉంటుంది.

భాష్యం

శ్రీకృష్ణుని ఉన్నతమైన ఆధ్యాత్మిక శక్తి దివ్యమైనది, శాశ్వతమైనది. ఇది భౌతిక శక్తి యొక్క మార్పుచేర్పులకు అతీతమైనది. భౌతిక శక్తి బ్రహ్మ యొక్క రాత్రి సమయములో నశింపజేయబడి, పగలు సమయంలో తిరిగి సృష్టించబడుతుంది. అయితే ఆధ్యాత్మిక శక్తి దానికి విరుద్ధముగా దివ్యమైన శాశ్వతమైన లక్షణాన్ని కలిగి ఉంటుంది. భగవంతుని ఉన్నత, నిమ్న శక్తులను గురించి గడచిన అధ్యాయంలో మనం చర్చించుకున్నాము.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. దూరప్రయాణాలు, విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయమార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాలు, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి.. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు, వాహనకొనుగోళ్ళు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా



నిద్రలేమిని జయించండి

ప్రపంచంలో అందరికన్నా అదృష్టవంతుడు ఎవరంటే ఎక్కడున్నా గాఢంగా నిద్రపోయేవాడు. ఆధునిక యుగంలో నిద్రకూడా బంగారమయ్యింది. నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య ప్రపంచంలో రోజురోజుకి పెరుగుతోంది.

సరైన నిద్రవల్ల శరీరంలోని జీవక్రియలు సక్రమంగా సాగటంతోపాటు శరీరం కూడా విశ్రాంతి పొందుతుంది.

మంచి నిద్ర మెదడుకు చురుకుదనాన్ని ఇచ్చి అభివృద్ధికి తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు, వైద్యులు గుర్తించారు.

నిద్రలేమి వల్ల అనేక శారీరక, మానసిక రుగ్మతలు పెరుగుతాయి. సరయిన సమయానికి నిద్రపోక నానా యాతన పడేవారు ఎందరో ఉన్నారు. సమయానికి తినాలి. సరయిన సమయానికి నిద్రపోవాలి. తిన్న తర్వాత కనీసం ఒక గంటపాటు నడిస్తే మంచిది. తిన్న వెంటనే నిద్రపోతే అసౌకర్యంగా ఉండి నిద్రపట్టదు.

గురక మంచిది కాదు

ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి. స్థూలకాయం ఉన్నవారు గురకపెడతారు. పడుకున్నప్పుడు పొట్టభాగం పైకి రావడం వల్ల ఒత్తిడి పెరిగి గట్టిగా ఊపిరి తీసుకోవాల్సి రావడం వల్ల శబ్దం వస్తుంది. ఒక్కోసారి ఊపిరి అందక నిద్రలో లేచి కూర్చుంటారు. దీనివల్ల నిద్రక ు భంగం కలుగుతుంది. నిద్ర సరిగ్గా లేక పగలంతా మత్తుగా ఉండి ఎక్కడ కూర్చుంటే అక్కడ నిద్రపోతారు. ఒక్కోసారి వాహనం నడుపుతున్నప్పుడు క ూడా నిద్ర వస్తుంది. ఇలా నిద్రలో జోగేవారికి స్లీప్ ఆప్నియా అనే జబ్బు వచ్చినట్టు వైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి సోకిన వారు పగలంతా నీరసంగా ఉంటారు. గుండె జబ్బులు కూడ వస్తుంటాయి. వీరు సీసమ్ మిషన్ ఉపయోగిస్తే హాయిగా ఊపిరి తీసుకుంటారు. ఈ మిషన్ వాడడం వల్ల రాత్రిప ూట బాగా

నిద్రపోతారు. ఇది కూడా ఉపయోగపడకపోతే 'ఊలో పలోటా పోర్నోగ్రఫీ' సర్జరీ చేయాల్సి ఉయుంది.

ప్రతి ఒక్కరూ ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి. నిద్రలేమిని ఇన్‌సోమ్నియా అంటారు. ఇది మంచిది కాదు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలి. రాత్రిపూట లైట్ ఫుడ్ తీసుకోవాలి. తిండికి నిద్రకు మధ్య వ్యవధి కనీసం రెండు గంటలు తీసుకోవాలి. డిన్నర్ తర్వాత కొద్దిసేపు వాకింగ్ చేయడం మంచిది. గురకను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. వైద్యుల సలహా ప్రకారం చికిత్స పొందాలి.

గురక ఉన్న స్థూలకాయులు నిర్లక్ష్యం చేయకుండా బరువు తగ్గాలి. మంచి ఆహార అలవాట్లు ఉండాలి. మంచి డైట్‌తో పాటు పాలిసోమియాగ్రఫీ అనే పరీక్ష చేయించుకోవాలి. ఈ టెస్ట్ 7 గంటలపాటు జరుగుతుంది. ఎన్నిసార్లు నిద్ర లేస్తున్నారు అనేది తెలుస్తుంది. ఈ పరీక్ష ఒకప్పుడు హైదరాబాద్‌లో మాత్రమే ఉండేది. ఇప్పుడు అన్ని ముఖ్య కేంద్రాల్లో ఉంది. గురక ఉన్నవారు ఇఎన్‌టి స్పెషలిస్ట్, పల్మొనాలజిస్ట్‌లను కలిసి వైద్యం పొందాలి.

నిద్ర మనశ్శాంతిని కలుగజేస్తుంది. నిద్రలేకుండా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి. ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది. ఇంతటి ప్రాధాన్యమున్న నిద్రకు ఈ కాలంలో పెద్దగా ప్రాధాన్యమివ్వడం లేదు. యాంత్రిక జీవనంలో క్షణ క్షణం ఒత్తిడితో గడుపుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నిద్రపోవడం, తిరిగి వేకువజామునే లేచి దైనందిన జీవితం ప్రారంభించడం ఎక్కువమందిలో పరిపాటైంది. నిద్ర ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య

సంస్థ ప్రతి ఏడాది మార్చి మూడో శుక్రవారాన్ని అంతర్జాతీయ నిద్ర దినోత్సవంగా ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఒక్కో నినాదాన్ని విడుదల చేస్తోంది. మానవుడికి నీరు, ఆహారం, ప్రాణవాయువు ఎంత అవసరమో నిద్ర అంతే అవసరం. సగటున మానవుడు ఆరు నుంచి ఎనిమిది గంటల నిదపోవాలి. కానీ ఇంతకు తగ్గినా, పెరిగినా



కొన్ని వ్యాధులకు దారితీస్తుంది. నిద్రలేమితనాన్ని ఇన్‌సోమ్నియా, అతి నిద్రను హైపర్ సోమియాగా వైద్య భాషలో పిలుస్తుంటారు. ఈ రెండు ప్రమాదకర వ్యాధులే. నిద్రలేమి కారణంగా 35 శాతం ఊబకాయం, 54 శాతం డయాబెటీస్, 80శాతం గుండెపోటు, 90శాతం మానసిక వేదన, 98శాతం ఎక్యూట్ కరొనరి సిండ్రోమ్, 102శాతం పక్షవాతానికి దారితీయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

నిద్రలేమితో ప్రమాదాలు

నిద్రలేమి కారణంగా ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా 71వేల రహదారి ప్రమాదాలు జరుగుతున్నట్టు వెల్లడైంది. అలాగే 1550 మంది ఈ ప్రమాదాల్లో మృతి చెందినట్లు సర్వేల ద్వారా లెక్కలు తేల్చారు.

నిద్రలేమి నిర్ధారణ

నిద్రపట్టడం కష్టంగా వుండటం, రాత్రివేళల్లో ఉలిక్కిపడి లేవడం, మానసిక ఆందోళన, వేకువజామునే లేవటం, నిద్ర నుంచి లేచిన తర్వాత తీవ్ర బడలిక నిద్రలేమి ప్రాథమిక లక్షణాలుగా గుర్తించాలి. అలాగే తీవ్రమైన తలనొప్పి అలసట చికాకు నిద్రలేమిగా గుర్తించాలి.

చికిత్స

నిద్రలేమి సమస్య నుంచి ఉపశమనం పొందేందుకు వైద్యనిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ప్రధానమైనవి ఇలా ఉన్నాయి.

- ప్రతి రోజు ఒక నిర్దిష్ట సమయానికి నిద్రపోవటం, తిరిగిలేవటం అలవాటు చేసుకోవాలి.
- పగలు నిద్రపోయే అలవాటుంటే అది 45 నిమిషాలకు మించకూడదు.
- నిద్రపోయే ముందు మద్యపానం, ధూమపానం చేయకూడదు.
- టీ, టిఫిన్, సోడా, చాక్‌లెట్స్ తీపి పదార్థాలు నిద్రకు ముందు తీసుకోకూడదు.
- నిత్యం వ్యాయామం చేయడం అత్యవసరం.
- రాత్రి పదిగంటలకు నిద్రకు ఉపక్రమించి ఉదయం ఐదు గంటలకు లేవడం మంచి ఆరోగ్యానికి దారితీస్తుంది.
- నిద్రపోయే గదిని మంచిగా తమకు నచ్చిన విధంగా అలంకరించుకోవడం అవసరం.
- గది, వెలుతురు ఉష్ణోగ్రత అనుకూలంగా ఉండాలి.
- నిద్రకు భంగం కలిగించే వాటిని శబ్దం , వెలుతురుకు దూరంగా ఉండాలి.
- విశ్రాంతి గదిని నిద్రకు మాత్రమే ఉపయోగించాలి. అంతేకాని ఆఫీసు పనులకు, టీవీ, వీడియోగేములు, ఇంటర్నెట్ ఛాటింగ్‌లకు వినియోగించకూడదు. ఇవి నిద్రా భంగానికి దారితీస్తాయి.



డాక్టర్ నళిని
కన్సల్టెంట్ పల్మొనాలజిస్ట్
కాంటినెంటల్ హాస్పిటల్స్


ఇన్‌హేలేషన్ థెరపీతో ఆస్థమాపై విజయం

35 సంవత్సరాల గృహిణి తన ఐదేళ్ల కుమార్తె చేత మాత్రలు మింగించడం, జీవితాంతం ముందు జాగ్రత్తలు తీసుకునే పరిస్థితి. అయితే ఇన్‌హేలేషన్ థెరపీని ఎంచుకున్న తర్వాత ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుటపడింది. నోటి ద్వారా తీసుకునే మాత్రలు, సిరప్‌లకు బదులుగా

డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం భారతదేశం సుమారు 20 మిలియన్‌ల ఆస్తమా రోగులకు కేంద్రంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఆస్థమా ప్రాబల్యం పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు.

మనుష్యుల వాయునాళాల్ని ఆస్థమా సంకోచించేలా చేయదు. సిద్దాంతపరంగా ఊపిరితిత్తుల్లో వాయు మార్గాలు వాపు కారణంగా ఆస్థమా కలుగుతుంది. వాయుమార్గాల్లో నరాల చివర్ల సంవేదనశీలతపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల చికాకు కలుగుతుంది.

ఆస్థమా ఉన్న వ్యక్తి వాయు మార్గాల గోడల చుట్టూ ఉన్న కండరాలు బిగుతుగా మారి, వాయుమార్గాల్ని సంకోచించేలా చేస్తాయి. ఇది వాపుకు జిగట వంటి శ్లేష్మం ఉత్పత్తి కావటానికి దారితీస్తుంది. వాయుమార్గాలు సన్నగా ఇబ్బందికి గురయ్యేలా చేసి ఆస్థమా లక్షణాలకు దారితీస్తుంది.



సూర్య చెస్ట్ క్లీనిక్ చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం "ఆస్థమా అత్యధికంగా బాల్యంలోనే ఏర్పడినా కూడా అన్ని వయస్సుల వారికి కలుగుతుంది. చాతీ బిగింపు, దీర్ఘకాలిక దగ్గులతో పాటు ఊపిరి అందని పరిస్థితి, పిల్లికూతలు తరచుగా కలిగినప్పుడు ఆస్థమాని సూచిస్తుంది. ఆస్థమా నయం కాని వ్యాధి కానీ మందులు, ఆస్థమా ప్రేరేపకాల్ని నివారించటం ద్వారా సులభంగా నిర్వహించవచ్చు. తద్వారా రోగులకు వ్యాధిపై నియంత్రణ కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై ప్రభావం చూపిస్తున్న సాధారణ వ్యాధుల్లో ఆస్థమా ఒకటి. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో 18 ఏళ్లకంటే తక్కువ వయస్సు గల వ్యక్తులు ఆసుపత్రులలో చేరడానికి మూడో అతిపెద్ద కారణంగా నిలిచింది. చాలామంది రోగుల్లో ఆస్థమా ప్రభావవంతంగా నియంత్రించబడటం లేదని నిపుణులు గమనించారు. ఇది రోజు లక్షణాలుగా కనిపిస్తోంది. రోజువారి కార్యకలాపాల్ని పరిమితం చేస్తోంది. క్రమబద్ధంగా నోటి ద్వారా మందులు తీసుకున్నా కూడా వ్యాధి అద్వాన్నంగా మారుతోంది. ఇటీవలి కాలంలో తక్కువ దుష్ప్రభావాలు, వేగవంతమైన చర్యల వల్ల నోటి ద్వారా తీసుకునే మందులకంటే ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ అందరూ ప్రాధాన్యతనిస్తున్న చికిత్సా విధానంగా మారింది" అని అన్నారు.

వెన్ను నొప్పికి ఆయుర్వేదంతో పరిష్కారం


ఈ మధ్య చాలామందిని వేధిస్తున్న సమస్య మెడ,నడుము నొప్పి. ఒకప్పుడు వృద్ధుల్లో మాత్రమే కనిపించే సర్వైకల్ స్పాండిలోసిస్, సయాటికా సమస్యలు ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా అందరిలోనూ కనిపిస్తోంది. యుక్తవయసులో వున్నవారు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి ముఖ్యకారణం ఆధునిక జీవనశైలి మార్పులు, మెడ, నడుము నొప్పి అని నిర్లక్ష్యం చేస్తూ పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్, బెడ్‌రెస్ట్ ఫిజియో థెరపీ లాంటి చికిత్సలు తీసుకుంటూ తాత్కాలిక ఉపశమనాన్ని పొందుతూ కాలాన్ని గడిపేస్తున్నారు. ఇలా కాకుండా వ్యాధి తొలిదశలోనే ఆయుర్వేద చికిత్స తీసుకున్నట్లయితే సమస్యను పూర్తిగా నివారించవచ్చును.

ప్రధాన లక్షణాలు

వెన్నునొప్పి సమస్యలు ఉన్నవారికి కొన్ని ప్రధాన లక్షణాలుంటాయి. అవి అన్ని సందర్భాల్లోనూ, అందరిలోనూ ఒకేలా కనిపించకపోవచ్చు. నొప్పి ముందుగా నడుము నుంచి ప్రారంభమై పిరుదులలోకి అక్కడి నుండి తొడల్లోకి అక్కడ నుండి పిక్కలలోకి ప్రవహిస్తూ ఉంటుంది. ఇది సయాటికా నొప్పిలో ప్రధాన లక్షణం. కరెంట్ షాక్ కొట్టినట్లు ఝల్లుమనడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెన్నులో నొప్పి రావడం, ఎక్కువసేపు కూర్చోలేకపోవడం, అరికాలల్లో మంటలు, సూదులతో గుచ్చినట్లుండడం, తిమ్మిర్లు వుండడం, కాళ్లు స్పర్శ తగ్గడం దీని ప్రధాన లక్షణం.

కారణాలు

ఎక్కువ సమయం ఒకే భంగిమలో కూర్చోవడం, నిలబడడం, బరువు లేపడం, ఎక్కువగా ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేయడం, స్థూలకాయం, ఎముకలలో కాల్షియం తగ్గడం మూలాన, వెన్నుపూసల మధ్య ఉన్న కార్టిలేజ్‌లో వచ్చే మార్పులు, వెన్నుపూసల మధ్య డిస్కులు పక్కకు జారడం , వెన్నుపాము నొక్కుకుపోవడం, సయాటికా నొప్పికి అతి ప్రధాన లక్షణం. అలాగే వయస్సు పెరిగే కొద్ది డిస్కులు దెబ్బతినడం జరుగుతుంది. నడుము భాగంలో వుండే వెన్నుపూసలను "లంబర్ వర్టిబ్రే" అంటారు. వీటి మధ్యలో మృదులాస్తితో తయారైన డిస్కులు ఉంటాయి. ఇవి వెన్నుపూసలను తేలికగా కదలడానికి, వంగడానికి, నిలబడడానికి సహాయపడతాయి.



వ్యాధి నిర్ధార

ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీటీస్కాన్ రిపోర్ట్‌లో మెడభాగంలోని సి3-సి4, సి4-సి5, సి5-సి6,సి6-సి7 తో బాటు నడుము భాగంలో ఎల్2-ఎల్3, ఎల్3-ఎల్4, ఎల్4-ఎల్-5, ఎల్5-ఎస్1 మొదలగు డిస్కులు దెబ్బతినడం కనిపిస్తుంది.

చికిత్సా విధానం

మెడ నొప్పి, నడుము నొప్పి సమస్యలకు ఆయుర్వేద శాస్త్రంలో సమగ్రమైన చికిత్సా పద్ధతులున్నాయి. ఇందులో రోగ తీవ్రతను బట్టి, రోగి యొక్క బలాన్ని బట్టి వైద్య విధానం ఆధారపడి ఉంటుంది. ఆయుర్వేద దృష్టిలో ఈ సమస్యలు కఫం, పిత్త, వాతం పెరగడం వల్ల వచ్చేవి. ఆయుర్వేద పంచకర్మ చికిత్సల ద్వారా ప్రకోపించిన దోషాలను సమస్థితిలోకి తెచ్చి శరీర శుద్దిని, అగ్ని బలాన్ని పెంపొందించవచ్చును. విరేచన కర్మ, అనువసన వస్తి, కాషాయ వస్తి, నస్య కర్మ, కటి వస్తి, గ్రీవ వస్తి, యెలకిడి, పొడికిడి, పిండ స్వేదం, నాడీ స్వేదం మొదలగు ఆయుర్వేద చికిత్సల ద్వారా ఎటువంటి పెయిన్ కిల్లర్స్ వాడకుండా పిజియోథెరపీ, ఆపరేషన్ అవసరం లేకుండా వెన్ను నొప్పి సమస్యలను పూర్తిగా నివారించవచ్చును.

డాక్టర్ జి. క్రాంతికుమార్
కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్
హైదరాబాద్
9494675168





మహిళల్లో ప్రోటీన్ కొరత

చాలా మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రోటీన్ లోపాల వల్ల తమ ఆరోగ్యాన్ని చేజేతులారా పాడు చేసుకుంటున్నారు. పురుషులతో పోలిస్తే స్త్రీలు 13శాతం తక్కువగా ప్రోటీన్లు తీసుకుంటున్నారు. ఈశాన్య రాష్ట్రా ల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది.

"ప్రోటీన్ అనేది సూక్ష్మ పోషకాల్లో వస్తుంది. కణాల నిర్మాణంలో ఇది ఎంతో దోహదపడుతుంది. 20 అమినో యాసిడ్‌లతో ప్రోటీన్ ఉత్పత్తి అవుతుంది. వీటిలో 9 మాత్రం తప్పనిసరి. అదనంగా ఉన్న ప్రోటీన్లను శరీరం ఏ మాత్రం తన వద్ద ఉంచుకోదు అని ముంబాయికి చెందిన ప్రముఖ డైటీషియన్ జిగ్నేష్ సేథి అంటున్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి ప్రకారం ఆరోగ్యకర జీవనశైలి వల్ల మహిళలు తమ శరీర బరువును బట్టీ ప్రోటీన్లు తీసుకోవాలి.అంటే కిలోకి ఒక గ్రాము ప్రోటీన్ అవసరమవుతుంది. గర్భిణీగా, బాలింతగా ఉన్న సమయంలో మరింత ఎక్కువగా ప్రోటీన్ తీసుకోవాలి. వివిధ కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రోటీన్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహిళల్లో వ్యాధినిరోధక శక్తి పెరగడానికి ప్రోటీన్ అత్యంత అవసరం. ఎముకలు పటిష్టంగా ఉండటానికి ఇది చాలా అవసరం.

లేబుల్ లేని మందులు వాడొద్దు



ఎలాంటి లేబుల్ లేకుండానే మందుల విక్రయాలు ఉపందుకున్నాయని అటువంటి మందులు వినియోగించడం వల్ల కంటిచూపు కోల్పోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోగుల రక్షణకు సంబంధించి మార్గదర్శక సూత్రాలను తప్పనిసరి అనివారంటున్నారు. దేశవ్యాప్తంగా రెటినల్ వ్యాధులు ముదిరిపోవడానికి ప్రధాన కారణం లేబుల్‌లేని మందుల వల్లేనని వారు తెలిపారు.

పేషెంట్ సేఫ్టీ అండ్ యాక్సెస్ ఇనిషియేటివ్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీజోన్ మిశ్రా మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి ఔషధి పార్క్ యోజన ప్రకటించిన తర్వాత నాణ్యమైన మందులను తీసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. నాణ్యమైన యాజమాన్య వ్యవస్థ కోసం ఫార్మాస్యుటికల్ కంపెనీలు, మెడికల్ ప్రాక్టీషనర్స్ బాధ్యతవహించాలన్నారు. రోగి భద్రతను దృష్టిలో పెట్టుకుని న్యాయపోరాటం చేయడానికి సిద్దంగా ఉన్నట్లు తెలిపారు.

ఇన్ఫెక్షన్

దేశవ్యాప్తంగా రెటీనా వ్యాధులు పెరగడానికి ప్రధాన కారణం లేబుల్ లేని మందులు వినియోగించడమే. దీనివల్ల ఇన్‌ఫెక్షన్ సోకి రెటీనా దెబ్బతింటుంది.

మహేష్ స్టార్‌డమ్ సత్తా


కైరా అద్వానీ

స్టార్ హీరో సత్తా సినిమా రూపకల్పనలోని అన్ని దశల్లో తెలుస్తుంటుంది. సినిమా ప్రారంభోత్సవానికి ముందే జరిగే వ్యాపారం మొదలు....థియేటర్ రిలీజ్, ఆడియో, శాటిలైట్ హక్కులు, విదేశీ, అనువాద హక్కులు అంటూ సినిమాకు అన్ని విధాలా క్రేజ్ తీసుకొస్తుంటుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు స్టార్‌డమ్ అతని కొత్త సినిమా భరత్ అను నేనుతో మరోసారి స్పష్టమవుతోంది. విజన్ ఆఫ్ భరత్ పేరుతో తాజాగా విడుదలైన టీజర్...ఇంటర్నెట్‌లో సంచలనమవుతోంది. టీజర్ విడుదలైన కేవలం 19 గంటల్లో 10 మిలియన్ వ్యూస్ అందుకుంది. రోజు గడవక ముందే అంటే కోటి మంది భరత్ అనే నేను టీజర్‌ను వీక్షించారు. ప్రస్తుతం అది కోటిన్నర వ్యూస్‌కు చేరింది. ఇదంతా మహేష్ స్టార్ డమ్‌కు నిదర్శనం, సినిమాపై ప్రేక్షకులకు ఆసక్తికి దర్పణం. దర్శకుడు కొరటాల శివ రూపొందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుపుకుంటోంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్ లో మహేష్, నాయిక కైరా అద్వానీ యుగళ గీతం పాడుకుంటున్నారు. ఏప్రిల్ మొదటి వారం కల్లా మొత్తం రూపకల్పన కార్యక్రమాలు ముగుస్తాయి. ఏప్రిల్ 20న భరత్ అనే నేను అత్యధిక థియేటర్‌లలో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటోంది.


మహేష్‌బాబు

మెగాస్టార్ ముఖ్యఅతిథిగా రంగస్థలం వేడుక


రామ్‌చరణ్

రామ్‌చరణ్, సమంత నాయకానాయికలుగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న రంగస్థలం చిత్రం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఈ నెలాఖరులో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఈ నెల 18న విశాఖపట్టణంలోని ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరు కానున్నారు. అలాగే పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేయనున్నారు. వేడుకలో సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ నేతృత్త్వంలో సంగీత కార్యక్రమంతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటుచేశారు.

విద్యార్థులకు బాగా కనెక్ట్ అయ్యే కిరాక్ పార్టీ

- అనిల్ సుంకర



వినోదం, సందేశం కలగలిసిన చక్కటి కథాంశంతో కిరాక్ పార్టీ చిత్రం రూపుదిద్దుకుందని ఆ చిత్ర నిర్మాతలలో ఒకరైన అనిల్ సుంకర తెలిపారు. నిఖిల్, సంయుక్తహెగ్డే, సిమ్రాన్ పరీంజా హీరోహీరోయిన్లుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో అనిల్ సుంకర కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆయన మాటల్లో...కన్నడంలో విజయవంతమైన కిరాక్ పార్టీ చిత్రానికి ఇది రీమేక్. అక్కడ ఘన విజయం సాధించడంతో సహజంగానే తెలుగు హక్కుల కోసం గట్టి పోటీ ఎదురైంది. అంత పోటీలో ఈ హక్కులను మేము సొంతం చేసుకున్నాం. ఇంజనీరింగ్ క్యాంపస్ విద్యార్థుల లైఫ్ స్టైల్‌ను ప్రతిబింబించేవిధంగా...సహజత్వానికి చాలా దగ్గరగా ఈ చిత్రం ఉంటుంది. అధికశాతం విద్యార్థులు తమను తాము ఐడింటిఫై చేసుకునేవిధంగా ఈ చిత్రంలోని సన్నివేశాలుంటాయి. ఇంటర్వెల్ ఎపిసోడ్ ఓ హైలైట్. సినిమా పూర్తి వినోదంతో సాగుతూనే చివరి ఇరవై అయిదు నిమిషాలు భావోద్వేగంతో ఉంటూ ప్రేక్షకుల కంట కన్నీళ్లు కూడా పెట్టిస్తుంది. కన్నడ మాతృక మెయిన్ సోల్‌కు ఇబ్బంది లేకుండా మన నేటివిటీకి అనుగుణంగా స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేశాం. కన్నడ సినిమా రెండు గంటల నలభై అయిదు నిమిషాల నిడివి ఉంటే...తెలుగు సినిమా రెండు గంటల ఇరవై అయిదు నిమిషాల నిడివి మాత్రం ఉంటుంది. కన్నడంలో చిన్న పాటలతో కలుపుకుని తొమ్మిది పాటలుంటే తెలుగులో రెండు పాటలను తగ్గించాం. కన్నడంలో కంటే తెలుగులో సినిమా మరింత బాగా వచ్చిందని మేమెంతో సంతోషంగా ఉన్నాం. మా నమ్మకాన్ని ప్రేక్షకులు తప్పకుండా నిజం చేస్తారని అనుకుంటున్నాను. నిఖిల్ తన పాత్రలో ఎంతగానో మెప్పిస్తారు. తెలుగు స్క్రిప్ట్ బాగా రావడంలో చందు మొండేటి, సుధీర్‌వర్మలదే క్రెడిట్. దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి చిత్రాన్ని మలచిన విధానం ప్రశంసనీయం. అతనికి మంచి భవిష్యత్తు ఉంటుంది అని అన్నారు.

ఇక తమ ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తదుపరి చిత్రాల గురించి అనిల్ సుంకర వివరిస్తూ...రాజ్‌తరుణ్ కథానాయకుడిగా తాము నిర్మించిన రాజుగాడు చిత్రం టీజర్‌ను ఉగాదికి, సినిమాను వేసవి సందర్భంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే అల్లరి నరేష్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఇక సురేష్ ప్రొడక్షన్స్, 14 రీల్స్ పతాకాలపై వెంకటేష్, దర్శకుడు తేజ కలయికలో రూపొందే నూతన చిత్రం షూటింగ్ ఈ నెల 26న మొదలు కానుందని ఆయన వెల్లడించారు. ఇందులో శ్రియ కథానాయికగా నటించనున్నట్లు, నారా రోహిత్ ఓ కీలక పాత్ర పోషిస్తారని ఆయన చెప్పారు. అలాగే 14 రీల్స్‌లో మహేష్‌బాబుతో లోగడ దూకుడు, నేనొక్కడినే (1) చిత్రాలను తీశామని, నేనొక్కడినే చిత్రం నిర్మాతలుగా మాకు సంతృప్తిని కలిగించకపోయినా డిస్ట్రిబ్యూటర్లకు ఎలాంటి నష్టాలను కలిగించలేదు అని వివరించారు. మళ్లీ 14 రీల్స్ బేనర్‌లో మహేష్‌బాబు కథానాయకుడిగా ఇంకో సినిమాను చేస్తామని, కాస్త ఆలస్యమైనా సూపర్‌డూపర్ హిట్ చిత్రాన్ని చేయాలన్నదే తమ సంకల్పమని అనిల్ సుంకర తెలిపారు. ఇక తన దర్శకత్వంలో గతంలో వచ్చిన యాక్షన్ 3డి చిత్రం అనుకున్నంతగా ఆడలేదని, ఈ తడవ మంచి స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని మరీ దర్శకత్వం వహించబోతున్నానని ఆయన చెప్పారు. తనకు దర్శకత్వం పట్ల మంచి అభిరుచి ఉన్నప్పటికీ ఒక సినిమాకు నిర్మాతగా మాత్రమే వ్యవహరిస్తున్నప్పుడు దర్శకత్వంలో వేలుపెట్టే అలవాటు తనకు లేదంటూ ముగించారు.

ఒక చిత్రంతో రెండు అరంగేట్రాలు


ఆదా శర్మ

అన్ని కళలు తెలిసిన వాడిని సకల కళా వల్లభుడంటారు. ఇలా నాయికకు కళలన్నీ తెలిస్తే వల్లభి అవుతుంది. ఆదా శర్మ ఇలాంటి వల్లభినే. ఆదా శర్మ ప్రతిభ తెలుసుకుంటే ఆశ్చర్యం కలగక మానదు. ఆమె సంప్రదాయ నృత్యాలు నేర్చుకుంది, ఆధునిక నృత్యాలు సరేసరి, కర్నాటక సంగీతం నేర్చుకుంది, పాటలు బాగా పాడుతుంది. ఏకసంథాగ్రాహి, చదివిన సంభాషణలు పేజీలైనా గుక్కతిప్పుకోకుండా చెప్పేస్తుంది. తమిళనాట ప్రాచీన యుద్ధ విద్యలు నేర్చుకుంది, కర్రసాము లాంటివి ఆమెకు బాగా తెలిసిన విద్యలే. ఆమెకు మానసిక మేధస్సు, శారీరక దృఢత్వం రెండూ కలిసొచ్చిన అంశాలు. అయితే కలిసిరానిదల్లా అదృష్టమే. 1920 చిత్రంతో బాలీవుడ్‌లో, హార్ట్ ఎటాక్ చిత్రంతో తెలుగులో అడుగుపెట్టింది ఆదా. ఆ తర్వాత క్షణం లాంటి హిట్ దక్కినా...ఆమె పట్ల ఆసక్తి పెరగలేదు. ఫలితంగా బాలీవుడ్ వెళ్లింది ఆదా. అక్కడ కమాండో చిత్రంలో నటించి....పోరాటాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె తమిళంలో ప్రభుదేవా సరసన చార్లీ చాప్లిన్ 2 చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో ఆటతో పాటు పాటలు కూడా పాడుతుందట. ఈ సినిమా ఆదా శర్మకు నటిగా తెరంగేట్రంతో పాటు గాయనిగానూ అరంగేట్రం అవుతోంది. కర్నాటక సంగీతం నేర్చుకున్న ఈ సుందరి మాతృభాష కూడా తమిళమే కాబట్టి మధురంగా పాటలు పాడగలదని చిత్ర సంగీత దర్శకుడు, దర్శకుడు నమ్మారట. ఆమెను బతిమాలి మరీ పాడిస్తున్నారట.


కామెడీలో కొత్త ప్రయత్నం


సాక్షి చౌదరి , రాజేంద్రప్రసాద్

కామెడీ సినిమాలలో కొత్తరకమైన ప్రయత్నం ఊ.పె.క ు.హ. (ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి) చిత్రమని కథానాయక ుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయనతో పాటు సాక్షిచౌదరి ప్రధాన పాత్రల్లో నిధి ప్రసాద్ దర్శకత్వంలో జె.బి.క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మించిన ఈ చిత్రం ఆడియో వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన పి.కిరణ్ బిగ్ సీడీని ఆవిష్కరించగా, ఆడియో సీడీలను రాజేంద్రప్రసాద్ విడుదలచేసి, తొలి సీడీని సాక్షిచౌదరికి అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లడుతూ, దాదాపు 80 మంది ఆర్టిస్టులతో ఈ రోజుల్లో సినిమా చేయడమంటే మాటలు కాదు. దానికి ఎంతో అభిరుచి, ఓపిక కావాలి. అవన్నీ దర్శక, నిర్మాతల్లో ఉండటం వల్లే ఇలాంటి చిత్రం రూపుదాల్చింది. అర్బన్ కామెడీతో ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేస్తుంది. గతంలో నేను చేసిన కొన్ని చిన్న సినిమాలు పెద్ద సినిమాల కంటే ఎక్కువ వసూళ్లను సాధించాయి. సంగీత దర్శకుడు అనూప్ క ూడా పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలను కూడా చేస్తుండాలి. ఒకప్పుడు దిలీప్ (ఎ.ఆర్.రెహమాన్), నేను మంచి స్నేహితులం. నేను పది సినిమాలు చేసేటప్పుడు అతను రాజ్‌కోటి దగ్గర పనిచేస్తుండేవాడు. నేటికీ మా స్నేహం అలానే కొనసాగుతూనే ఉంది. అలాగే దర్శకుడు నిధి ప్రసాద్, అనూప్ క ూడా మంచి స్నేహితులు. ఆ స్నేహ ధర్మాన్ని గుర్తుచేసుకుంటూ అనూప్ ఈ సినిమాను చేయడం అభినందనీయం. ఈ సినిమాకు అతను ఇచ్చిన సంగీతం ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అని అన్నారు.

దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని ప్రతీ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. ఎక్కువమంది ఆర్టిస్టులతో షూటింగ్ చేయడం కష్టం. అయినా ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు సహకారంతో షూటింగ్ అంతా సజావుగా సాగిపోయింది. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ పెద్ద సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ నాకోసం ఈ సినిమాను చేశాడు. అనుకున్న సమయానికి పాటలను ఇవ్వలేడేమో అనుకున్నాను. కానీ ప్రతీరోజు టైమ్ ఎక్కువగా కేటాయించుకుని, ఈ సినిమా పూర్తయ్యేందుకు తన సంపూర్ణ సహకారాన్ని అందించారు అని చెప్పారు. సంగీత దర్శకుడు అనూప్ మాట్లాడుతూ, తాను కీబోర్డు ప్లేయర్‌గా ఉన్నప్పట్నుంచి నిధి ప్రసాద్‌తో తనకు మంచి స్నేహం ఉందని, ఓ మంచి హాస్య ప్రధాన చిత్రానికి సంగీతాన్ని అందించడం ఆనందదాయకమని అన్నారు. కథానాయిక సాక్షిచౌదరి మాట్లాడుతూ, వినోదాత్మక చిత్రాలకు ప్రేక్షకులు ఎప్పుడూ పట్టం కడుతూనే ఉన్నారని, ఓ మంచి టీమ్‌తో ఈ చిత్రం చేశానని అన్నారు. ఈ వేడుకలో నటులు రిషి, ఖయ్యూం, నిర్మాత భాగ్యలక్ష్మి, జె.బి.క్రియేషన్స్ అధినేత విక్రమ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నటుడు వంకాయల మృతి


వంకాయల సత్యనారాయణ

సీనియర్ నటుడు వంకాయల సత్యనారాయణ (78) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం వైజాగ్‌లో తుదిశ్వాస విడిచారు. వైజాగ్‌కు చెందిన వంకాయల 28 డిసెంబర్, 1940లో జన్మించారు. నాటకరంగం నుండి సినిమారంగానికి వచ్చారు. క్యారెక్టర్ నటునిగా స్థిరపడ్డారు. దాదాపు 180 చిత్రాలతో పాటుగా పలు టీవీ సీరియల్స్‌లో నటించారు. నీడలేని ఆడది ఆయన తొలి చిత్రం. ఆ తర్వాత సీతామాలక్ష్మి, సూత్రధారులు, ఊరికిచ్చినమాట, విజేత, శ్రీనివాస కల్యాణం, దొంగకోళ్లు వంటి అనేక చిత్రాల్లో నటించారు. కొతకాలంగా సినిమారంగానికి దూరంగా ఉన్నారు. శంకర్‌దాదా జిందాబాద్ ఆయన నటించిన చివరిచిత్రం. వకాయల మృతికి పలువురు సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు.

రెండు గ్యాంగుల మధ్య వెపన్


అవినాష్

మంగళ, క్రిమినల్స్ వంటి చిత్రాలను నిర్మించిన మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ తాజాగా వెపన్ పేరుతో మరో యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. అవినాష్, ప్రదీప్‌రావత్, రాజారాయ్, రాజు, మధుబాబు ప్రధాన పాత్రధారులు. ఆర్.ఎస్.సురేష్ దర్శకత్వంలో శర్మ చుక్కా నిర్మిస్తున్న ఈ చిత్రం చివరి షెడ్యూల్ ఈ నెల 20 నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా నిర్మాత శర్మ చుక్కా మాట్లాడుతూ, ఇప్పటివరకు జరిగిన షెడ్యూల్స్‌తో 90 శాతం చిత్రీకరణ పూర్తయింది.

రామచంద్రాపురం, పసలపూడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగే వార్ నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. కథకు తగ్గట్టుగా టైటిల్‌ను పెట్టాం. దర్శకుడు ప్రతీ ఫ్రేమును ఎంతోబాగా మలుస్తున్నారు. గతంలో మేము నిర్మించిన చిత్రాలు మా బేనర్‌కు ఎంతో గుర్తింపును తెచ్చిపెట్టాయి. మిగిలివున్న షూటిం గ్, నిర్మాణానంతర పనులను పూర్తిచేసి, వేసవిలో ఈ సినిమాను విడుదల చేయనున్నాం అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అనిల్ పి., ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సబ్బారపు ప్రకాష్.

వ్యాంకిష్ మీడియా కొత్త చిత్రం

వ్యాంకిష్ మీడియా పతాకంపై ఆయుష్, వర్ణిక జంటగా నూతన చిత్రం ప్రారంభమైంది. రవికుమార్ పొన్నగంటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షేక్ గౌస్ నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ గుంటూరులో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి స్థానిక శాసన సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్లాప్ నివ్వగా, అర్బన్ ఎస్పీ వైటి నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత షేక్ గౌస్ మాట్లాడుతూ...మంచి ప్రేమ కథతో ఈ సినిమా ఉంటుంది. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తాం. పాటలను కళకత్తా, వైజాగ్, బ్యాంకాక్‌లో రూపొందిస్తాం. సాధ్యమైనంత త్వరగా సినిమా చిత్రీకరణ జరిపి..మే తొలివారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. అన్నారు. ఈ చిత్రానికి సంగీతం - అమ్మపండు, సినిమాటోగ్రఫీ - దుర్గ ప్రసాద్



కాలేజీలో ఆనందం



ప్రతి క్షణాన్ని ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరి మనసులో ఉంటుంది. ముఖ్యంగా కాలేజ్ క్యాంపస్‌లో సరదాగా గడిపే క్షణాలు మాత్రం ప్రతి ఒక్కరికి మరిచిపోలేని గుర్తుగా మిగులుతాయి. భవిష్యత్తుపై బంగారుకలలు కంటూనే కాలేజ్ డేస్‌ని ఆస్వాదిస్తూ ఆనందిస్తుంటారు. ఆ ఆనందాన్ని మరోసారి తెరమీద చూపించడానికి సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్ సన్నాహాలు చేస్తున్నారు. మలయాళంలో హిట్ అయిన ఆనందం అనే చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. గణేష్‌రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నూతన తారాగణం నటించారు.

ప్రేమమ్ ఫేమ్ నివిన్ పాల్ అతిథి పాత్రని పోషించారు. ఆనందం చిత్రానికి వీరా వెంకటేశ్వరరావు (పెదబాబు), విఆర్‌బి. రాజు, రవివర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్. సీతారామరాజు సమర్పకులు. ఆనందం అనువాద పనులు పూర్తయ్యాయి. ఈ నెల 17న పాటలను, సినిమాను ఇదే నెల 23న విడుదల చేస్తున్నాం. సచిన్ వారియర్ స్వరరచన చేశారు. వనమాలి సాహిత్యం అందించారు. హ్యాపీడేస్ తరహాలో మా పాటలు కూడా మంచి విజయం సాధిస్తాయి. ఇది మలయాళ సినిమా లాగా అనిపించదు. కాలేజీ అనుభవాలు ఎక్కడైనా ఒకే విధంగా ఉంటాయి. ఒక ఇండస్ట్రీయల్ టూర్ నాలుగు రోజులు జరిగితే అక్కడ మూడు ప్రేమజంటల కథే మా సినిమా అని అన్నారు.